19-3Pg1exHMNWJQE 1 ONG_19-3Pg1exHMNWJQE.qxd 18/Mar/26 11:42 PM Page 1

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఒంగోలు

epaper.vaartha.com WWW.VAARTHA.COM : fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam

19-3-2026 గురువారం సంపుటి: 32
సంచిక: 47 పేజీలు: 12 వెల: 6.50

శ్రీపరాభవ నామ ఉగాది సందర్భంగా మా పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు శుభాకాంక్షలు

-డా. గిరీష్ కుమార్ సంఘీ
'వార్త' చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్

ఇక ఉద్యమంగా పి-4 కార్యక్రమం

పేదలకు అండగా నిలిచిన వారికి అవార్డులు: సిఎం చంద్రబాబు

విజయవాడ మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి:ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4ను కార్యక్రమంలా కాకుండా ఉద్యమ స్థాయికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని పేదలకు చేయూత ఇచ్చేలా చేపట్టిన ఈ విశిష్ట కార్యక్రమానికి మార్చి 30 తేదీ నాటికి ఏడాది పూర్తి కావొస్తుండటంతో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని సీఎం సూచించారు. తొలి ఏడాదిలో ఇప్పటి వరకూ 2.5 లక్షల మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపామని, బంగారు కుటుంబాలకు చేయూతను ఇవ్వటంలో ఆదర్శంగా నిలిచిన మార్గదర్శులకు అవార్డులు, ప్రశంసా పత్రాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో దీనిపై ప్రణాళికా విభాగం అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష >>2

దివ్యాంగులకు భరోసా

బుధవారం దివ్యాంగునితో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు. చిత్రంలో డి.సిఎం పవన్, మంత్రి లోకేష్

వారికి ఆత్మస్థైర్యం కల్పించే చర్యలు తీసుకొంటున్నాం

రూ.6వేలు పింఛన్ ఇస్తున్న ప్రభుత్వం మాదే

5 రకాల బస్సుల్లో దివ్యాంగులకు ఇక ఉచిత ప్రయాణం: సిఎం చంద్రబాబు

దివ్యాంగులతో కలిసి భోజనం చేసిన సిఎం, మంత్రి లోకేష్

2లో

పోలవరం ప్రాజెక్ట్ 2027లో జాతికి అంకితం

బుధవారం పోలవరం నిర్వాసితులకు చెక్కును అందచేస్తున్న సిఎం చంద్రబాబు

విజయవాడ.మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి: పోలవరం ప్రాజెక్ట్‌ను 2027లో జాతికి అంకిత మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.నిర్వాశితులందరికి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్ట్ ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిరక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు.

నిర్వాశితుల కోసం రూ.226.6 కోట్లు జమ: ప్రాజెక్ట్ కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణం కోసం రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి స్థలం కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు.పోలవరం ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులంతా ప్రజల హృదయాల్లో నిలిచి పోతారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులందరికీ న్యాయం చేసే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. నిర్వాసితులంతా సంతోషంగా ఉండా లన్న లక్ష్యంగా మేం పనిచేస్తున్నాంజగత పాల కుల నిరక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయం చేసి కట్టిన డయాఫ్రాం వాల్ కొట్టుకుపోయింది. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టాం. కాంట్రాక్టర్లను, ఇంజనీర్లను మార్చ కుండా ఉంటే ప్రాజెక్టు పూర్తి అయిపోయేది.67 ఏళ్ల పాటు ప్రాజెక్టు ఆలస్యం అయిపోయింది. నిర్వాసితులు కూడా పూర్తిగా సెటిల్ అయ్యేవారు. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారు. పోలవరం నిర్వాసితుల పట్ల మా ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉంది. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్మెంట్ కూడా చేస్తాం అన్నారు.నిర్వాసితుల నుంచి వచ్చే అభినం దనలు మా అందరికీ గౌరవం. మీకు ఇచ్చిన నిధుల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరు తున్నానన్నారు.

మరో రూ.5 వేల కోట్లు అవసరం: గత పాలకుల నిరక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిరక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యికోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6, 7ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమైపోయిందన్నారు. వారంరోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు: నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

దివ్యాంగులకు భరోసా

బుధవారం దివ్యాంగ లబ్దిదారులతో కలిసి భోజనం చేస్తున్న సిఎం చంద్రబాబు

విజయవాడ.మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి: దివ్యాంగుల్లో ఆత్మస్థయిర్యంతో పాటు,వారికి సంపూర్ణ భరోసాను కలిపిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వాళ్లని సీఎం చంద్రబాబు కొనియాడారు.వారు ఎవ్వరికి తీసిపోనీ సృజనాత్మక శక్తి కలిగి,.అద్భుతాలు చేయగల శక్తివంతులన్నారు.తమ ప్రభుత్వం గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని వివరించారు. ట్రైసైకిళ్లతో పాటు తమ ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లు అందించామని చంద్రబాబు తెలిపారు. దివ్యాంగులకు పింఛను కింద రూ. 6,000 ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తేల్చి చెప్పారు. గతంలో రూ. 500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను ప్రస్తుతం రూ. 6,000 పెంచి ఇస్తున్నామని గుర్తు చేశారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే వారికి రూ.10,000, మంచానికి పరిమితమైన వారికి రూ. 15,000 ఇస్తున్నామని సీఎం వివరించారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ భోజనం చేసారు.ఈ సందర్భంగా దివ్యాంగులతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 21 నెలల్లో కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం నాకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోంది. నేను, పవన్ కళ్యాణ్, లోకేష్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి మీతో ప్రయాణించటం నాకు సంతృప్తిని ఇచ్చింది.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా నెలకు రూ.రెండు వేలు ఆదా: ఇప్పుడు బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఎలాంటి ఖర్చు లేకుండా 5 రకాల బస్సుల్లో దివ్యాంగులు ఇక ఉచితంగా ప్రయాణం చేయవచ్చునని సీఎం వివరించారు. దీని ద్వారా నెలకు రూ. 2,000 వరకు అందరికీ ఆదా అయ్యే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత బాగా జరుపుకోవాలని సీఎం సూచించారు. అంతేకాకుండా అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు.

5 రకాల బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం

బస్సులో సిఎం చంద్రబాబు. డి.సిఎం పవన్ కళ్యాణ్‌లకు టిక్కెట్లు కొనుగోలు చేస్తున్న మంత్రి నారా లోకేష్

దివ్యాంగ శక్తిని ప్రారంభించిన సిఎం చంద్రబాబు

రాష్ట్ర వ్యాప్తంగా 11.16 లక్షల మందికి లబ్ధి

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలోని విభిన్న ప్రతిభావంతులకు ఎపిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేలా దివ్యాంగ శక్తి పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్టాండ్ నుంచి విభిన్న ప్రతిభావంతులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు బస్సు ప్రయాణం చేశారు. మంగళగిరి నుంచి పెనుమాక వరకు పల్లె వెలుగు బస్సులో విభిన్న ప్రతిభావంతులతో కలిసి నేతల ప్రయాణం చేశారు. కూటమి ప్రభుత్వంలో విభిన్న ప్రతిభావంతులకు అందుతున్న సంక్షేమ పథకాలు, వారి బాగోగుల గురించి సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేష్ అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ప్రారంభం సందర్భంగా ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తలు, లబ్దిదారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.దివ్యాంగ శక్తి పథకం కింద విభిన్న ప్రతిభావంతులకు పూర్తిగా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారు. 40 శాతం, లేదా అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న వికలాంగులందరికీ స్త్రీ శక్తి పథకం కింద వర్తించే బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనుంది. వారితో పాటు వచ్చే సహాయకుల కు ఈ బస్సుల్లో 50 శాతం రాయితీ లభించనుం ది. ప్రస్తుతం 1.71 లక్షల విభిన్న ప్రతిభావంతులలకే లబ్ధి చేకూరుతుండగా.. పథకం విస్తరణతో ఇకపై 11.16 లక్షల మందికి ప్రయోజనం కలగనుంది. ఇప్పటి వరకు 33,800 మంది సహాయకులకే రాయితీ లభిస్తుండగా.. ఇకపై 1.60 లక్షల మంది సహాయకులకు 50 శాతం రాయితీ లభించనుంది. దీంతో ప్రయోజనం పొందే మొత్తం లబ్ధిదారుల సంఖ్య 2.05 లక్షల నుంచి 12.76 లక్షలకు పెరగనుంది. ఇప్పటికే వికలాంగులకు, వారి సహాయకులకు మూడేళ్ల కాలానికి ఇచ్చిన పాసులు ఈ కొత్త పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసేందుకు ఉపయోగపడ తాయి. ఉచిత ప్రయాణానికి అవసరమైన డిజిటల్ పాస్‌లు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ యాప్, ఎపిఎస్ఆర్‌టిసి యాప్ ద్వారా పొందొచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎపిఎస్ఆర్‌టిసి బస్టాండ్లలోని 134 కౌంటర్లలో వికలాంగులకు సేవలు అందుతాయి. ఈ యాప్‌లను సదరం యాప్‌తో అనుసంధానించడంతో ఫిజికల్ ధ్రువీకరణ పత్రాలు చూపించాల్సిన అవసరం లేదు. క్యూఆర్ కోడ్‌తో ఉచిత డిజిటల్ పాస్‌లు జారీ చేస్తారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.207 కోట్లు సబ్సిడీ అందించనుంది. దివ్యాంగ శక్తి పథకం లబ్దిదారులతో కలిసి మంగళగిరి నుంచి పెనుమాక వరకు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నారా లోకేష్ ప్రయాణిస్తున్న సందర్భంలో వారికి . దారి పొడుగునా నేతలకు ప్రజలు హర్షాతిరేకాలతో ఎదురేగి వచ్చారు. ప్రజలకు, మూడు పార్టీల కార్యకర్తలకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి నారా లోకేష్ అభివాదం చేసుకుంటూ ముందుకు కదిలారు.

సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్‌లకు టిక్కెట్లు తీసుకున్న మంత్రి నారా లోకేష్

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డీసీఎం పవన్ కళ్యాణ్‌లు దివ్యాంగ శక్తి ప్రారంభం సందర్భంగా నిర్దేశిత పల్లెవెలుగు బస్సులో దివ్యాంగులతో కలిసి ప్రయాణించారు.వారి ముగ్గరికి మంత్రి నారా లోకేష్ స్వయంగా టిక్కెట్లు తీసుకున్నారు.టిక్కెట్లు విషయంలో పవన్,చంద్రబాబు లోకేష్‌ను ఈ విషయంలో వారించబోగా కుటుంబంలో పెద్దల బాధ్యత పిల్లలదే అంటూ టిక్కెట్లుకు డబ్బు చెల్లించారు.ఈ సందర్భంగా బస్సు మహిళా కండక్టర్‌తోను సీఎం చంద్రబాబు ముచ్చటించారు.అమ్మా బస్సులో ఆడబిడ్డలతో పాటు దివ్యాంగుల బాధ్యత మీదేనంటూ వ్యాఖ్యానించారు.

మాది చేతల ప్రభుత్వం: డి.సిఎం పవన్ కళ్యాణ్

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి: సీఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో తమ కూటమి ప్రభుత్వం నిక్కచ్చితనంతో పనిచేస్తోందని ఏపీ డీసీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.దివ్యాంగశక్తి కార్యక్రమం సందర్భంగా దివ్యాంగులతో కలిసి ఆయన బస్సులో ప్రయాణించారు.ఈ సందర్భంగా ఆయన దివ్యాంగులతో స్వయంగా సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాది చేతల ప్రభుత్వం,ఇచ్చిన ప్రతి వాగ్దానం అమలు చేస్తాం అన్నారు.సీఎం చంద్రబాబు దార్శినీకుడన్నారు.ఆయన ప్రతి వర్గానికి ప్రయోజనం కల్పించేదిశలో ఆలోచిస్తారన్నారు.21 నెలల్లో ప్రజల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం అన్నారు.దివ్యాంగ శక్తి పథకం ఎంతో ప్రయోజనకరం అన్నారు.చేయూత ద్వారా దివ్యాంగులకు సహాయం చేయడంలో సీఎం చంద్రబాబు ఎంతో ఆదర్శంగా నిలిచారన్నారు.ట్రై సైకిళ్లతో పాటు ఆత్మవిశ్వాసం నింపేందుకు టూ వీలర్లు అందించారన్నారు.ఎలాంటి ఖర్చు లేకుండా 5 రకాల బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం అందుతుందన్నారు.భవిష్యత్తు సీఎం చంద్రబాబు ఇచ్చిన ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు మరింత ప్రయోజనం లభిస్తుందన్నారు.

దివ్యాంగుల్లోని ప్రతిభకు గుర్తింపు కల్పిస్తాం: మంత్రి లోకేష్

విజయవాడ,మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి: దివ్యాంగుల్లో అపార నైపుణ్యాభివృద్ధి కలిగిన వారున్నారని ఏపీ విద్యా.ఐటి శాఖా మంత్రి నారా లోకేష్ అన్నారు.దివ్యాంగశక్తి కార్యక్రమం ప్రారంభం సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ దివ్యాంగుల్లో అనేక మంది సాంకేతికత,సృజనాత్మక రంగాల్లో నిపుణులున్నారన్నారు.వారి ప్రతిభకు గుర్తింపును ఇస్తామన్నారు.ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం అన్నారు.లోకేష్ దివ్యాంగులతో బస్సు ప్రయాణం అనంతరం తమ ఇంటవారికిచ్చిన విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాం గులకు ఆత్మస్థయిర్యం కల్పిస్తామన్నారు.వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఏపీఎస్ఆర్టీసీ లోని సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. 21 కేటగిరీల్లో 40శాతం కంటే ఎక్కువ వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తూ పథకం అమలు చేయబోతున్నారు. దివ్యాంగులకు వారి సహాయకులతో కలిపి 12.76 లక్షల మంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించేలా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు.ఈ పథకంకోసం ఏటారూ.207 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నామన్నారు.క్వాంటం కంప్యూటిరింగ్ రంగంలో దివ్యాంగులకు ప్రాధాన్యతను ఇస్తామన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఎఎస్ఐ మృతి

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి: కృష్ణా జిల్లా యనమలకుదురులో ఓ ఏఎస్ఐ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపుతోంది. విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న వీరవల్లి గోపి వెంకట దుర్గాప్రసాద్ (54) మృతదేహం కరకట్ట శివారులోని ఒక పాకలో లభ్యమైంది.ఒక కేసు విషయంలో 15 రోజుల క్రితమే దుర్గాప్రసాద్ సస్పెన్షన్‌కు గురయ్యారు. విధులకు దూరం కావడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి లోనయ్యారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన మృతదేహం నిర్జన ప్రదేశంలో కనిపించడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం అందుకున్న పెనమలూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దుర్గాప్రసాద్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇది ఆత్మహత్యా? లేక ఎవరైనా హతమార్చారా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి బెయిల్ మంజూరు

వెంకట్రామిరెడ్డికి నిరాకరణ

మాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గురజాల కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వెల్దుర్తి మండలం గుండ్లపాడు జంట హత్యల కేసులో ఎ6గా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి 98 రోజులుగా నెల్లూరు సెంట్రల్ జైల్లో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. బెయిల్ మంజూరుతో ఆయన విడుదలకు మార్గం సుగమమైంది. అయితే ఈ కేసులో ఎ7గా ఉన్న ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డికి మాత్రంగురజాల కోర్టు బెయిల్ నిరాకరించింది. కేసు తీవ్రత దృష్ట్యా ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటీషన్‌పై విచారణ జరిపిన కోర్టు బెయిల్‌ను తిరస్కరించింది.

ఇక ఉద్యమంగా పి-4 కార్యక్రమం

>> నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో మార్చి 30 తేదీన పీ4 పై ఆయా జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 30 తేదీన తిరుపతిలో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని చేపట్టేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. రాష్ట్రస్థాయిలో ఆదర్శ మార్గదర్శి, జ్ఞాన మార్గదర్శి, సామాజిక సహకార మార్గదర్శి పేరిట అవార్డులు ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో విశిష్ట మార్గదర్శి పేరిట ఒక అవార్డు, మరో ముగ్గురికి ప్రశంసా పత్రాలు ఇవ్వనున్నారు. నియోజకవర్గ స్థాయిలో ముగ్గురు మార్గదర్శులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు. జిల్లా స్థాయిలో జరిగే పీ4 తొలి ఏడాది కార్యక్రమానికి జిల్లా ఇంఛార్జి మంత్రులు, నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధులు హాజరు కావాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తొలగించేలా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో మిగతా వారికి స్పూర్తిని నింపేలా బంగారు కుటుంబాలు, వారికి చేయూత ఇచ్చిన మార్గదర్శుల కు సంబంధించిన ప్రచార చిత్రాలను కూడా సిద్ధం చేయాలని సీఎం నిర్దేశించారు. వసుధైక కుటుంబం అనే థీమ్ తో గివ్ బ్యాక్ టుది సొసైటీ అనే నినాదంతో విస్తృత ప్రచారం జరగాలన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబానికీ మెరుగైన జీవన ప్రమాణాలు, భవిష్యత్తును అందించేలా చేపడుతున్న విశిష్ట ఉద్యమంగా పీ4 నిలిచిపోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

తెలుగు ప్రజలకు సిఎం చంద్రబాబు ఉగాది శుభాకాంక్షలు

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి: తెలుగు ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉగాది శుభాకాంక్షలు సామాజిక మాధ్యమం వేదిక తెలిపారు.ఎక్స్‌లో చేసిన పోస్టులో సీఎం చంద్రబాబు ఇలా పేర్కొన్నారు."షడ్రుచుల సమ్మేళనం, పరవశింపచేసే వసంతకాల ఆగమనం, అన్నింటినీ మించిన ఆనందం, భావి జీవితంపై ఆశ రేకెత్తించే శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా తెలుగు ప్రజలందరికి శుభాకాంక్షలు. ఈ నూతన సంవత్సరం మీ అందరి జీవితాల్లో కొత్త వెలుగు తేవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాను. మీరు, మీ కుటుంబ సభ్యులు అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో తులతూగాలని, మీ ఆశలు, ఆకాంక్షలు తీరి, జీవన సాఫల్య ప్రయోజనాలు సిద్ధించాలని కోరుకుంటున్నాను. పేదరికం లేని సమ సమాజ నిర్మాణం కోసం మనం తలపెట్టిన పీ4 తో బాటు, వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందరూ అందిపుచ్చుకుని పురోగమించాలి. స్వర్ణాంధ్ర విజన్ 2047 విజయవంతంగా ముందుకు సాగాలని పేర్కొన్నారు.

'కల్తీ' నెయ్యిలో విచారణకు ఇక నోటీసులు: దినేశ్‌కుమార్

తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి: దేశవ్యాప్తంగా శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ,సంచలనం రేకెత్తించిన తిరుమల కల్తీనెయ్యి బాగోతంలో గత పదిరోజులుగా క్షుణ్ణంగా రికార్డులు పరిశీలించిన ఏకసభ్యకమిటీ విశ్రాంత ఐఎఎస్అధికారి,విశ్రాంత సిఎస్ దినేశ్‌కుమార్ ఇక సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీచేసి విచారణ చేపట్టనున్నారనేది తెలుస్తోంది. ఇప్పటికే ఆయన ఈ కేసులో నిశితంగా ఆధారాలు, రికార్డులు పరిశీలించారు. ఇప్పుడు కొందరిని పిలిచి విచారణ చేస్తే మరికొంత సమాచారం వెలుగుచూడనుంది. బుధవారం ఉదయం ఏకసభ్యకమిటీ దినేశ్‌కుమార్ తిరుమలకు చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడటానికి విముఖత చూపారు. అయితే ఈ కేసులో ఇప్పుడు కొత్త కోణంలో విచారణ సాగనుందనేది తెలుస్తోంది. తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి వాడారనే విషయంలో ఇప్పటికే సిబిఐ సిట్ అధికారులు అందించిన నివేదికల ఆధారంగా టిటిడి వద్ద ఉన్న రికార్డులను తెప్పించుకుని క్షుణ్ణంగా పరిశీలన చేశారు. 2019-2024 మధ్య కాలంలో అప్పటి వైసిపి ప్రభుత్వ హయాంలోని వైసిపి బోర్డు పెద్దలు శ్రీవారి లడ్డూల తయారీకి అవసరమైన స్వచ్ఛమైన ఆవునెయ్యి సరఫరా కోసం టెండర్లు పిలవడం, ఆ టెండర్లలో ఎక్కడెక్కడ నుండి ఏప డెయిరీ సంస్థలు పాల్గొన్నాయి,ఏజెన్సీలు టెండర్లు వేయడం, అర్హత ఏ మేరకు ఉంది,ఆ తరువాత ఎలా టెండర్లు పరిశీలన చేసి నెయ్యి సరఫరాకు అనుమతించారు,దీనివెనుక టిటిడి పెద్దలు కలగజేసుకుని మద్దతు ఎంతవరకు ఉందనే రికార్డులు పరిశీలన చేయడం జరిగింది. ఆయనకు టిటిడికి చెందిన ఎఇఒ ప్రాపర్టీస్‌సెల్ ఎన్.రవినిసహాయకుడిగా కేటాయించారు. ఇంకా విశ్రాంత అటవీఅధికారి మునీంద్ర, విశ్రాంత అధికారి శివకుమార్ ,ఆర్టీజీఎస్ డిప్యూటీ సిఇఒ మాధురి ఆ కమిటీలో ఉన్నారు. ఆయన లోతుగా అధ్యయనం చేసి సమగ్ర సమాచారంతో నెయ్యిలో కల్తీ జరగడానికి ప్రధాన కారణాలు, టెండర్లు ఎలా దక్కించుకుని,ఆ తరువాత నిబంధనలు ఉల్లంఘించి సరఫరా చేశారు, నెయ్యిట్యాంకర్లను తనిఖీ చేసి నాణ్యత పరీక్షించకుండానే వినియోగించిన విధానం వంటి అంశాలను ఇప్పుడు వెలుగులోకి తీసుకురానున్నారు. విచారణకు పిలవాల్సిన వ్యక్తులు,నిందితుల జాబితా సిద్దంచేసుకున్నట్లు తెలుస్తోంది. మరో 35రోజుల్లో ఈ విచారణ నివేదికలను ప్రభుత్వానికి అందిం చాల్సి ఉండటంతో ఇక వేగం అందుకోనుంది. టిటిడి మార్కెటింగ్, కొనుగోళ్ళ కమిటీ, పోటు విభాగంతో బాటు తిరుచానూరు మార్కెట్ కమిటీ ఉద్యోగులు, కొనుగోళ్ళ కమిటీ,పూర్వ టిటిడి ఇఒ,అదనపు ఇఒలు కీలకంగా ఉన్నారు.

చిన్న కాంట్రాక్టర్లకు ఊరట కల్పించిన ప్రభుత్వం

విజయవాడ.మార్చి 18,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులు చేపట్టిన చిన్న కాంట్రాక్టర్లకు ప్రభుత్వం ఊరట కల్పించింది.వేల మంది చిన్న కాంట్రాక్టర్లకు రూ.2 వేల కోట్ల బిల్లుల చెల్లింపునకు ఆర్థికశాఖ ఆదేశాలు జారీ చేసింది.ప్రణాళికాబద్ధంగా పెండింగ్ బిల్లులు చెల్లించాలని సీఎం చంద్రబాబు సూచన బిల్లుల చెల్లింపులపై 2 రోజులుగా ఆర్థిక మంత్రి పయ్యావుల కసరత్తు చేసారు.ఇటీవలే అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ పథకం కింద రైతులకు మూడో విడత చెల్లింపులు చేసారు.ఉగాది నాటికి కొన్ని బిల్లులు చెల్లించేలా చూడాలని సీఎం సూచించడంతో చిన్న కాంట్రాక్టర్లకు ఊరట ఇవ్వాలనే ఉద్దేశంతో బిల్లులు విడుదల ప్రభుత్వం ఆర్థిక శాఖ బిల్లు చేసింది.డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎస్డీఆర్ఎఫ్ఎస్డీఎంఎఫ్‌వంటి హెడ్స్ కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లింపులు చేస్తారు. రూ.కోటిలోపు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లే అత్యధికంగా ఉన్నారని ఆర్థికశాఖ వెల్లడించింది.

పలు జిల్లాలకు పిడుగుపాటుతో కూడిన వర్షాలు

విజయవాడ మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగుపాటుతో కూడిన వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాగల మూడు గంటల్లో పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, ప్రకాశం జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కోనసీమ, సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు చెప్పింది. ఆయా ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. మరోవైపు గన్నవరం విమానాశ్రయంలో భారీ ఈదురుగాలులు వీస్తున్నాయి. ఢిల్లీ నుంచి విజయవాడ వచ్చిన ఇండిగో విమానం, ప్రతికూల వాతావరణంలో ఇక్కడ దిగలేదు.ఈ క్రమంలో ఎన్టీఆర్, గుంటూరు, ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసాయి. విజయవాడలో ఓ మోస్తరు వాన కురిసింది.

వారం - వర్జ్యం

19-03-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
● అమావాస్య ఉ.6.53, పాడ్యమి తె.4.51
ఉత్తరాభాద్ర తె.4.03
వర్జ్యం : ఉ.2.26-3.52
దు.ఉ.10.14-11.02,
మ.3.04-3.52
రాహుకాలం - మ.1.30-3.00

వార్తాఫలం

మేషం: కీలక నిర్ణయాలలో నిదానం అవసరం. శ్రేయోభిలాషులతో సలహాలు సంప్రదింపులు జరుపుతారు. తద్వారా లాభపడతారు.

వృషభం: న కాలంలో వనులు పూర్తిచేయటానికి విఫలయత్నం చేస్తారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు.

మిథునం: విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వస్తు భద్రత పట్ల మెలుకువలు అవసరం. విదేశీయాన యత్నాలు ఫలిస్తాయి.

కర్కాటకం: కార్యాలయాలలో అధికారుల ప్రశంసలు పొందుతారు. దూరప్రాంతాల నుండి అనుకూలమైన సమాచారాన్ని అందుకుంటారు.

సింహం: మీ ప్రమేయం లేకుండానే వివాదాలలోకి లాగబడే సూచనలు ఉన్నాయి. జాగ్రత్తలు పాటించండి.

కన్య : కొత్త వ్యాపారాల ప్రయాణాలు ముమ్మరం చేస్తారు. వ లుకుబడి నామమాత్రంగా పెరుగుతోంది. ఋణబాధలు తప్పవు.

తుల : స్థిరమైన నిర్ణయాలు సరిగ్గా తీసుకోలేరు. ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో మెలుకువ అవసరం.

వృశ్చికం: కుటుంబ కలహాలు మీ ప్రశాంతతకు భంగం కలిగించే సూచనలు ఉన్నాయి. ఇంటా బయటా కొంత అనుకూలం. వాహనసౌఖ్యం.

ధనుస్సు: దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని నూతన అంశాలను కూడా పరిగణలోనికి తీసుకుంటారు.

మకరం: ఊహించని ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు. మిత్రత్వానికి దారి తీస్తాయి. కాంట్రాక్టులు లాభిస్తాయి.

కుంభం: గతంలో మీతో శతృత్వం వహించినవారు ఇప్పుడు మీతో మిత్రత్వం వహించడానికి రాయబారం నడుపుతారు.

మీనం: పంతాలు పట్టింపులకు పోకుండా సామరస్యంగా పరిష్కరించుకుంటారు. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

పుట్టా మహేశ్‌పై క్రమశిక్షణ చర్యలు!

సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం

విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి: టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ వ్యవహారంలో ఏపీ సీఎం. తెలుగుదశం నేత చంద్రబాబు తీవ్ర అసహనంతో ఉన్నారు.ఆయనపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే దిశగా సీఎం చంద్రబాబు అన్నట్లు సమాచారం.పుట్టా మహేష్ డ్రగ్స్ తీసుకోవడమే కాకుండా. పోలీసులపై తన మిత్రులు తెగబడుతుంటే ప్రోత్సహించారనే అభియోగాలున్నాయి.ఈ అంశం మొయినాబాద్ పోలీసుల వెల్లడించిన సందర్భంలోనే సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.పార్టీ కార్యకలపాలకు ఆయనను దూరంగా ఉంచాలని టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు కృష్ణ దేవరాయాలను ఆయన ఆదేశించారు.వారి ద్వారా మహేష్‌కు నోటీసులు జారీ చేసారు.తాజాగా న చిత్తూరు టీడీపీ నేతలను తన వద్దకు పిలుపించుకున్నారు.తిరుపతి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పుట్టా మహేశ్ కుమార్ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. యువకుడు.. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారని అతడికి అవకాశమిచ్చామని వివరించారు. కానీ ఆయన ఈ విధంగా వ్యవహారించారన్నారు. అసలు ఆ పార్టీలకు వెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందంటూ ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేష్‌ను ఉద్దేశించి పార్టీని ఇబ్బందుల్లోకి నెట్టే ఇలాంటి వాళ్లను మోయాలా..? అంటూ అసహనం వ్యక్తం చేశారు. యువకుడు.. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారని అతడికి అవకాశమిచ్చామని వివరించారు. కానీ ఆయన ఈ విధంగా వ్యవహరించారని మండిపడ్డారు. దీంతో, ఇక మహేష్ కు పార్టీ పరంగా అవకాశాలు కష్టమనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.గతంలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వాళ్లు ఎంతటి పెద్ద వాళ్లైనా ఉపేక్షి ంచకుండా చర్యలు తీసుకున్నానని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. క్రమశిక్షణ, విలువలు పాటించకుండా రాజకీయం చేయాలనుకోవడం కరెక్ట్ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. టీడీపీలో నాయకులంతా క్రమశిక్షణతో మెలగాల్సిందేనని.. ఎవరికీ వెసులుబాటు ఉండదని ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.గతంలో క్రమశిక్షణ ఉల్లంఘించిన వారు ఎంతటి పెద్ద వాళ్లైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకున్నానన్న సీఎం, విలువలు పాటించకుండా రాజకీయం చేయాలనుకోవడం సరికాదని తేల్చిచెప్పారు.. ఎమ్మెల్యేలు కార్యకర్తలకు, ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రజల్లో ఉండే నాయకుడే సుదీర్ఘ రాజకీయాలు చేయగలరని అభిప్రాయపడ్డారు.ఈ భేటిలో ఎమ్మెల్యేల పనితీరే కాకుండా వివిధ విభాగాల్లో జిల్లాల్లో అధికారుల పనితీరుపైనా నివేదికల ఆధారంగా సీఎం ప్రశ్నించినట్లు తెలిసింది.

ఎపి సిఆర్‌డిఎకు ప్రతిష్టాత్మక అవార్డు 'ది ఎకనామిక్ టైమ్స్ గౌవ్‌టెక్' అవార్డు2026

'అమరావతి ఇంటిగ్రేటెడ్ డిజిటల్ అర్బన్ ప్లానింగ్ అండ్ గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్' జాతీయ స్థాయి గుర్తింపు

- ఢిల్లీలో నేడు ప్రదానం

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:ప్రజారాజధాని అమరావతి అభివృద్ధిలో భాగంగా అమలు చేస్తున్న డిజిటల్ ప్రణాళికా విధానానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (సీఆర్డీఏ) రూపొందించిన "అమరావతి ఇంటిగ్రేటెడ్ డిజిటల్ అర్బన్ ప్లానింగ్ అండ్ గవ ర్నెన్స్ ప్లాట్ ఫామ్"కు తాజాగా ఎకనామిక్ టైమ్స్ గౌవ్‌టెక్ అవార్డ్స్ 2026లో గోల్డ్ అవార్డు లభించింది. ఈ మేరకు ఎకనామిక్ టైమ్స్ సంస్థ సీఆర్డీఏ కమిషనర్ కూనపరెడ్డి కన్నబాబుకు తాజాగా శుభాకాంక్షలు చెబుతూ సమాచారం తెలియ జేసింది. అమరావతి డిజిటల్ ట్విన్, ఐసీటీ ప్లాట్‌ఫామ్‌లు అలాగే అమరావతి మాస్టర్ ప్లాన్ ఆధారంగా రూపొందించిన ఈ డిజిటల్ ప్లాట్‌ఫామ్ స్మార్ట్ సిటీస్ అర్బన్ టెక్ లీడర్‌షిప్ విభాగంలో గోల్డ్ అవార్డుకు ఎంపికైంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో అమలు చేస్తున్న ఉత్తమ సాంకేతిక ప్రాజెక్టులను గుర్తించి ఈ అవార్డులను ఎకనామిక్ టైమ్స్ ప్రధానం చేయనుంది. ప్రముఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారులతో కూడిన జ్యూరీ ఈ అవార్డు గ్రహీతలను ఎంపిక చేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రహదారులు మరియు భవనముల శాఖ

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.94-98/టీఓ/2025-26 తేది: 12.03.2026

మార్కాపురం జిల్లా రహదారులు మరియు భవనముల శాఖ మార్కాపురం డివిజన్ క్రింద షార్ట్ కాల్ టెండర్ నిట్ నెం. 94-98 పనుల కోసం ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా వ్యయం: రూ.23.10 లక్షలు. టెండర్ డాక్యుమెంట్లను ఇ-మార్కెట్ ప్లేస్ www.tender.apeprocurement.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండరు సమర్పించు చివరి తేది: 28.03.2026. ఫోన్ నెం. 9440818993.

సం/-. కార్యనిర్వాహక ఇంజనీరు, రహదారులు & భవనముల శాఖ, మార్కాపురం.

DIPR.NO. 19407/CL/ADVT/1/1/2022-23 తేది: 18.03.2026

Ref B1/48/2025 dt.18.03.2026

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

ఫారం నెం -VII

(2013 వ సంవత్సరం 30 వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలో న్యాయపరమైన నష్ట పరిహారం పొంది హక్కు, పారదర్శకత చట్టం లో సెక్షన్ -19(1) మరియు ఆంధ్ర ప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ 25, సబ్ రూల్ 1 ని అనుసరించి.

రూఢి ప్రకటన

ఈ క్రింది షెడ్యూల్ లో నిర్దిష్ట పరిచిన భూములను మరియు వాటి విస్తీర్ణం ఎ.21.32 సెంట్లు భూమిని ప్రజా ప్రయోజనముకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు ముంపునకు గురయ్యే నిమ్మితం ఏలూరు జిల్లా, బుట్టాయిగూడెం మండలం, బుట్టాయిగూడెం గ్రామమునకు సంబంధించిన భూములు అవసరంయానివి స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు, రాజమహేంద్ర వరం, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారు భావించి నందున 2013 వ సంవత్సరం 30 వ చట్టం లో 15 వ విభాగమునననుసరించి సంబంధిత వ్యక్తుల నుంచి వచ్చిన అభ్యంతరములపై విచారణ జరిపిన పిమ్మట స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు, రాజమహేంద్ర వరం, వారు సంతృప్తి చెంది ఈ దిగువ షెడ్యూల్ భాఖల భూములను ప్రజా ప్రయోజనాల నిమ్మితం భూసేకరణ గావించుటకు నిర్ణయించారు. మరియు భూసేకరణ కోరిన సంస్థ వారు అవసరమగు బడ్జెట్ లను సమకూర్చినారు. ఈ క్రింది రూఢి ప్రకటన 2013 వ సంవత్సరం 30 వ చట్టం లో 19(1) వ విభాగమునననుసరించి చేయబడినది.

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ కు, రాజమహేంద్ర వరం, 30 వ చట్టం లో 19(1) వ విభాగమునననుసరించి ఈ దిగువనుదహరించిన షెడ్యూల్ దాకలు భూములు మరియు వాటి విస్తీర్ణం ఎ.21.32 సెంట్లు భూమిని ప్రజా ప్రయోజనముకై అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ ముంపునకు గురయ్యే నిమ్మితం అవసరమైనవని ఇందుమూలంగా ప్రకటన చేసియున్నారు.

షెడ్యూల్

జిల్లా: ఏలూరు				మండలం : బుట్టాయిగూడెం		గ్రామం: బుట్టాయిగూడెం				
క్రమ సంఖ్య	సర్వే నెంబరు	భూసేకరణ క్రింద విస్తీర్ణం (యు.సెంట్లు)	భూమి తరగతి	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	భూమితో సంబంధం ఉన్న వ్యక్తి పేరు /ఆసక్తి గల వారు మరియు చిరునామా	సరిహద్దులు: తూర్పు	పడమర	ఉత్తరము	దక్షిణం	చెట్లు కట్టడములు ఇతరముల వివరములు
1	260-5	0.94	మెరక	ఆచంట విష్ణుమూర్తి	ఆచంట విష్ణుమూర్తి	260-2	258-3	261-2	260-5	పామ్ ఆయిల్ -66, వేప -2, కొబ్బరి-5, డ్రిప్ పైప్ లైన్-1
	258-2	0.54	మెరక			231-4	255-1	258-2	258-1	పామ్ ఆయిల్ -41, జామ్ ఆయిల్ -2, తాడి -2, డ్రిప్ పైప్ లైన్ -1
	256-3A	1.35	మెరక			256-2	252	257-2	256-3	పామ్ ఆయిల్ -90, కుంకుడు -1, వేప -1, వెదురు-3, డ్రిప్ పైప్ లైన్ -1
2	256-2	1.30	మెరక	గూడపల్లి సత్యనారాయణ	గూడపల్లి సత్యనారాయణ	255-2	256-2	256-3	256-1	పామ్ ఆయిల్ -78, వెదురు -5, డ్రిప్ పైప్ లైన్ -1
	258-1	0.79	మెరక			258-1	258-2	258-3	260-2	6 ఫీట్ పోల్స్ -365, 8 ఫీట్ పోల్స్ -200, డ్రాగన్ ఫ్రూట్స్ రింగ్స్- 365, డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు - 1460
	260-3	0.94	మెరక			260-2	260-3	261-2	260-1	పోల్స్ (6 ఫీట్) -535, డ్రాగన్ ఫ్రూట్స్ రింగ్స్ -495, డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు -4180, కొబ్బరి -2, జామ-2, చెర్రీస్ చెట్టు -1, అరటి-4, బొప్పాయి -1, బోర్-1, డ్రిప్ పైప్ లైన్ -1, ఐరన్ గేటు -1
3	260-3	0.94	మెరక	గూడపల్లి శ్రీనివాసరావు	గూడపల్లి శ్రీనివాసరావు	260-2	260-5	261-2	260-3	పోల్స్ 6 ఫీట్ -496, డ్రాగన్ ఫ్రూట్స్ రింగ్స్ -496, డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు-1984, ఫెన్సింగ్ 6 ఫీట్-20, డ్రిప్ పైప్ లైన్ -1
	258-1	0.79	మెరక			231-4	258-2	258-3	260-2	పోల్స్ 6 ఫీట్ -365, డ్రాగన్ ఫ్రూట్ రింగ్ -365, డ్రాగన్ ఫ్రూట్ మొక్కలు -1460, పోల్స్ 8 ఫీట్ -200, డ్రిప్ పైప్ లైన్ -1, కొబ్బరి -2
	256-2	1.29	మెరక	గూడపల్లి శ్రీనివాసరావు	గూడపల్లి శ్రీనివాసరావు	255-2	252	256-3	256-2	పామ్ ఆయిల్ -78, అరటి -10, వెదురు -5, షెడ్-1, బోర్-1, డ్రిప్ పైప్ లైన్ -1
4	256-3A	1.35	మెరక	ఆచంట గంగరాజు	ఆచంట గంగరాజు	256-2	256-3	257-1	256-1	పామ్ ఆయిల్ -90, డ్రిప్ పైప్ లైన్ -1
	258-2	0.55	మెరక			258-2	255-1	258-3	258-1	పామ్ ఆయిల్ -35
	260-4	0.05	మెరక			260-2	260-5	260-3, 260-5	260-3	బోరు -1
	260-5	0.94	మెరక			260-2	260-5	261-2	260-3	పామ్ ఆయిల్ -63, మామిడి 01, వేప -1, డ్రిప్ పైప్ లైన్ -1
5	256-1	1.60	మెరక	కూచిపూడి హనుమంతురావు	కూచిపూడి హనుమంతురావు	255-1	256-2, 256-3	257-1	258-3	తాడి -1, బోర్-1, డ్రిప్ పైప్ లైన్ -1
	261-2	2.03	మెరక			260-3	261-2	263-1	261-1	జామ -1, చింత -1, తాడి -5, బోర్-1, డ్రిప్ పైప్ లైన్ -1
6	258-3	1.51	మెరక	కూచిపూడి సీతారామయ్య	కూచిపూడి సీతారామయ్య	258-1, 258-2	255, 256	258-3	260-2, 260-5	జామ -2, బోర్-1, షెడ్-1, డ్రిప్ పైప్ లైన్ -1
	264-1	0.96	మెరక			258-3	257-1, 278-1	264-2	261-2	డ్రిప్ పైప్ లైన్ -1, మునగ చెట్టు -1
7	261-2	1.45	మెరక	కూచిపూడి దొర అబ్బాయ్	కూచిపూడి దొర అబ్బాయ్	260-5	258-3	263-1	261-2	ఉడిగ -1, డ్రిప్ పైప్ లైన్ -1
	258-3	2.00	మెరక			258-3	257-1	264-1	260-5, 261-2	డ్రిప్ పైప్ లైన్ -1, జామాయిల్ -2
మొత్తం :	21.32									

ఈ భూముల ప్లాన్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్ వి.ఆర్ పురం యూనిట్-II, చింతూరు నందు ఉంచడమైనది. దానిని ఈ కార్యాలయపు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చును.ఈ భూసేకరణ వలన నిర్వాసితులయిన ఎవ్వరును లేరు.

బొగ్గు గనులు, ఇనుప రాయి, పలక రాయి లేదా ఇతర ఖనిజ సంపద సదరుభూమిలో గాని లేదా ఒక ప్రత్యేక భాగములో గాని ఉంటే అటువంటి భూములలో ప్రాజెక్ట్ నిర్మాణమునకు అవసరమైన ఖనిజములను మాత్రమే త్రవ్వుట గాని తలగించుట గాని చేయవలెను.

Place: వి.ఆర్.పురం యూనిట్ - 2
Date : 18-03-2026

వి.అభిషేక్ ఐ.ఎ.ఎస్
స్పెషల్ కలెక్టర్ (భూ.సే) (ఎఫ్.ఎ.సి),
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
రాజమహేంద్రవరం

కె.ఆంజనేయులు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు,
వి.ఆర్.పురం యూనిట్ - 2,
చింతూరు.

అవినాశ్‌రెడ్డి మూడోరోజు విచారణ

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:మద్యం కేసు నిందితుడు ముప్పిడి అవినాష్‌రెడ్డిని బుధవారం మూడో రోజు సిట్ కస్టడీలోకి తీసుకుని విచారించింది. గుంటూరు జిల్లా జైలు నుంచి విజయవాడ సిట్ కార్యాలయానికి సిట్ విచారణ తరలించారు. విజయవాడ సిట్ కార్యాలయంలో ముప్పిడిని ప్రశ్నింస్తున్నారు. కోర్టు ఆదేశాలను అనుసరించి ముప్పిడి అవినాష్‌రెడ్డి కస్టడీ విచారణ ముగియనున్నది. మద్యం కేసులో ఏ7 నిందితుడిగా ఉన్న ముప్పిడి అవినాష్‌రెడ్డిఏ1 రాజ్ కెసిరెడ్డికి ముప్పిడి అవినాష్‌రెడ్డి సమీప బంధువు షెల్ కంపెనీల ద్వారా మద్యం ముడుపుల తరలింపులో ముప్పిడిది కీలకపాత్రని సిట్ వెల్లడి ముడుపుల నగదు తరలింపుపై మరిన్ని విషయాలు సిట్ రాబట్టనున్నట్లు తెలిపారు.

గుడివాడలోని మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్ నివాసంలో భారీ చోరీ

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి:గుడివాడలోని మాజీ మంత్రి కఠారి ఈశ్వర్‌కుమార్ నివాసంలో జరిగిన భారీ చోరీ స్థానికంగా కలకలం రేపుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని దుండగులు ఈ దొంగతనానికి పాల్పడ్డారు.కఠారి ఈశ్వంకుమార్ వ్యాపార పనుల నిమిత్తం హైదరాబాద్, బెంగళూరులో ఉంటుండగా, ఆయన భార్య మధురిమ రెండు రోజుల క్రితం వ్యక్తిగత పని మీద హైదరాబాద్ వెళ్లారు. ఈ ఉదయం ఆమె తిరిగి గుడివాడలోని ఇంటికి చేరుకోగా, ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని ఆమె గమనించారు. లోపలికి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో, ఇంట్లో దొంగతనం జరిగినట్టు ఆమె గుర్తించారు. ఈ దొంగతనంలో సుమారు 10 కిలోల వెండి వస్తువులు, ఖరీదైన పూజా సామగ్రి అపహరణకు గురైనట్లు గుర్తించారు. మధురిమ ఫిర్యాదు మేరకు గుడివాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్ రంగంలోకి దిగి వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరిస్తోంది.ప్లాన్‌తోనే ఈ చోరీ జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

రేపు తిరుమలకు సిఎం చంద్రబాబు

-కుటుంబంతో కలసి శ్రీవారి దర్శనం

- 21న మనవడు దేవాన్ష్‌పేరున అన్నదానం

తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబంతో కలసి రేపు తిరుమలకు వస్తున్నారు. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు 21వతేదీ సందర్భంగా కుటుంబ సభ్యులు భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్‌తో కలసి వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకుంటారు. అనంతరం అన్నప్రసాద భవనంకు చేరుకుని 44లక్షల రూపాయలు విరాళాలందిస్తారు. దేవాన్ష్ పేరున భక్తులకు అన్నదానం చేస్తారు.

నేడు ఏడుకొండలస్వామికి

ఉగాది ఆస్థానం

తిరుమల,మార్చి 18ప్రభాతవార్తప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి తెలుగునూతన సంవత్సరం పరాభవనామ "ఉగాది" పర్వదినం సందర్భంగా నేడు ఉగాది ఆస్థానం నిర్వహించనున్నారు. వేంకటేశ్వరస్వామి కొలు వైన మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు కొత్త వస్త్రాలు సమర్పిస్తారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారి సన్నిధిలో కొత్త సంవత్సరానికి సంబంధించిన పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానం ఉదయం 7గంటల నుండి 9గంటల వరకు జరుగుతుంది.

AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001 (CIN: L36911RJ1996PLC011381)

అనుబంధం-IV (8 (1) నిబంధన చూడండి) స్వాధీనతా ప్రకటన

"ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్", "AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్"తో ఏప్రిల్ 01, 2024 నుండి విలీనం అయిందని రుణగ్రహీతలందరికీ మరియు ప్రజలకు తెలియజేయడానికి ఇది. అయితే, కింద సంతకందారు "సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) కింద AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారి మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3తో చదువబడిన సెక్షన్ 13 (12) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ క్రింద పేర్కొన్న తేదీన డిమాండ్ నోటీసు జారీ చేశారు. దిగువ పేర్కొన్న తేదీకి రుణగ్రహీతలు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించాలని పిలుపునిచ్చారు:-

రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తనఖాదారు/ హామీదారు పేరు/రుణ ఖాతా నం.	13(2) నోటీసు తేది మరియు మొత్తం	స్వాధీనం చేసుకున్న తేది
(లోన్ ఎ/సి నెం.), 23660002403517, మంటినూనే ఖాసీం, మంటినూనే తాహెరున్	29-డిసెంబర్-25 రూ. 8,88,101/- (రూపాయలు ఎనిమిది లక్షల ఎనభై ఎనిమిది వేల నూట ఒకటి మాత్రమే) 24-డిసెంబర్-25 నాటికి	16-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సర్వే నం. 606/3, ఇంటి నం. 1-169, 1వ వార్డు, అసెస్మెంట్ నం. 169, గాజులపల్లె గ్రామ పంచాయితీ మరియు గ్రామం, మహానంది మండలం, నంద్యాల జిల్లా, నంద్యాల ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల జిల్లా ఇంటి నం. 1-169 మరియు అసెస్మెంట్ నం. 169 పరిధిలోకి వచ్చేది. సర్వే నం. 606/3, విస్తీర్ణం: 72.33 చదరపు గజాలు. నిర్మించిన విస్తీర్ణం (బిల్ట్-అప్-ఏరియా): GF + 2 అంతస్తులు = 650 చదరపు అడుగులు. కొలతలు: తూర్పు-పడమర వైపు 21 అడుగులు, ఉత్తర-దక్షిణ వైపు 31 అడుగులు. మొత్తం విస్తీర్ణం: 51 చదరపు గజాలు. సరిహద్దులు: తూర్పు - మంటినూనే షఫీ ఇల్లు, పడమర - మంటినూనే ఐక్యన్న ఇల్లు, ఉత్తరం - కొలిమి ఇబ్రహీం, దక్షిణం - రహదారి (రాస్తా).		
(లోన్ ఎ/సి నెం.), 22660001022202 & 24660001335190, దుదేకుల మద్దయ్య, దుదేకుల మదారమ్మ	28-నవంబర్-25 రూ. 9,82,349/- (రూపాయలు తొమ్మిది లక్షల ఎనభై రెండు వేల మూడు వందల నలభై తొమ్మిది మాత్రమే) & రూ. 435,419/- (నాలుగు లక్షల ముప్పై ఐదు వేల నాలుగు వందల పంతొమ్మిది మాత్రమే) తేది: 28-నవంబర్-25 నాటికి	16-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: సర్వే నం. 247, పాత ఇంటి నం. 1-43, కొత్త ఇంటి నం. 1-68, నందివలై గ్రామం, మహానంది మండలం, నంద్యాల జిల్లా, నంద్యాల ఉప-రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, నంద్యాల జిల్లా సర్వే నం. 247, ఇంటి నం. 1-68 పరిధిలో ఉన్న ఆస్తి; అసెస్మెంట్ నం. 53; విస్తీర్ణం: 99.75 చదరపు గజాలు; 880 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఇల్లు. కొలతలు: తూర్పు-పడమర 10 1/2 అడుగులు, ఉత్తర-దక్షిణ 9 1/2 అడుగులు. మొత్తం విస్తీర్ణం: 99.75 చదరపు గజాలు. సరిహద్దులు: తూర్పు - రహదారి (రాస్తా), పడమర - అంచె నంజన్నకు చెందిన బహిరంగ స్థలం, ఉత్తరం - రహదారి (రాస్తా), దక్షిణం - షేక్ మదర్ సా ఇల్లు.		
(లోన్ ఎ/సి నెం.), 23660001682197, నాగస్వరాల స్వప్న, నాగస్వరాల రవీంద్రనాథ్	7-నవంబర్-25 రూ. 9,35,012/- (తొమ్మిది లక్షల ముప్పై ఐదు వేల పన్నెండు మాత్రమే) తేది: 6-నవంబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: డాక్యుమెంట్ ప్రకారం నివాస గృహం. కడప జిల్లా, కమలాపురం ఉప-విభాగం, కమలాపురం ఉప-రిజిస్ట్రార్ పరిధి. కమలాపురం గ్రామ పొలాల పరిధిలోని సర్వే నం. 401/3లో, 63.5 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన, ఇంటి నం. 13/655-A కలిగిన, గ్రౌండ్ ఫ్లోర్ గల ఇల్లు. దర్గా వీధి లోపలి భాగం (Interior). మొత్తం విస్తీర్ణం: 63.5 చదరపు గజాలు. స్థలం కొలతలు: తూర్పు నుండి పడమర - 38 అడుగులు లేదా 11.59 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం - 15 అడుగులు లేదా 4.57 మీటర్లు. ఇంటి కొలతలు: తూర్పు నుండి పడమర - 37 అడుగులు లేదా 11.27 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం - 15 అడుగులు (లేదా 4.57 మీటర్లు). మొత్తం నిర్మించిన విస్తీర్ణం: 555 చదరపు అడుగులు. తూర్పు: రహదారి, పడమర: ఎస్. వెంకట సుబ్బమ్మ స్థలం, ఉత్తరం: రహదారి, దక్షిణం: ఎస్. సురేంద్రనాథ్ స్థలం		
(లోన్ ఎ/సి నెం.), 23660001583883, నాయుడు వెంకటేశ్వర రావు, నాయుడు చందన	7-నవంబర్-25 రూ. 10,38,660/- (అక్షరాలలో: పది లక్షల ముప్పై ఎనిమిది వేల ఆరు వందల అరవై రూపాయలు మాత్రమే) - 6-నవంబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23660002070872, నాయుడు పరమేశ్వరి, నాయుడు రామాంజనేయులు, నాయుడు పుల్లయ్య	1-ఫిబ్రవరి-25 7,38,716/- రూ. [illegible] 16-జనవరి-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23630000093353, తుమ్మ యేసు రెడ్డి, తుమ్మ రాణి లక్ష్మి	8-జూలై-25 9,19,250/- రూ. [illegible] 8-జూలై-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 24660000636291, చొప్పర దానియేలు, చొప్పర నాగలు	31-అక్టోబర్-25 7,30,189/- రూ. [illegible] 31-అక్టోబర్-25	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23630000095979, [illegible]	17-అక్టోబర్-25 9,08,299/- రూ. [illegible] 17-అక్టోబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23660002291415, [illegible]	6-సెప్టెంబర్-25 5,17,178/- రూ. [illegible] 2-సెప్టెంబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23630000020092, మాతంగి శివ కృష్ణ, [illegible]	28-నవంబర్-25 5,23,216/- రూ. [illegible] 28-నవంబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23660001374657, [illegible]	7-నవంబర్-25 5,42,975/- రూ. [illegible] 6-నవంబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 24660001332165, [illegible]	31-అక్టోబర్-25 7,21,802/- రూ. [illegible] 31-అక్టోబర్-25 నాటికి	13-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 24660001219589, [illegible]	15-డిసెంబర్-25 2,44,432/- రూ. [illegible] 12-డిసెంబర్-25 నాటికి	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23630000088693, [illegible]	25-నవంబర్-25 4,59,602/- రూ. [illegible] 24-నవంబర్-25 నాటికి	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23630000097685, [illegible]	4-డిసెంబర్-25 7,12,160/- రూ. [illegible] 2-డిసెంబర్-25 నాటికి	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 23660000964364, [illegible]	15-డిసెంబర్-25 7,22,568/- రూ. [illegible] 12-డిసెంబర్-25 నాటికి	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: [illegible]		
(లోన్ ఎ/సి నెం.), 22660000397282, [illegible], ఉండుర్తి రమణ	25-నవంబర్-25 4,95,210/- రూ. [illegible] 24-నవంబర్-25 నాటికి	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: అరుంధతి పేట సమీపంలోని D నెం 4-68లో 97 చ.గ. లేదా 81.10 చ.మీ విస్తీర్ణంలో మరియు అక్కడ RS No 292/1 కింద కలిగిన D నెం 4-77లో భవనం కొమ్మర గ్రామం కొమ్మర గ్రామపంచాయతీ అత్తిలి ఎస్ఆర్‌ఓ, అత్తిలి మండలం తూర్పు రావుగు అత్తిలి మండలానికి చెందిన కొమ్మర గ్రామం సరిహద్దుల్లో ఉంది. పశ్చిమం: ఇరిగేషన్ బోడి, ఉత్తరం: ఆబోతు చిట్టియ్య స్థలం, దక్షిణం: రాజా వీధి		
(లోన్ ఎ/సి నెం.), 23660000983068, తొంట జగన్మోహనరావు, తొంట అనసూయ	7-మార్చి-25 24-ఫిబ్రవరి-2025 నాటికి 7,43,782/- రూపాయలు ఏడు లక్షల నలభై మూడు వేల ఏడు వందల ఎనభై రెండు మాత్రమే	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: 80 చదరపు అడుగుల విస్తీర్ణం లేని స్థిరాస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్. D.No బేరింగ్ ఉన్న RCC బిల్డింగ్ Yds. 1-4-1, R.S.No. 19-1 అత్తిలి గ్రామానికి చెందిన తొంటా జగమోహనరావు, అత్తిలి సబ్ డివిజన్, అత్తిలి మండలం, పశ్చిమగోదావరి జిల్లా. కింది సరిహద్దులు: తూర్పు: రోడ్డు, పడమర: జంకుల కనకమ్మ సైట్, ఉత్తరం: ముంగర సంశోన్ గద్ది ఇల్లు, దక్షిణం: ముంగర మరియమ్మ సైట్		
(లోన్ ఎ/సి నెం.), 24660001736585, యంత్రపాటి వెంకటేశులు, యంత్రపాటి ఉదయకుమారి	17-అక్టోబర్-25 5,93,730/- రూపాయలు. ఐదు లక్షల తొంభై మూడు వేల ఏడు వందల ముప్పై మాత్రమే 17-అక్టోబర్-25 నాటికి	14-మార్చి-26
తనఖా పెట్టిన ఆస్తి వివరణ: ఏలూరు జిల్లా, తాడేపల్లిగూడెం ఉప విభాగం, ఉంగుటూరు రెవెన్యూ ప్రాంతం, నీలాద్రిపురం గ్రామం, నీలాద్రిపురం గ్రామ పంచాయతీ, ఉంగుటూరు మండలంలో ఉన్న, ఆర్.ఎస్. నెం 50/9, డి నెం 1-4, అసెస్మెంట్ నెం 4 గల 121 చదరపు గజాల విస్తీర్ణం గల ఆర్.సి.సి భవనం యొక్క ఆస్తి, పైన పేర్కొన్న సరిహద్దుల లోపల, అన్ని సాధారణ మరియు సులభతర హక్కులతో కూడిన 121 చదరపు గజాల స్థలం, దానిలోని ప్రస్తుత మరియు భవిష్యత్ నిర్మాణాలతో సహా ఈ క్రింది వాటిచే పరివేష్టితమై ఉంది: తూర్పు: దారి, పడమర: యంత్రపాటి భూషణం సైట్, ఉత్తరం: యంత్రపాటి బాలస్వామి సైట్, దక్షిణం: యంత్రపాటి నాగేశ్వరరావు సైట్.		

రుణగ్రహీత మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, పైన పేర్కొన్న పట్టికలో పేర్కొన్న తేదీలో పేర్కొన్న నియమంలోని సెక్షన్ 13(4)తో పాటు (చట్టం 2002) నిబంధన 8తో చదువబడే అతనికి/ఆమెకు ఇవ్వబడిన అధికారాలను ఉపయోగించి, పైన పేర్కొన్న పట్టికలో వివరించిన ఆస్తిని క్రింద సంతకందారు స్వాధీనం చేసుకున్నాడని రుణగ్రహీతకు మరియు ప్రజలకు నోటీసు ఇవ్వబడింది. "సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, అంటే ఈ సమాచారం నుండి 30 రోజులలోపు, నియమం 8 (6)తో పాటు చట్టంలోని సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8)లోని నిబంధనలకు రుణగ్రహీత దృష్టికి తీసుకురావడమైనది" ముఖ్యంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు వ్యవహరించవద్దని ఇందుమూలంగా హెచ్చరిస్తున్నారు మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు పైన పేర్కొన్న మొత్తం మరియు దానిపై వడ్డీకి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) ఛార్జీకి లోబడి ఉంటాయి.

తేదీ : 18/03/2026 స్థలం : ఆంధ్రప్రదేశ్

సం/- అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

ఈ ప్రపంచం మనిషి అవసరాలను తీర్చగలదు కానీ కోర్కెలను ఎప్పటికీ తీర్చలేదు.

-మహాత్మాగాంధీ

ఎల్‌నినో వణుకు!

ఆకాశంకేసి చూస్తే ఒక్కసారిగా మబ్బులు మింగేస్తున్నట్లుగా ఉన్నా నాలుగు రోజులు పోతేకానీ మన వాతావరణమేమిటో దాని సత్తా ఏమిటో కానీ తెలియదు.ఎల్‌నినో తడాఖా చూపించే రోజులు ముందున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోయాయి. మధ్యలో తెలుగు రాష్ట్రాల్లో అకాల వర్షాలు తప్పవని వాతావరణ కేంద్రాలు ముందస్తుగానే హెచ్చరించడంతో రైతాంగం కాస్త మేలుకొందని చెప్పాలి. ద్రోణి ప్రభావంతో తెలంగాణలో కొన్నిప్రాంతాల్లో వడగండ్ల వానలు కురిసాయి.ఆంధ్రప్రదేశ్‌లో భిన్నమైన వాతావరణం నమోదైంది. పగలు ఎండ కాస్తే రాత్రి వానలు పడ్డాయి. కొన్ని ప్రాంతాల్లో కాసేపు ఎండ, కాస్సేపు చినుకులతో హడావిడి చేసింది. ఇలాంటి వాతావరణాన్ని తెలుగు రాష్ట్రాలలో 'ఎండావాన కలిపి కురిస్తే' విచిత్రంగా భావిస్తారు. ఎండలు మండిపోయి మారిన వాతావరణం వల్ల ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలేపడినా ఈసారి పంట ఉత్పత్తుల జాగ్రత్తల విషయంలో రైతు కాస్తంత ఒడ్డున పడ్డాడనే చెప్పాలి. అయినా కొన్ని ప్రాంతాల్లో సాగు ఉత్పత్తులకు ఇబ్బంది వచ్చింది. వాతావరణానికి సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఆరెంజ్, ఎల్లో అలెర్ట్‌లు జారీ అయ్యాయి. ఈదురుగాలులకు చెట్లు నేలవాలగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండే ఎండల సమయంలోనూ విద్యుత్ వినియోగం బాగా పెరిగింది. ఎ.సిల వాడకం కారణంగా ఈ నెలలో ఇంతవరకు గరిష్టంగా 18,228 మెగావాట్ల డిమాండ్ రికార్డు అయింది. పశ్చిమాసియాలో ఒక తెలంగాణలోనే యుద్ధవాతావరణం కారణంగా ఎల్పీజీ వంట గ్యాస్‌కు కొరత ఏర్పడ్తుందన్న భయంతో విద్యుత్ గ్యాస్ స్టౌల వాడకం వల్ల కూడా విద్యుత్ వినియోగం పెరిగింది. అదే సమయంలోగ్యాస్ వినియోగం 17 శాతం తగ్గిపోవడాన్ని బట్టి గ్యాస్ కొరత పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రానురాను పెరిగే ఎండలు మరోపక్క ఎల్పీజీ గ్యాస్ కొరత ఎదురైతే విద్యుత్ వినియోగం బాగా పెరుగుతోంది. సాపేక్షంగా గత యేడాది ఇదే సమయపు లెక్కలు ఎలా ఉన్నా ముందుకనబడే పరిస్థితులు ప్రమాదాన్నే సూచిస్తున్నాయి. ఇక ఈ యేడాది ఎల్‌నినో ప్రభావం వలన అనావృష్టి పరిస్థితులకు అవకాశమున్నట్లు కేంద్ర వాతావరణ శాఖ హెచ్చరికలు అటు రైతాంగం, ఇటు వ్యవసాయాధికారుల దృష్టికి వచ్చినవే. గత యేడాది రోహిణికార్తె నాటికే ఎండలు మండిపోయాయి. ముందు నుంచీ వేడిమి వాతావరణం కారణంగా తర్వాత తర్వాత అలవాటుపడిపోయారు. ఈసారి కూడా అలాంటి పరిస్థితులే తలెత్తనున్నాయి. రుతుపవన ప్రభావంతో కురిసే వర్షాలు కూడా ఆలస్యమయ్యే పరిస్థితి. ఈ యేడాది ద్వితీయార్థంలో ఎల్‌నినో భూ వాతావరణాన్ని వేడెక్కిస్తుందనే అంచనాలున్నట్లు ప్రయివేటు వాతావరణ సంస్థ స్కైమెట్ అంచనా వేసింది. కానీ ప్రకృతితాపం ఈనాలుగు రోజులపాటు వర్షాలతో కాస్త ఉపశమనంగా అనిపించినా ఆ తర్వాత మండే ఎండలు గుబులు పుట్టిస్తాయనిపిస్తోంది. కారణం ఉష్ణమండలం పసిఫిక్ మహాసముద్రంలో గత నెలలోనే లానినో బలహీనపడింది. తటస్థ పరిస్థితులు ఏర్పడినట్లు కనపడినా ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయి. ఏప్రిల్ నెలలో ఎల్‌నినో ప్రభావంతో వేడి వాతావరణం మరింతగా బలపడుతుంది. భూమధ్య రేఖ ప్రాంతంలోని పసిఫిక్ మహా సముద్రంలో ఎల్‌నినో ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి. నైరుతి రుతుపవనాలు ఊపందుకునే సమయంలో వచ్చి వాతావరణ ప్రపంచ నెత్తిన పెద్దపిడుగు వేసేటట్లుంది. నైరుతి రుతుపవనాలు ఊపందుకుంటాయని భావించినా ఎల్‌నినో దక్షిణాది దేశాల ప్రతికూల ప్రభావాలు చూపుతుంది. ఆస్ట్రేలియా,ఆగ్నేయాసియా, భారత ఉపఖండ దేశాలలో వర్షపాతంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. జులై నెలలో ఎల్‌నినో తీవ్రత కనపడి కరువు పరిస్థితులు ఏర్పడాల్సి ఉండగా అంతకు ముందుగానే ఏర్పడ్తాయని ఆసియా, పసిఫిక్ క్లైమెంట్ సెంటర్ స్పష్టం చేస్తోంది. నైరుతి రుతుపవనాలు, ఎల్‌నినో రెండూ విడివిడిగా కాకుండా ఒకేసారి మీదపడ్తున్నాయి. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, ఆగ్నేయాసియా దేశాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉంది. జులైనెలలో ఎల్‌నినో ఊపందుకుంటే సాగునీరు, తాగు నీటిఎద్దడి తలెత్తితే కరువు తాండవమాడుతుంది. పశు జీవాలకు నీటిఎద్దడి ఏర్పడితే వాటి ప్రాణాలకే అపాయం కలుగుతుంది. ఎక్కువ కాలం వాతావరణం ఇలాగే ఉంటే సాగుపై ప్రభావం ఉంటుంది. రాబోయే ప్రమాదకర పరిస్థితులను అంచనావేసుకుని రైతాంగానికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. ఎందుకో ఈసారి 'ఎల్‌నినో' వేసవి సీజన్‌లో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలలేమి, భిన్న వాతావరణాలు గోచరిస్తాయని ముందుగానే అంచనా వేసారు. ఇటీవల దశాబ్దాలలో ఈసారి వచ్చేది 'సూపర్ ఎల్‌నినో'గా భావిస్తున్నారు. ప్రపంచమే మలమల మాడిపోయే పరిస్థితులు ఉత్పన్నమయ్యే ఛాన్స్ ఉంది. అసాధారణ రుతుపవనాలు చూస్తామని యూరోపియన్ సెంటర్ ఫుల్ మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌కాస్ట్ పేర్కొంది. అయితే దీని చెడు ప్రభావమంతా భారతదేశం మీద ఎక్కువగా ఉంటుంది. మార్చి, మే నెలలలో సగటు కంటే అధిక భూ ఉపరితల ఉష్ణోగ్రతలు ఉంటాయని ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిస్తోంది. ఎల్‌నినో, లానినో ఏదైనా కాలానుగుణ ప్రత్యామ్నాయాల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి వస్తుంది. అప్పుడే భారత్ సుభిక్షంగా ఉండగలదు.

మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.

లియో టాల్‌స్టాయ్

వ్యక్తిత్వాన్ని మలుచుకోవడానికి సమాజం ఎంత అవసరమో, ఊహాశక్తిని పరిపుష్టం చేసుకోవడానికి ఏకాంతం అంత అవసరం.

స్వామి వివేకానంద

ప్రజావాక్కు

ఆచితూచి మాట్లాడాలి

ప్రసిద్ధ నటుడు హాస్య నటచక్రవర్తి రాజేంద్రప్రసాద్ దిగ్గజ నటులుకాంతారావు గారిని ప్రశంసిస్తూతమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, నటులు అయినటువంటి శ్రీ ఎం.జీ.ఆర్. గారిని తక్కువ చేసితప్పుగా మాట్లాడటం అత్యంత బాధాకరమైనవిషయం.రాజేంద్రప్రసాద్‌ఆతరువాత ఎం.జీ.ఆర్. అభిమానులకు, తమిళ ప్రజానీకానికి తమిళంలో క్షమాపణలు చెప్పినా, నోట జారిన మాట వెనక్కు రాదు కదా! ఒక సభలో మాట్లాడేటప్పుడు ఆచితూచి మాట్లాడటం ప్రసంగీకుల ప్రధాన లక్షణం. సభలో ఏమి మాట్లాడాలో, ఏమి మాట్లాడకూడదో తెలుసుకోకపోతే ఇట్లాంటి దుస్సంఘటనలే ఎదురవుతాయి. తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ సభలో మాట్లాడేటప్పుడు ఎంతో హుందాగా, సూటిగా, పొరపాట్లు దొర్లకుండా చూసుకుంటారు. మన తెలుగు నటులు కూడా రజనీకాంత్ గారిని అనుసరించి హుందాగా, హెచ్చులకు పోకుండా ఉండాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

ఎపి విద్యావిధానంలో మార్పులు

ఇటీవల ఏపి విద్యాశాఖ భవిష్యత్ విద్య ప్రణాళికలో అకడమిక్ ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణులైన వారికి సూటిగా ఐటీఐలో ప్రవేశం కల్పించే వెసులుబాటు చేసే విధానం చాలా ఉపయోగకరం. 15 ఏళ్ల లోపే వారికి పని చేసే విద్యలో శిక్షణ పొందుతారు.దానిలో పని తీరుబట్టి ధ్రువ పత్రాలు ఇస్తూ ,నేరుగా పదో తరగతి పరీక్షకు అవకాశం ఇస్తున్నారు. దానిలో ఉత్తీర్ణతఐతే వారు నేర్చుకున్న పనిని మరింత మెరుగుపరిచి ప్రైవేట్‌గా భృతికోసం పనిచేసి కొంతసంపాదనచేయవచ్చు.తదుపరి విద్య సాగించవచ్చు.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

రైల్వే టికెట్స్‌లో వెసులుబాటు

రైల్వే ప్రయాణ టికెట్స్ తీసుకోవడం కొంతమందికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది.సీజన్ టికెట్స్ పూర్వం లాగా రైల్వే స్టేషన్ బుకింగ్ కౌంటర్లో ప్రస్తుతం ఇవ్వడం లేదు. ఫోన్‌లో టికెట్ బుక్ చేయడం గ్రామీణ ప్రాంతాల వారికి నిరక్షరాస్యులకు, వృద్ధులకు వికలాంగులకు ఇబ్బంది కలుగుతుంది. రైల్వేటికెట్లు తీసుకోవడంలో రైల్వే శాఖ అధికారులుసహకరించాలి.వికలాంగులకు సీజన్‌టికెట్‌లో రాయితీ కల్పించాలి. ఆఫ్‌లైన్‌లో కూడా రైల్వే టికెట్స్ ఇవ్వాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు,వరంగల్ జిల్లా

పంచాంగాలు కొంతమందికి బతుకుదెరువు

ఆకాశంలోని చుక్కలు, చేతిలోని గీతలు జీవితాలను మార్చవు. ఉగాది వచ్చిందంటే ఈసంవత్సరం ఏమిజరుగుతుందో, మన భవిష్యత్తు గురించి పంచాంగంలో ఏమివ్రాసివుందో అనుకుంటూ ఆదుర్దాగా కొంతమంది ఎదురుచూస్తుంటారు. ఈ బలహీనతలను ఆసరా చేసుకొని పంచాంగం పంతుళ్లు, ఏదో నోటికొచ్చింది చెప్పి సంభావనాలు మాత్రం భారీగా పుచ్చుకుంటారు. అధికారంలో ఉన్నవారికి వారి ఆస్థాన జ్యోతిష్కులు మరలా మీరే అధికారాన్ని చేపడతారని చెపుతారు. ప్రతిపక్షవారికి వారి ఆస్థాన జ్యోతిష్కులు మీరే అధికారంలోకి వస్తారని చెపుతారు. ఇక్కడే వారి అబద్దాల పంచాంగం బట్టబయలు అవుతుంది. పంచాంగం నిజమయితే ఇద్దరికి ఒకే ఫలితం చెప్పాలికదా ! కాబట్టి పంచాంగాలుబూటకం. మనజీవితాలకు పంచాగాలకు ఎలాంటి సంబంధంలేదు. ప్రపంచంలో జ్యోతిష్యం నిజమని ఇంతవరకు రుజువు కాలేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

సామాజిక మాధ్యమాల ప్రభావం

పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రతికూల ప్రభావాన్ని తగ్గించేందుకు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఇటీవల కీలక నిర్ణయాలుతీసుకున్నాయి.16సంవత్సరాలలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలను ఉపయోగించకుండా నిషేధం విధించే దిశగా చర్యలు ప్రకటించడం చర్చకు దారితీసింది. ఆంధ్రప్రదేశ్‌లో అయితే 13 సంవత్సరాల లోపు పిల్లల సామాజిక మాధ్యమ వినియోగాన్ని వచ్చే తొంభైరోజుల్లో నిషేధించనున్నట్లు ప్రకటించారు.ఈనిర్ణయం వెనుకఉన్న ఉద్దేశం పిల్లలను డిజిటల్ ప్రమాదాల నుంచి రక్షించడం అనే విషయంపై సందేహం లేదు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

'ఎఐ' అంటే భయం

అమెరికా కంటే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంటేనే భయం చాలా పెరిగిపోతోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మేధావులు, తెలివైన వాళ్ళు ,మోసగాళ్లు, అగ్రవర్ణాలు ఉన్న అద్భుతమైన ప్రదేశమే అమెరికా. అలాంటి వాతావరణంలో నిర్భయత్వానికి చోటు చాలా తక్కువ. ఎప్పుడు ఎవడు ఏ ఆయుధంతో ఎటాక్ చేస్తాడో అనే భయం ప్రతి వాళ్లలోనూ ఉంటుంది. అలా ఎటాక్ చేయడానికి,కుదిరితే చంపేయడానికి పెద్దకారణాలేమీ ఉండవు. ఆర్టిఫిషియల్‌కి ఆపోజిట్ నేచురల్, అన్ నేచురల్ నైనా భరిస్తామో కానీ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను భరించలేకపోతున్నాం.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

పర్యావరణ రక్షణకే మూసీ ప్రక్షాళన!

నదితీరాల్లో అధిక నిర్మాణాలు లేదా పెద్ద వాణిజ్య ప్రాజెక్టులు చేపడితే ప్రకృతి వ్యవస్థకు నష్టం కలగవచ్చని వారు భావిస్తున్నారు. అందువల్ల దీర్ఘకాలిక పర్యావరణ రక్షణను ప్రాధాన్యంగా తీసుకునే స్థిరమైన ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ సవాళ్లున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మక పట్టణ మార్పు కార్యక్రమాలలో ఒకటిగా భావించబడుతోంది. ఇదిసమర్థవంతంగా అమలైతే కాలుష్యంతో నిండిన నదిని పునరుద్ధరించగలదు. పట్టణ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచగలదు. కొత్త వినోదస్థలాలను సృష్టించగలదు. హైదరాబాద్ భవిష్యత్ రూపాన్ని మార్చగలదు. అందువల్ల మూసీనది కథ నగరపు గతపోరాటాలను,భవిష్యత్ తరాల ఆశలను ప్రతిబింబిస్తుందనీ, ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన నది పర్యావరణ పునరుద్ధరణకు, ఆధునిక పట్టణ అభివృద్ధికి ప్రతీకగా మారగలదని,ప్రపంచ దృష్టిని ఆకర్షించే అత్యంత ప్రతిష్టాత్మక చారిత్రక మార్పు అవుతుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

సురేష్ కశ్యప్

ఒకనాటి అఖండ భారతావనిలో నైజాం నవాబులు ఏలిన రాజ్యాలలో తెలంగాణ ప్రాంతం ఒకటి. సాయుధ పోరాటాలు బలహీన వర్గాల అణచివేతతోపాటు నాగరికాభివృద్ధితో ప్రపంచ పటంలోనే అత్యంత చారిత్రాత్మిక సంతరించుకున్న గడ్డమనది. కళలు,సంగీతం సంస్కృతి,నృత్యం, సొగసులు ఉప్పొంగే నగలు, ముత్యాలు, రత్నాలు, జలజలపారే మూసీ, జీవనదుల పరవళ్ళు జంట నగరాలకే భాగ్య రేఖలు. హైదరాబాద్ నగర చరిత్రలో మూసీ నది కథకు ఎంతో దగ్గర సంబంధం ఉంది. అభివృద్ధి అనేక సవాళ్లతో ముడిపడి ఉంది. చాలా సంవత్సరాల క్రితం మూసీనది ఇక్కడ నివసించే ప్రజలకు జీవనాధారంగా ఉండేది. ఈ నది స్వచ్ఛంగా ప్రవహిస్తూ వ్యవసాయం, దైనందిన జీవితం, వాణిజ్యానికి మద్దతు ఇచ్చేది.అయితే ఈ నది ఒక విషాదకరమైన ఘటన వల్ల కూడా ప్రసిద్ధి చెందింది, అది హైదరాబాద్ భవిష్యత్ ప్రణాళికలను మార్చేసింది. 1908 సంవత్సరంలో భారీ వర్షాల తరువాత మూసీ నది భయంకరమైన వరదలతో ఉప్పొంగి నగరంలో భారీ విధ్వంసాన్ని సృష్టించింది. ఇళ్లు, రహదారులు,ప్రజా భవనాలు దెబ్బతిన్నాయి. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విపత్తు అప్పటి హైదరాబాద్ రాష్ట్ర నిజాం పాలకులను తీవ్రంగా కదిలించింది. తద్వారా వరద నియంత్రణ, నీటి నిర్వహణపై వారు గంభీరంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి విపత్తులు మళ్లీ జరగకుండా ఉండేందుకు నది ఎగువ ప్రాంతంలో పెద్ద జలాశయాలను నిర్మించాలని పాలకులు ఆదేశించారు. దాని ఫలితంగా ఇరవయ్యవ శతాబ్ద ప్రారంభంలోనే రెండు ప్రధాన జలాశయాల ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించబడ్డాయి. ఈ జలాశయాలు వరద నియంత్రణలో సహాయపడటమే కాకుండా హైదరాబాద్ నగరానికి త్రాగునీటికి, సాగునీటికి ముఖ్య వనరులుగా మారాయి. అనేక దశాబ్దాలపాటుమూసీ నది ఎంతో స్వచ్ఛంగా ప్రవహించింది. అంతేకాకుండా ఈ జలాశయాలు నగరాన్ని వరదల నుంచి రక్షించడంలో కీలక పాత్ర పోషించాయి. స్వాతంత్రం తరువాత ముఖ్యంగా 1980 నుండి హైదరాబాద్ నగరం వేగంగా విస్తరించడం ప్రారంభమైంది. నగర జనాభా కూడా భారీగా పెరిగింది, పరిశ్రమలు, అనేకానేక వర్తక వ్యాపారాలు అభివృద్ధి చెందాయి. దానితో మెట్రోపాలిటన్ ప్రాంతంలో కొత్త నివాస కాలనీలు ఏర్పడ్డాయి. ఈ వేగవంతమైన పట్టణీకరణతో ఒక తీవ్రమైన సమస్య కూడా ఉద్భవించింది. పరిశ్రమల వ్యర్థాలు, శుద్ధి చేయని మురుగు నీరు పెద్ద మొత్తంలో నదిలోకి చేరడం ప్రారంభమైంది. వందలాది కాలువలు మురుగు నీటిని నేరుగా మూసీ నదిలోకి తీసుకెళ్లడం మొదలుపెట్టాయి. కాలక్రమేణా నది తన సహజ ప్రవాహాన్ని కోల్పోయి తీవ్రంగా కాలుష్యానికి గురైంది. చాలామంది ప్రజలకు ఇది సహజ నది కాకుండా నగర మధ్యగా ప్రవహించే ఓపెన్ డ్రైనేజ్ కాలువలా కనిపించడం ప్రారంభమైంది.మూసీ నది కాలుష్యం పర్యావరణ,ప్రజారోగ్య సమస్యలను సృష్టించింది. నీరు అసురక్షితంగా మారింది, పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపించింది, నదిలోని జలచర జీవులు గణనీయంగా తగ్గిపోయాయి.భారీవర్షాల సమయంలో కాలుష్యంతోకూడిన నీరు నది తీరప్రాంతాల్లో ఉన్న తక్కువ ఎత్తైన ప్రాంతాలకు వరద ప్రమాదాన్ని పెంచింది. ఈ సమస్యల కారణంగా నగర ప్రణాళిక కర్తలువిధాన నిర్ణేతలు నదిని పునరుద్ధరించే

మార్గాలను వెతకడం ప్రారంభించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం మూసీనది పునరుజ్జీవనానికి చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రణాళికగా మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం నదిని శుభ్రపరచడమే కాకుండా మొత్తం నది తీర ప్రాంతాన్ని ఆధునికంగా ఆకర్షణీయమైనదిగ, పర్యావరణపరంగా స్థిరమైన పట్టణ ప్రాంతంగా మార్చడం. ఈ ప్రణాళికను అమలు చేయడానికి ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌ను ఏర్పాటు చేసింది.అనేక కారణాల వల్ల అది అనుకున్న స్థాయిలో ముందుకెళ్లాలేదు. మూసి ప్రక్షాళన సాగలేదు. ఐతే తరువాత తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా రేవంత రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాడే ప్రజాపాలనగా తాను ప్రతిపాదించిన ఆరు గ్యారంటీలతో పాటే మూసీనది పునర్జీవం ప్రాజెక్టుకు శ్రీకారంచుట్టారు. మూసీ నది హైదరాబాద్ నగరంలో సుమారు 55 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఈ ప్రాజెక్ట్ లక్ష్యం మొత్తం ప్రవాహాన్ని దశలవారీగా అభివృద్ధి చేయడం. మొదటి దశలో హిమాయతసాగర్ సమీపంనుంచి ప్రారంభమై అత్తాపూర్,నాంపల్లి, చాదర్‌ఘాట్, నాగోల్ వంటి ముఖ్య ప్రాంతాల వరకు విస్తరించే భాగాన్ని అభివృద్ధి చేయాలని ప్రణాళిక ఉంది. ఇందులో మురుగు నీటి శుద్ధి కేంద్రాలు ఏర్పాటు, నది తీరప్రాంతాలు బలోపేతంచేయడం,ల్యాండ్‌స్కేపింగ్, పార్కులువంటి సుందరీకరణ వాతావరణాన్నీ ఏర్పాట్లు చేయడం.ఈ ప్రాజెక్ట్‌లో అత్యంత ముఖ్యమైన అంశం అనేక సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించడం. ఈ కేంద్రాలు మురుగు నీటిని శుద్ధి చేసి తరువాతే నదిలోకి విడుదల చేయడాన్ని నిర్ధారిస్తాయి. అలాగే నదీతీరాల వెంట ఇంటర్‌సెప్టర్ డ్రైన్లు నిర్మించి నగర కాలువల నుంచి వచ్చే మురుగునీటిని పట్టుకుని శుద్ధికేంద్రాలకు మళ్లించి కాలుష్యాన్ని అక్కడే నియంత్రించడం ద్వారా నది పర్యావరణ తోపాటు, ప్రజా ఆరోగ్యాన్ని క్రమంగా పునరుద్ధరించాలనే లక్ష్యంఉంది.ఈ ప్రాజెక్ట్ పర్యావరణ పునరుద్ధరణతో పాటు హైదరాబాద్ నగర వినోదం, పర్యాటక అవకాశాలను కూడా పెంచగలదు. నది తీరాల్లో పార్కులు, నడక మార్గాలు, సైక్లింగ్ ట్రాకులు సాంస్కృతిక స్థలాలు ఏర్పాటు చేయాలని ప్రణాళికఉంది. ఇవి ప్రజలకు విశ్రాంతి తీసుకోవడానికి, నది అందాలను ఆస్వాదించడానికి అనువైన ప్రదేశాలుగా మారవచ్చు. అదనంగా రహదారులు, వంతెనలను కూడా అభివృద్ధి చేసి నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మెరు గుపరచవచ్చు. అయితే ఈ ప్రాజెక్ట్‌పై చర్చలు, విమర్శలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా నదీ తీరప్రాంతాల్లో నివసించే ప్రజల పునరావాసం గురించి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చాలా సంవత్సరాలుగా నది తీరాల్లో అనధికార నివాసాలు ఏర్పడ్డాయి. ఈ ప్రాజెక్ట్ అమలుకోసం వాటిని తొలగించే అవసరం రావచ్చు. నిరాశ్రయ కుటుంబాలకుప్రభుత్వం సరైనపరిహారం గృహ సదుపాయాలు కల్పించాలని విమర్శకులు డిమాండ్ చేస్తున్నారు. పర్యావరణ నిపుణులు అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణ మధ్య సమతుల్యత అవసరమని హెచ్చరిస్తున్నారు. నదీతీరాల్లో అధిక నిర్మాణాలు లేదా పెద్ద వాణిజ్య ప్రాజెక్టులు చేపడితే ప్రకృతి వ్యవస్థకు నష్టం కలగవచ్చని వారు భావిస్తున్నారు. అందువల్ల దీర్ఘకాలిక పర్యావరణ రక్షణను ప్రాధాన్యంగా తీసుకునే స్థిరమైన ప్రణాళిక అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ సవాళ్లున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ తెలంగాణలో అత్యంత ప్రతిష్టాత్మక పట్టణ మార్పు కార్యక్రమాలలో ఒకటిగా భావించబడుతోంది. ఇది సమర్థవంతంగా అమలైతే కాలుష్యంతో నిండిన నదిని పునరుద్ధరించగలదు. పట్టణ, మౌలిక సదుపాయాలను మెరుగుపరచగలదు. కొత్త వినోద స్థలాలను సృష్టించగలదు. హైదరాబాద్ భవిష్యత్ రూపాన్ని మార్చగలదు. అందువల్ల మూసీనది కథ నగరపు గతపోరాటాలను, భవిష్యత్ తరాల ఆశలను ప్రతిబింబిస్తుందనీ, ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన నది పర్యావరణ పునరుద్ధరణకు, ఆధునిక పట్టణ అభివృద్ధికి ప్రతీకగా మారగలదని,ప్రపంచ దృష్టిని ఆకర్షించే అత్యంత ప్రతిష్టాత్మక చారిత్రక మార్పు అవుతుందని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ●

రిజర్వేషన్లతో నష్టపోయేది ఒబిసిలు మాత్రమే!

సొప్పరి నరేందర్

దేశంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈడబ్ల్యుఎస్ ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టింది. ఈ రిజర్వేషన్ ద్వారా సాధారణ వర్గాలకు చెందిన ఆర్థికంగా బలహీన కుటుంబాలకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం కోటా కల్పించబడింది. అయితే ఈ నిర్ణయంపై పలువర్గాలు ముఖ్యంగా ఒబిసి సమాజం చాలా నష్టపోయింది. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్ లక్ష్యం ఆర్థికంగా బలహీన వర్గాలకు సహాయం చేయడమే అయినా దీనివల్ల వెనుకబడిన ఒబిసి వర్గాలపై చాలా ప్రభావం చూయించింది. భారత రాజ్యాంగానికి 2019లో 103వ సవరణ చేస్తూ కేంద్రప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించింది. దీనివల్ల ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి జాతీయ విద్యాసంస్థల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో పది శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రభుత్వం వారి వార్షిక ఆదాయాన్ని 8 లక్షలుగా నిర్ణయించింది. ఇదంతా కూడా ఎలాంటి శాస్త్రీయతలేకుండా చట్టాలను అతిక్రమిస్తూ చేసిన సవరణ. ఈ సవరణన్యాయబద్ధతను సవాలు చేస్తూ జనహిత అభియాన్ అనే స్వచ్ఛంద సంస్థ కోర్టులో సవాలు చేసింది. కేవలం ఆర్థిక పరిస్థితి ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వొచ్చనేది రాజ్యాంగంలో ఎక్కడ లేదు. ఎం.ఆర్ బాలాజీ, ఇందిరా సహాని కేసులో రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదనే తీర్పు ఉంది. ఆర్థికంగా వెనుకబడిన సమూహంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు చోటు లేకపోవడం కులవివక్ష అంటూ ఈ స్వచ్ఛంద సంస్థ కోర్టును ఆశ్రయించింది. అయితే ఈ సవరణ సబబు అంటూ సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల బెంచ్ 3:2 తేడాతో ఆమోదం తెలుపుతూ తీర్పునిచ్చింది.కాకా కాలేల్కర్ కమిటీ, మండల్ కమిషన్, వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన బీసీ కమిషన్లు అన్నీ బీసీలు, ఓబీసీల జనాభా 52.55 శాతంగా నిర్ధారించాయి. చట్ట ప్రకారం జనాభా లెక్కల్లో ఎస్సీ,ఎస్టీల వివరాలు సేకరిస్తున్నారు. అందులో నిర్ధారించిన వారి జనాభాకు అనుగుణంగా వరుసగా 15 శాతం 7.5 శాతం

రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సమూహంలో వీళ్లను మినహా 77.5 శాతం, మిగిలిన 22.5వారికి 10శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఈచట్టాన్ని తీసుకొచ్చారు. ఈ 22.5 శాతంలో 1.5 శాతం ముస్లింలు ఉన్నారు. ఈ 15శాతం ముస్లింలలో 2019 నుంచి ఇప్పటి వరకు 0.5 శాతం మంది కూడా విద్యా, ఉద్యోగావకాశాలు పొందలేకపోయారు. అంటే 7.5 శాతం మందికి ఈడబ్ల్యుఎస్ నుంచి ముస్లింలని మినహాయిస్తే 10శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సబబే అంటూ ఈ న్యాయమూర్తులు అన్యాయమైన తీర్పునిచ్చారు. ఈ ఏడున్నర శాతం ఈడబ్ల్యూఎస్ వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారు అంటే 8లక్షల లోపు ఆదాయం ఉన్నవాళ్లు రెండున్నర శాతానికి మించి ఉండరు. దీనివల్ల మూడు శాతం వారికి పదిశాతం రిజర్వేషన్లు అదనంగా దోచి పెట్టడమే. కులాల వారీగా బీసీల లెక్కింపునకు పార్లమెంటులో హామీ ఇచ్చి వెనక్కితగ్గిన కేంద్ర ప్రభుత్వం. ఇప్పుడు ఎలాంటి అధికారిక లెక్కలు లేకుండా ప్రజల్లో చైతన్యం పెరగాలి. ఆధిపత్య కులాలకు ఆస్తులతో పాటు విద్యా, ఉద్యోగాలు కూడా దోచి పెట్టే ప్రయత్నం చేస్తున్నది. నిజానికి 50శాతం ఓపెన్ కోటాలో పోటీపడాల్సిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు ఇప్పుడు 40శాతం కోటాలోనే పోటీపడాల్సి ఉంటుంది. జనాభాలో 55 శాతంగా ఉన్న ఓబీసీలకు కేవలం వారి జనాభాలో సగంమందికి 27 శాతం రిజర్వే షన్లు అమలుజేస్తున్నారు. అదీ క్రీమిలేయర్ లాంటి షరతుల మధ్య 1993 నుంచి ఇప్పటివరకు రిజర్వేషన్లు గంపగుత్తగా 50 శాతానికి మించకూడదంటూ ఎం.ఆర్.బాలాజీ, ఇందిరా సహానీల కేసులో సుప్రీం కోర్టు తీర్పులిచ్చింది. క్రీమీలేయర్ అమలుకారణంగా మిగిలిపోయిన ఉద్యోగాలను ఓపెన్ కోటాలోకి మళ్లించి బీసీలకు అన్యాయంచేశారు.ఉద్యోగాల అమలు అంతా ఆధిపత్య కులాల చేతులోనే ఉంది కాబట్టి 1993 నుంచి ఇప్పటి వరకు దాదాపు ముప్పై ఏండ్లుగా రైల్వేల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మరోవైపు సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా ఇచ్చే రిజర్వేషన్లకు భిన్నంగా కేవలం ఆర్థిక ప్రమాణాల ఆధారంగా రిజర్వేషన్ ఇవ్వడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కొంతమంది నిపుణులు పేర్కొంటున్నారు. అందువల్ల రిజర్వేషన్ విధానాన్ని సమగ్రంగా పునః పరిశీలించి అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలని సామాజిక సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ●

యువశక్తే దేశాభివృద్ధికి గొప్పబలం

మేకిరి దామోదర్

మనిషి ఈ సమాజానికి కేంద్రబిందువు. సమాజం అనే నిర్మాణం మనుషుల సంబంధాలు, నైతిక విలువలు, పరస్పర గౌరవం, బాధ్యతలపై నిలబడి ఉంటుంది. కానీ నేటి పరిస్థితులను గమనిస్తే, మనిషిని స్వార్థం, అధికారం, అవినీతి, ఆధిపత్యం వంటి దుష్ప్రవర్తనలు క్యాన్సర్‌లా పట్టి పీడిస్తున్నాయి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం సామూహిక ప్రయోజనాలను త్యజించే ధోరణి పెరుగుతుండటం సమాజ భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ స్థాయిలోనే ఆధిపత్య పోరాటాలు, యుద్ధాలు, రాజకీయ ద్వేషాలు విస్తరిస్తున్నాయి. ఒక దేశం మరొక దేశంపై ఆధిపత్యం సాధించాలనే ఆశతో జరిగే ఘర్షణలు లక్షలాది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి.అధికార సామ్రాజ్యకాంక్ష చివరికి స్మశాన వాటికలకే దారి తీస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రపంచంలోనూ, దేశంలోనూ, రాష్ట్రాల్లోనూ అశాంతి వాతావరణంలో జీవనం ఎంతకాలం కొనసాగుతుంది? మానవీయత లేని పాలనను సమాజం నిజంగా కోరుకుంటుందా అనే విషయంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉంది. మనిషి ఎంతగా దిగజారాడంటే, తాను సృష్టించలేని సహజ సంపదలను కూడా నిర్దాక్షిణ్యంగా ధ్వంసం చేస్తున్నాడు. ప్రకృతి ఇచ్చిన వనరులను సంరక్షించాల్సిన బాధ్యత మనిషిపైనే ఉన్నప్పటికీ,అభివృద్ధి పేరిట అడవులు నరికివేత, నదుల కాలుష్యం, భూమి దోపిడీ వంటి చర్యలు కొనసాగుతున్నాయి. ఇది నిజంగా అభివృద్ధి నమూనా అనుకోవాలా? మనిషి తాను కూర్చున్న కొమ్మనే తానే నరుకుతున్నట్లుగా ఈ ధోరణి కనిపిస్తోంది. మనిషి సంఘజీవి అన్న భావనను మరచిపోయి, తానే సర్వస్వమనే అహంకారంతో విర్రవీగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీనివల్ల కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. డబ్బు కోసం,ఆస్తికోసం, బీమాడబ్బుల కోసం కూడా ప్రాణాలను తీసే అమానవీయ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తన్ను కన్న తల్లిదండ్రులను, తాను కన్న పిల్లలను, భార్యను, భర్తను, అన్నదమ్ములను హత్య చేసే ఘటనలు వెలుగులోకి రావడం సమాజాన్ని కలవరపెడుతోంది. ఒకప్పుడు విలువలతో నిలిచిన భారతీయ కుటుంబ వ్యవస్థలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరం. మానవ సంబంధాలలో చాలా సమస్యలకు మూలం అపార్థాలే. వినేది సగం, అర్థం చేసుకునేది పావువంతు, ఆలోచించేది సున్నాకానీ స్పందన మాత్రం రెండువందల శాతం అనే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సందర్భాల్లో అనుబంధాలు ఎలా నిలుస్తాయి? సహనం, పరస్పర గౌరవం, సంభాషణ అనే విలువలు తగ్గిపోవడం వల్లే ఈ విభేదాలు పెరుగుతున్నాయి. ఇక సమాజంలో మరో బాధాకర అంశం పరువు హత్యలు. ప్రేమించిన యువజంటలను కులం, మతం పేరుతో అడ్డుకోవడం, వారి ప్రాణాలపై దాడులు జరగడం అమానవీయ చర్య. నిజమైన ప్రేమను అర్థం చేసుకునే పరిణతి సమాజంలో పెరగాలి. కుటుంబాలు కూడా సహనం, అవగాహనతో వ్యవహరించాలి. పాలన సౌలభ్యం కోసం ప్రజలు ఇచ్చే ఓటుతో ఏర్పడిన పార్లమెంట్, రాష్ట్ర చట్టసభలు ప్రజాసమస్యల పరిష్కారానికి వేదిక కావాలి. కానీఅక్కడ కూడా పాలక-ప్రతిపక్ష నాయకులు పరస్పరం అనైతికంగా తిట్టుకుంటూ, రాజకీయ వైరం పెంచుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజల సమస్యలపై గంభీరమైన చర్చలు జరగాల్సిన చోట రాజకీయ ఆరోపణలు, విమర్శలు మాత్రమే వినిపిస్తుంటాయి. మరోవైపు కార్పొరేట్ సంస్థల ఆదాయాలు, కొందరు రాజకీయ నాయకుల సంపదలు భారీగా పెరుగుతుంటే, సాధారణ ప్రజల జీవితం మాత్రం కష్టసాధ్యంగా మారుతోంది. దేశం, రాష్ట్రాలు అప్పుల భారంతో కుంగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో సమాజంలో నైతిక విలువలు తగ్గిపోవడం సహజమే. ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్తంభంగా పరిగణిస్తారు. పాలకులను ప్రశ్నించడం, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం మీడియా బాధ్యత. కానీ కొన్నిసార్లు మీడియా స్వేచ్ఛ కూడా ఒత్తిళ్లకులోనై నిజాలను చెప్పడంలో వెనుకబడుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల గొంతును వినిపించాలి, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టడతూ, పాలకుల వైఫల్యాలను ఎత్తిచూపడం ప్రజాస్వామ్యానికి మంచిది. ప్రజల్లో కులం,మతం పేరుతో విభేదాలు రెచ్చగొట్టడం కూడా రాజకీయాల్లో సాధారణంగా మారింది. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ప్రజలను విడదీసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజలను ఏకం చేయాల్సిన రాజకీయాలు విభజన వైపు నడుస్తున్నాయి. మన దేశపాలన వ్యవస్థలో చట్టసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థ, పత్రికాస్వేచ్ఛ అనే నాలుగు ప్రధాన స్తంభాలు ఉన్నాయి. ఈ వ్యవస్థలు నైతిక విలువలను కాపాడుతూ తమబాధ్యతలను నిజాయితీగా నిర్వహించినప్పుడే సమాజంలో న్యాయం,సమానత్వం, శాంతి నిలుస్తాయి. కానీ ఈ వ్యవస్థల్లో అవినీతి, స్వార్థం పెరిగితే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడుతుంది. సమాజంపై ప్రభావం చూపే మరో ముఖ్యరంగం సినిమా పరిశ్రమ, బుల్లితెర.వినోదంతో పాటు సామాజిక బాధ్యతను కూడా ఈ రంగాలు గుర్తించాలి. సమాజంలో మంచి విలువలను పెంపొందించే కంటెంట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. భారతదేశం యువ జనాభా అధికంగా ఉన్న దేశం. యువశక్తి సరైన దిశలో నడిస్తే దేశ అభివృద్ధికి అది గొప్ప బలం. కానీ నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు సరిపడా కల్పించలేకపోతే యువత నిరుత్సాహానికి గురవుతుంది. యువశక్తిని సృజనాత్మక దిశగా మలచడం ప్రభుత్వాల ముఖ్యబాధ్యత. సమాజ నిర్మాణం తరగతి గదిలో ప్రారంభమవుతుందని అంటారు. గురువు-శిష్య సంబంధం ఒకప్పుడు అత్యంత పవిత్రమైనది.కానీ నేడు ఆ బంధంలో కూడా విభేదాలుకనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులు,విద్యార్థులు పరస్పరం గౌరవం కోల్పోతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి.ఈ పరిస్థితులన్నింటినీ చూస్తే సమాజం ఎటువైపు వెళ్తోంది అనే ప్రశ్న కలుగుతుంది. మనిషితనం క్రమంగా కనుమరుగవుతున్నట్లుగా అనిపిస్తోంది. పరస్పర గౌరవం, సహనం, నిజాయితీ,మానవీయ భావాలు మళ్లీ బలపడితేనే సమాజం సుస్థిరంగా ముందుకు సాగుతుంది. అప్పుడు మాత్రమే మనిషి నిజమైన మనిషిగా మారగలడు. ●

ong-5_ong-5.qxd 3/19/2026 12:10 AM Page 1

జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను కలిసిన మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని, కుమారుడు ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు, ప్రభాతవార్త

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌ను బుధవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, జనసేన రాష్ట్ర నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి, యువనేత బాలినేని ప్రవీణ్‌రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్, బాలినేని మధ్య అరగంట పాటు చర్చలు కొనసాగాయి. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పరిణామాలను, సభ్యత్వ నమోదు కార్యక్రమాలను బాలినేని వివరించినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా సభ్యత్వ కార్యక్రమాన్ని మీరు చేపట్టాలని చెప్పినట్లు సమాచారం. అన్ని నాకు తెలుసు,నేను చూసుకుంటా అని బాలినేనికి భరోసా ఇచ్చినట్లు తెలిసింది. 23వతేదీ దాటిన తరువాత మరలా ఒకసారి తనను కలవాలని పవన్‌కళ్యాణ్ చెప్పినట్లు సమాచారం.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి శిద్దా

చీమకుర్తి, మార్చి 18, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజలకు,ప్రకాశం జిల్లా వాసులకు శ్రీ పరభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఈ ఉగాది పండుగతో మీ జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని శ్రీ పరభవ నామ సంవత్సర ఉగాది పండగ మీకు శుభం కలిగించి అష్టైశ్వర్యాలు, భోగా భాగ్యాలు ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటునట్లు శిద్దా రాఘవరావు తెలిపారు. ప్రజలందరూ ఉగాది పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు శిద్దా రాఘవరావు ఒక ప్రకటనలో తెలియ చేశారు.

అన్నదాతలను ఆదుకుంటున్న చంద్రన్న: ఎమెల్యే బిఎన్

చీమకుర్తి, మార్చి 18, ప్రభాతవార్త

రైతులను ఆదుకోవడం కోసం మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక పథకాలను అమలు చేస్తున్నాడని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ అన్నారు. చీమకుర్తి పట్టణంలో రచ్చమిట్ట సెంటర్,తూర్పు బజారులో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలలో భాగంగా అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు ఏటా 20 వేలు ఇస్తున్నారు అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి వెళ్లి కరపత్రాలను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో మద్దిపాడు ఏఎంసి చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, ఎమ్మార్వో బ్రహ్మాయ్య,అగ్రికల్చర్ ఆఫీసర్ భాస్కర్,పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, టౌన్ పార్టీ అధ్యక్షులు ముప్పురి చల్లమయ్య, మండల పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, సొసైటీ చైర్మన్ పునాటి వెంకట్రావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, గొల్లపూడి కోటేశ్వరరావు, రమాదేవి, గోరంట్ల అంజలి రామకృష్ణ, పట్టణ, మండల నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చీమకుర్తి స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీవో లక్ష్మీప్రసన్న

చీమకుర్తి, మార్చి 18, ప్రభాతవార్త

చీమకుర్తి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా ఒంగోలు ఆర్డీఓ కె లక్ష్మి ప్రసన్న బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్య, మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పవరం పంచాయతీని డిపిఓ ఎం వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ

జె.పంగులూరు మార్చి 18 ప్రభాతవార్త

మండలంలోని ముప్పవరం గ్రామపంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి ఎం. వెంకటేశ్వర రావు ముప్పవరం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఇంటి పన్నులు కలెక్షన్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మిక తనిఖీ చేయడం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంటి పనులు మొత్తం 18,450/ ఇంటి పన్నులు వసూలు చేయబడినందుకు అసంతృప్తి వ్యక్తం పరిచి, గ్రామపంచాయతీకి ప్రతిరోజు టార్గెట్ ..40,000/ ఉండటంతో వివో ఏ ల సహకారంతో వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలో 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆన్‌లైన్ పన్ను వసూలు ఇప్పటివరకు 68.73 మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన అస్సెస్మెంట్స్ ను మార్చి 20 లోపు పూర్తిచేయాలని పంచాయతీ అభివృద్ధి అధికారిని ఆదేశించారు.ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం, ఆలస్యం లేదా నిర్లిప్తత సహించబడదని మరియు బాధ్యులపై చట్టపరమైన మరియు శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జనకవరం గ్రామ పంచాయితీ ఆన్‌లైన్ పన్ను వసూలు ఇప్పటివరకు 67.78 ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన హౌస్ ట్యాక్స్ అస్సెస్మెంట్స్ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు, ఈ విషయంపై ఎంపీడీవో, డి. వై. ఎంపీడీవో, మరియు ఎన్జీవోలు ప్రత్యేక దృష్టి పెట్టి, సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుని వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ యం.పి.డి.ఓ మరియు డిప్యూటీ యం.పి.డి.ఓ. సుమంత్, పంచాయితీ అభివృద్ధి అధికారి మరియు స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

జాల్లపాలెం తిరునాళ్లకు పూర్తయిన ఏర్పాట్లు: ఈవో కొండారెడ్డి

కొండేపి, ప్రభాతవార్త

మండలంలోని జాళ్ళపాలెం గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా నేడు అనగా గురువారం జరగనున్న జాళ్ళ పాలెం తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తయినట్లు దేవాదాయ శాఖ ఈవో తెలియజేశారు. ప్రతి ఏడు మాదిరి జాల్ల పాలెం బ్రహ్మంగారి మఠం వద్ద భక్తులు తమ మొక్కుబడులు చెల్లించుకుంటూ స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ, జిల్లాలో పేరుఎన్నిక గల తిరునాళ్లలో జాళ్ళపాలెం తిరుణాల ఒకటి, ఈ తిరుణాళ్లకు మండలం నుండే కాక జిల్లా నలుమూలల నుండి ఇతర రాష్ట్రాల నుండి కూడా భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఈ సందర్భంగా మఠానికి సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలంకరణ చేశారు, భక్తులు మూడు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు, వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల సౌకర్యార్థం పొదిలి ఒంగోలు కందుకూరు ఆర్టీసీ డిపో వారికి సమాచారం అందించినట్లు ఈవో తెలిపారు,

విహుంగ్ 2026లో సత్తా చూపిన రైజ్ విద్యార్థునులు

ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త

మలినేని సుశీలమ్మ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహించిన విహుంగ్2026, కార్యక్రమములో కల్చరల్ మరియు జాతీయ స్థాయి మహిళా కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించగా, అందులో రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్‌కు చెందిన ఖోఖో టీం ప్రథమ స్థానములో, రైజ్ కృష్ణసాయి గాంధీ గ్రూప్ కు చెందిన కబడ్డీ టీం విద్యార్థినులు ద్వితీయ స్థానం లో మరియు రైజ్ కృష్ణసాయి ప్రకాశం గ్రూప్ ఎమ్. శివపార్వతి 800 మీటర్ల పరుగు పందెములో ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాలల సెక్రటరీ శిద్దా హనుమంతరావు గారు తెలియ చేసారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ తిజు. భాస్కరరావు మాట్లడుతూ కబడ్డీ ఖోఖో రన్నింగ్ విభాగాలలో విద్యార్థినులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ స్థానాలను గెలుచుకోవడం ఎంతగానో ఆనందంగా వుంది అని తెలియచేసి, విజేతలను అభినందించారు. విద్యార్థినులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, ప్రస్తుత పరిస్థితులలో మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, తెలియచేస్తూ క్రీడలలో రాణించిన విద్యార్థినులను రాగ చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక అభినందించారు. ఈ కార్యక్రమములో విజేతలైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నారు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేజు సుబ్రహ్మణ్యం ఫీజికల్ డైరెక్టర్స్ హిమచంద్రబాబు, వెంకటేశ్వర్లు అభినందించారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

నవోదయ ఎంట్రన్స్‌లో శ్రీ శ్రీనివాస యుపి స్కూల్ విజయదుందుభి

ఒంగోలు, ప్రభాతవార్త

టంగుటూరు మండలంలోని కొణిజేడు గ్రామంలో శ్రీ శ్రీనివాస యుపి స్కూల్ విద్యార్థులు 8 మంది నవోదయ విద్యాలయంలో 6 వ తరగతిలో ప్రవేశం పొందారని పాఠశాల కరస్పాండెంట్ కొల్లి శ్రీనివాసులు తెలిపారు విద్యార్థులు 1) డి. సాత్విక్ 2) ఎ. అవంతిక 3) యం. శైలజ 4) కె. సాయి మంజుల 5) కె. అన్విత 6) కె. విష్ణు వర్ధన్ 7) యం. శ్రీనివాస్ 8) షేక్. మహీనా వారికి కరస్పాండెంట్ కొల్లి శ్రీనివాసులు ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులు గ్రామస్తులు అభినందించారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్

ఒంగోలు,సంతనూతలపాడు, ప్రభాతవార్త

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. ఇంద్రధనుస్సు పథకంలో భాగంగా దివ్యాంగుల కోసం ఆర్టీసీ బస్సులలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని బుధవారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్, ఒంగోలు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ రాచగర్ల వెంకట్రావులతో కలిసి ప్రకాశం బస్సు స్టేషన్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వం తాజాగా ఆర్టీసీ బస్సులలో కూడా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. స్త్రీ శక్తి పథకానికి వర్తించినట్లుగానే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సులలో ఉచితంగా ప్రయాణించవచ్చని చెప్పారు. 40శాతం అంతకంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు తోడుగా వచ్చే వారికి 50 శాతం రాయితీ లభిస్తుందన్నారు. ఈ పథకం కింద ప్రకాశం జిల్లాలోని 27 మండలాల పరిధిలో ఉన్న 21,909 మంది దివ్యాంగులలో మహిళలతో పాటు పురుషులకు కూడా ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తున్నట్లు చెప్పారు. అర్హులైన దివ్యాంగులందరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వైకల్య దృవీకరణ కోసం పెండింగ్లో ఉన్న సదరం సర్టిఫికెట్లను కూడా త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు.

ఎంపీ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని దివ్యాంగులందరికి అవసరమైన ఉపకరణాలు ఇచ్చేందుకు మూడు కోట్ల రూపాయలు అవసరం అవుతాయని అధికారులు నివేదిక రూపొందించినట్లు ఎంపీ చెప్పారు. ఈ మేరకు వివిధ మార్గాలలో నిధులను సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆయన కోరారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపేలా ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

దివ్యాంగులతో మూడు మార్గాలలో:

ఈ సమావేశం అనంతరం బస్టాండ్ నుంచి కొత్తపట్నం, సంతనూతలపాడు, టంగుటూరు మార్గాలలో దివ్యాంగులతో కలిసి ప్రత్యేక బస్సులలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే ప్రయాణించారు. టంగుటూరు మార్గంలో వెళ్లే బస్సులో కలెక్టర్, కొత్తపట్నం మార్గంలో వెళ్లే బస్సులో ఎంపీ, సంతనూతలపాడు మార్గంలో వెళ్లే బస్సులో ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెళ్లి తిరిగి బస్టాండ్ వరకు వచ్చారు.

కలెక్టరే.. కండక్టర్:

దివ్యాంగులతో కలిసి ప్రయాణిస్తున్న కలెక్టర్.. ఆ బస్సులో కండక్టర్‌గా మారిపోయారు. బస్సులోని దివ్యాంగులకు ఉచిత ప్రయాణ టికెట్లను కలెక్టరే ఇచ్చారు. ముఖ్యమంత్రి తమకు కల్పించిన ఈ సౌకర్యంపై దివ్యాంగులు హర్షం వ్యక్తం చేశారు. సంకేత భాషతో పాటు తెల్ల కాగితంపై రాసి తమ సంతోషం వ్యక్తం చేశారు.

కలిసి భోజనం:

టంగుటూరు మార్గంలో ప్రయాణించిన బస్సులోని దివ్యాంగులకు తిరుగు ప్రయాణంలో ప్రకాశం భవనంలో కలెక్టర్ ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేశారు. వారితో కలిసి ఆయన భోజనం చేశారు. వారి విద్య, ఇతర ఆసక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ బి.చిన ఓబులేసు, ఆర్‌టీసీ ఆర్ఎం సత్యనారాయణ, డీఎం శ్రీనివాసరావు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు సువార్త, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగశక్తి ఉచిత బస్సును ప్రారంభించిన ఎంపీ మాగుంట

కొత్తపట్నం, మార్చి 18, ప్రభాతవార్త

కొత్తపట్నం మండలం లో దివ్యాంగ శక్తి ఉచిత బస్సు ప్రయాణం ను ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించడం జరిగింది ఒంగోలు నుండి కొత్తపట్నం వరకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో దివ్యాంగులతో ముచ్చటిస్తూ పర్యటించడం జరిగింది. ప్రతి దివ్యంగుడు తమ యొక్క ప్రయాణాన్ని ఉచితంగా పొందవచ్చు అని దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించాలని తెలియజేశారు దివ్యాంగుల్లో 40 లేదా అంతకన్నా ఎక్కువగా ఉన్న వికలాంగత్వం ఉన్నవారికి ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలియజేశారు ప్రతి సంవత్సరం సుమారుగా 207కోట్లు భారీ సబ్సిడీతో కల్పించడం జరిగిందని తెలియజేశారు. ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం కల్పించినందుకు దివ్యాంగులు రాష్ట్ర ప్రభుత్వానికి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మేనేజర్ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు, ఆర్టీసీ ఉద్యోగులు, దివ్యాంగుల నాయకులు పిన్ని శివయ్య, నాంచార్లు, బాలకోటయ్య, కాంతారావు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం కుటుంబాలకు సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ రంజాన్ తోఫా పంపిణీ

ఒంగోలు, ప్రభాతవార్త

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభాస్ భారతీయులు మరియు దాతల సహకారంతో నగరంలోని 200 మంది అత్యంత నిరుపేద ముస్లిం కుటుంబాలకు సుమారు 3 లక్షల రూపాయల విలువైన నిత్య వసర సరుకులను (రంజాన్ తోఫా) బుధవారం పంపిణీ చేశారు. ఒంగోలు నగరంలోని సుమారు 18 ప్రాంతాల్లో సర్వే నిర్వహించి, నిజంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను గుర్తించి వారికి ఈ సాయం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ, ట్రస్ట్ చైర్ పర్సన్ షేక్ షహనాజ్, గౌరవ సలహాదారులు మండవ సుబ్బారావు, ఎస్.ఎమ్.ఎస్ ఫ్రూట్స్ అధినేత మెహబూబ్ భాష తమ చేతుల మీదుగా ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ "రంజాన్ అంటేనే త్యాగానికి, దానగుణానికి ప్రతీక. పవిత్రమైన ఈ నెలలో తోటి సోదరుల ఆకలి తీర్చడం మా బాధ్యతగా భావిస్తున్నాము. అందుకే నగరంలోని 18 ఏరియాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాగా ఇబ్బంది పడుతున్న 200 కుటుంబాలను ఎంపిక చేసి ఈ రంజాన్ తోఫాను అందజేశాము. భవిష్యత్తులోనూ సూర్య శ్రీ ట్రస్ట్ ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపడుతుంది. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ సర్దార్ భాష, జనసేవ శ్రీనివాస్, మేడిశెట్టి వెంకట సుబ్బారావు మరియు ఇతర ట్రస్ట్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. అత్యంత పారదర్శకంగా, నిరుపేదలను నిగుర్తించి సాయం చేసినందుకు స్థానికులు ట్రస్ట్ సభ్యులను అభినందనలతో ముంచెత్తారు.

కౌలు రైతులకు నూతన కౌలు చట్టాన్ని తక్షణమే అమలు చేయాలంటూ ధర్నా

ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త

రాష్ట్రంలోని కౌలు రైతుల రక్షణ మరియు సంక్షేమం కోసం నూతన కవులు చట్టాన్ని తీసుకురావాలని రుణ సదుపాయం మరియు ఇతర ప్రభుత్వ ఫలాలను అందించాలని కోరుతూ బుధవారం ప్రకాశం భవన్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం డిఆర్ఓ ఓబులేసు గారికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె వీరారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో సాగవుతున్న వ్యవసాయ భూములో 70 కౌలు రైతులేనని అన్నారు. కౌలు రైతులకు గ్రామ సభల ద్వారా భూ యజమాని ప్రమేయంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలి సాగుచేస్తున్న ప్రతి కౌలు రైతు పేరును ఈ పంట పోర్టల్లో నమోదు చేసి వారికి ప్రభుత్వం అందించే వివిధ పథకాల ప్రయోజనాలను అందేలా చూడాలి భూ యజమాని పాత బకాయితో నిమిత్తం లేకుండా పంట హామీపై కౌలు రైతులకు రెండు లక్షల వరకు సున్నా వడ్డీతో బ్యాంకు రుణాలు అందించాలి. భూమిలోనే ప్రతి కవులు రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద 20 వేల ఆర్థిక సహాయం అందించాలి . కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలి . ఉచిత పంటల బీమా పథకాన్ని పునర్ గురించి గత రెండేళ్ల భీమా క్లైములు వెంటనే చెల్లించాలి. కౌలు రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు మరియు కిసాన్ విశిష్ట గుర్తింపు సంఖ్యను జారీ చేయాలి దేవాదాయ ధర్మాదాయ భూములు సాగు చేసుకుంటున్నా కవులు దారులకు శాశ్వత గుర్తింపు కార్డులు జారీ చేయాలి విధానాన్ని రద్దు చేయాలి. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యు ప్రకాశరావు, శ్రీనివాస్, పి అంజయ్య, కే వెంకటేశ్వర్లు, సర్దార్, ఇజ్రాయిల్ మొదలగువారు పాల్గొన్నారు

చెవిరెడ్డి ఒకే.. బూచేపల్లికి ప్రమోషన్

- ఒంగోలుపై జగన్ కీలక నిర్ణయాలు

ఒంగోలు, ప్రభాతవార్త

వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో మంగళవారం ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల వాఈగా జగన్ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం ఒంగోలు నియోజకవర్గం కార్యకర్తలతో జగన్ భేటీ అయ్యారు. ఈ నియోజకవర్గం సీనియర్ నేత, వైసీపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రాతినిత్యం వహించినది కావడం అందరికి తెలిసిందే. బాలినేని తిరిగి వైసీపీలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారం నడుమ జగన్ నిర్వహించిన సమావేశంలో రెండు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ రెండు రాజకీయంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయని చెబుతున్నారు.ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ సమావేశంలో జగన్ మాట్లాడిన తీరు, అందరు పాల్గొన్న ఇద్దరు నేతలు అందరి దృష్టిని ఆకర్షించారు. వైసీపీలో అధికారంలో ఉన్నంత వరకు ఆ పార్టీకి జిల్లాలో పెద్ద దిక్కుగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహరించేవారు. ఆయన పార్టీకి రాజీనామా చేసిన తర్వాత ఆ స్థానం ఎవరు భర్తీ చేస్తారనే చర్చ ఇప్పటి వరకు జరిగింది. సీనియర్ నేత, మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి జిల్లా వ్యవహారాలు చూస్తారని అనుకున్నా, వయసు రీత్యా ఆయన గతంలో ఉన్నంత చురుగ్గా ఉండలేకపోతున్నారు. దీంతో జిల్లా బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారనేది పార్టీ వర్గాల్లో విస్తృత చర్చకు దారి తీసింది. అయితే మంగళవారం జరిగిన సమావేశంలో ఈ విషయంపై మాజీ సీఎం జగన్ ఓ క్లారిటీ ఇచ్చారని అంటున్నారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి భవిష్యత్తులో పెద్ద పదవిలో ఉంటారని జగన్ చెప్పడం ద్వారా బాలినేని స్థానంలో బూచేపల్లి మాత్రమే జిల్లా పగ్గాలు చూస్తారని స్పష్టత ఇచ్చినట్లయిందని అంటున్నారు. పార్టీ కోసం బూచేపల్లి చాలా కష్టపడుతున్నారని మాజీ సీఎం జగన్ ప్రశంసించారు. అన్నీ కలిసివస్తే భవిష్యత్తులో బూచేపల్లి ఉన్నత స్థానంలో ఉంటారిన అధినేత వ్యాఖ్యానించారు. దీనిని బట్టి చూస్తే జిల్లాలో వైసీపీ పార్టీలో బూచేపల్లికి పూర్తి స్థాయి బాధ్యతలు అప్పగించడం ఖాయంగా చెబుతున్నారు. ప్రస్తుతం బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. గత ఎన్నికల్లో కూటమి సునామీని తట్టుకుని ఆయన గెలిచారు. అంతే కాకుండా పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ వెన్నుచూపకుండా పోరాడుతున్నారని జగన్ భావిస్తున్నారని అంటున్నారు. జగన్ తాజా వ్యాఖ్యలతో బూచేపల్లి భవిష్యత్తులో పార్టీ అధికారంలోకి వస్తే మంత్రి పదవి చేపట్టడం ఖాయమన్న చర్చ జరుగుతోంది. మరో వైపు ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి విషయంలోనూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఒక స్పష్టత ఇచ్చారని అంటున్నారు. గత ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి చెవిరెడ్డి పోటీ చేశారు. అయితే ఇటీవల కొన్ని రోజులుగా ఆయనను ఒంగోలుకు దూరంగా ఉండమని జగన్ చెప్పారంటూ ప్రచారం జరుగుతోంది. చెవిరెడ్డి సొంత నియోజకవర్గమైన తిరుపతి జిల్లా చంద్రగిరికి మాత్రమే పరిమితం కావాలని, ఒంగోలు రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దని జగన్ ఆదేశించారంటూ కొన్ని మీడియా గ్రూపుల్లో కథనాలు వస్తున్నాయి. చెవిరెడ్డికి జగన్ అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదని చెప్పుకొచ్చారు. అయితే ఈ ప్రచారానికి తాజాగా జగన్ ఫుల్ స్టాప్ పెట్టినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. ఒంగోలు కార్యకర్తల సమావేశంలో చెవిరెడ్డికి భాగస్వామ్యం కల్పించారు. దీంతో ఆయనను ఈ జిల్లా రాజకీయాల నుంచి వేరు చేయలేదని సంకేతాలు ఇచ్చినట్లయిందని అంటున్నారు. చెవిరెడ్డి సైతం మీటింగ్‌లో హుషారుగా పాల్గొన్నారు. జగన్‌తనను దూరంపెట్టాని మీడియాలో జరిగిన ప్రచారానికి ఈసమావేశం ద్వారా స్పష్టత ఇచ్చే ప్రయత్నంచేశారని అంటున్నారు.

6_6.qxd 3/18/2026 11:50 PM Page 1

ఉరుములు మెరుపులతో అన్నదాతలలో ఆందోళన

బల్లికురవ, మార్చి 18,ప్రభాతవార్త

మండు వేసవిలో ప్రకృతి వర్షం ఊపంలో ప్రకోపిస్తే ఏం చేయాలో తెలియకపోవడం పుడమి పుత్రులు వరుణ దేవుడి కరుణ కోసం ప్రార్థనలు చేస్తున్నారు. వాతావరణంలో ఒక్క సారిగా మార్పులు రావడం, బుధవారం సాయంత్రానికి ఉరుములు, మెరుపులతో చిరు జల్లులు ప్రారంభం కావడంతో అన్నదాతల గుండెల్లో ఆందోళన మొదలైంది. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని ఆయకట్టు పరిధిలో వరిపంట కొంత కోత దశలో ఉంది. మొక్కజొన్న పంట కండె దశలో ఉంది. మరికొంత పొలాల్లోని ఎండి నిలువు దశలో ఉంది. ఈ స్థితిలో వర్షం కురిస్తే మాగాని, మొక్కజొన్న, మిర్చి, బర్లీ పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. భగవంతునిపై భారం వేసి ఆకాశం వైపు దీనంగా చూస్తూ ఉండటం తప్ప అన్నదాతలు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. వీరి ఆందోళన, ఆవేదన, ప్రకృతి మాతకు వినిపిస్తే, మేలు జరుగుతుందని ఆశిద్దాం.

ప్రజలకు పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

లింగసముద్రమం, మార్చి 18, ప్రభాతవార్త

తెలుగు వారి సాంప్రదాయ నూతన సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలను పరాభవ నామ సంవత్సరాదిగా ఉగాది అరుదెంచుచుందని ఈ ఉగాది అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని షడ్రుచులైన తీపి చేదు వగరు పులుసు కారం లాంటి రుచులతో జీవితం నిండాలని లింగసముద్రం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బింకం నాగేంద్ర ఆకాంక్షించారు. ఉగాది నాడు పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే సంవత్సరంలో రాశి ఫలాలు వర్షాభావ పరిస్థితులు గ్రహ స్థితులు రాజకీయ పరిణామాలపై జ్యోతిష్యులు వివరించు శ్రవణం అందరి జీవితాల్లో ఆనందం నింపాలని అభిలాషించారు. ప్రకృతి వసంత రుతువు రాకతో లేత చివుళ్ళను సంతరించుకొని కోకిల కూహు కుహూ రాగాలతో నూతన ఉత్తేజానికి స్వాగతం పలుకుతుంది. ఉగాది పండుగ సకల ప్రాణకోటికి నూతన శక్తిని ఆశలను కొత్త చిగురు లాంటి ఆనందాన్ని ఇస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

నవోదయకు ఎంపికైన ఎంఎన్‌డీకే విద్యార్థులు

పుల్లలచెరువు, మార్చి 18, ప్రభాతవార్త

మండల కేంద్రమైన పుల్లలచెరువులోని ఎంఎన్‌డీకేవీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాలకు చెందిన ముగ్గుఉ విద్యార్థులు గల ఆర్ ఉమ్మడివరం గ్రామానికి చెందిన జి.నిఖిల్, పుల్లలచెరువుకు చెందిన బి.అభిషేక్, టి.నెహెమ్యా అనే విద్యార్థులు నవోదయకు ఎంపిక అయ్యారని పాఠశాల కరస్పాండెంట్ వీరయ్య తెలిపారు. ఆరవ తరగతి నవోదయ ప్రవేశ పరీక్షలో తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడుతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. దీంతో పాటు గ్రామస్తులు సైతం విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఇంకా ముందు ముందు రానున్న రోజుల్లో మంచిగా చదువుల్లో ఇంకా భాగా పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పలువురు ఆశీర్వదించారు.

నవోదయలో జయఢంకా మోగించిన సిద్దార్థ స్కూల్ విద్యార్థులు

- ముగ్గురు విద్యార్థులు ఎంపిక - పాఠశాల ప్రతిష్ఠను పెంచిన ప్రతిభ

పుల్లలచెరువు, మార్చి 18, ప్రభాతవార్త



మండలంలో ముటుకులలోని సిద్దార్థ పాఠశాలకు చెందిన విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షల్లో మెరిసి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచారు. 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో యుద్ధ అవినాష్, ఎం.మాధవి, టి.సంతోష్‌రెడ్డి ఎంపికై తమ ప్రతిభను చాటుకున్నారు. సోమవారం విడుదలైన ఫలితాల్లో ఈ ముగ్గురు విద్యార్థులు ప్రవేశానికి అర్హత సాధించడం పాఠశాలలో ఆనందోత్సాహాలను నింపింది. డిసెంబర్‌లో జరిగిన ఈ ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు క్రమశిక్షణతో చదివి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో కృషి చేసి మంచి మార్కులు సాధించి విజయాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మానుకొండ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల పట్టుదల, ఉపాధ్యాయుల అంకితభావం కలిసి వచ్చిన ఫలితమే ఇది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం ఉంటే పెద్ద విజయాలు సాధించగలరని మా విద్యార్థులు నిరూపించారు అని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు కూడా విద్యార్థుల విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. నవోదయ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం సాధించడం ద్వారా ఈ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి

కురిచేడు, మార్చి 18, ప్రభాతవార్త

పిడుగుపాటుకు ఒక మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కురిచేడు మండలం పడమర వీరాయపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చౌడేశ్వర కాలనీలో కాటూరి సుబ్బరత్నమ్మ బుధవారం పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో మిర్చి కోతకు వెళ్లి అక్కడ పిడుగు పాటుకు గురై మృతి చెందింది.

రంజాన్ సందర్బంగా దాతృత్వం

9, 10 బ్లాకుల్లో 150 కుటుంబాలకు చీరల పంపిణ

మార్కాపురం, మార్చి 18, ప్రభాతవార్త

రంజాన్ పండుగను పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని 9,10 బ్లాకుల్లో పేద ముస్లిం కుటుంబాలకు చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పండుగ వేళ అవసరమైన వారికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మొత్తం 150కుటుంబాలకు చీరలు అందజేశారు. 9వ బ్లాక్ కౌన్సిలర్ సిరాజ్, ఆయన తనయుడు ఇమ్రాన్ కలిసి ప్రతి కుటుంబాన్ని స్వయంగా కలుసుకుని చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ పండుగ సమయంలో పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు సహాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. రంజాన్ సందర్భంగా సంతోషాన్ని పంచుకోవడం, అవసరమైన వారికి చేయూత అందించడం ద్వారా సమాజంలో ఐక్యత పెరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చీరలు అందుకున్న వారు ఆనందం వ్యక్తం చేస్తూ, పండుగ సమయానికి అందిన ఈ సహాయం తమకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. తమ అవసరాలను గుర్తించి ముందుకు వచ్చి సహాయం చేసిన సిరాజ్, ఇమ్రాన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ వారి అవసరాలను అర్థం చేసుకుని స్పందించడం వల్లే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పండుగల సందర్భంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందిరీగతో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రశాంతంగా సాగింది.

వాసవి స్కూల్ నందు ఘనంగా ముందస్తు రంజాన్ వేడుకలు

మార్కాపురం టౌన్, మార్చి 18, ప్రభాతవార్త

మార్కాపురం పట్టణంలోని వాసవి స్కూల్ నందు ముందస్తు రంజాన్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.రంగయ్య మాట్లాడుతూ రంజాన్ నెల ఇస్లామిక్ క్యాలెండర్‌లో 9వ మరియు అత్యంత పవిత్రమైన నెల అన్నారు. ఈ నెల ఖురాన్‌ఎ.షరీఫ్ అవతరించిన నెలగా పరిగణించబడుతుందన్నారు. ఈ నెలలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో 5 పూటలా ప్రార్థనలు నిర్వహిస్తూ ఉపవాస దీక్షలు పాటిస్తారన్నారు. ఖురాన్ పఠనం, దాన ధర్మాలు నిర్వహిస్తారన్నారు. రంజాన్ పండుగ సమానత్వం, ఐక్యతకు ప్రతీక అని కొనియాడారు. అనంతరం పల్నాటి రెహమాన్, ఖాన్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఓ రంజిత్, ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపాలి

పొన్నలూరు , మార్చి 18, (ప్రభాత వార్త)

మండలంలోని రావులకొల్లు అంగన్వాడీ కేంద్రంలో మహిళలకు బాల్య వివాహాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ మాట్లాడుతూ బాలికలకు విద్య తప్పనిసరి అని,18 సంవత్సరాలు లోపు బాలికలకు వివాహాలు చేయకుండా,బాల్య వివాహాలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఇతర ఉపాధ్యాయులు,అంగన్ వాడి టీచర్స్ బి .శిరీష, ఎన్.క్రిష్ణవేణి, బి.హైమావతి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు నిత్యవసర సరుకులు అందజేత

దర్శి, మార్చి 18, ప్రభాతవార్త

లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో బుధవారం దర్శి పట్టణం అద్దంకి రోడ్డులోని ఆటో నగర్ నివాసం ఉన్నటువంటి ఇద్దరు నిరుపేద ముస్లిం మహిళకు రంజాన్ పండుగ సందర్భంగా రెండు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులను పంపిణీ చేయడం జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ చేస్తున్నటువంటి అనేక రకాల సేవా కార్యక్రమాలను యూట్యూబ్, ఫేస్‌బుక్, ప్రముఖ దినపత్రికలలో చూసి తన వంతుగా ఈ నిత్యవసర వస్తువులను దర్శి మండలం కొత్తపల్లి గ్రామ నివాసి అయినటువంట సయ్యద్ షాహిద్ బేగం లయన్స్‌క్లబ్ ద్వారా తన వంతు ఈ ఉచిత నిత్యవసర వస్తువులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్యాట్ మార్కెటింగ్ చైర్ పర్సన్ కల్లూరి విద్యా సాగర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ తమ్మవరపు ఫణిబాబు, క్లబ్ సెక్రటరీ పానుగంటి సత్యనారాయణ గుప్తా, ట్రెజరర్ గుడిపాటి అశోక్, క్లబ్ సభ్యులు బిజ్జం నాగార్జునరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, అంబటి గోవిందరెడ్డి, గుడిపల్లి శ్రీధర్‌రావు, యనుముల నర్సారెడ్డి, ఆశా వర్కర్, జే.సుశీల తదితరులు పాల్గొన్నారు.

దర్శి పట్టణంలోని 18వ వార్డులో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, మార్చి 18, ప్రభాతవార్త

దర్శి పట్టణంలోని 18వ వార్డులో గల జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలను బుధవారం దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల తో మమేకమై ఆప్యాయంగా ఆత్మీయంగా వారిని పలకరిస్తూ ప్రభుత్వం అందిస్తున్న భోజనం, నాణ్యత రుచి సరఫరా విధానం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇలా విద్యార్థులతో ఆప్యాయంగా పలకరిస్తూ భోజనం చేయగా పిల్లల ఆనందానికి అవధులు లేకుండా చిరునవ్వులతో చిందులు వేశారు. వారిలో ఆనందం వెల్లివిరిసింది. అదే స్ఫూర్తితో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతులు, మధ్యాహ్న భోజన పథకం, పాఠశాల పరిశుభ్రత, తాగునీరు తదితర అంశాలపై శ్రద్ధ వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి- సుబ్బారావు, 28వ వార్డు కౌన్సిలర్ నారపుశెట్టి ధనలక్ష్మీ, బూత్ ఇన్‌చార్జి నారపుశెట్టి శ్రీను, నారపుశెట్టి శ్రీరామ్, స్థానిక నాయకులు ఉన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే మన కూటమి ప్రభుత్వ ధ్యేయం

- అందులో భాగమే నేడు దివ్యాంగ శక్తి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ ప్రయాణం

- ఇది దివాయంగులకు మన ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న ఉగాది చిరు కానుక

- దర్శి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ నందు దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ

దర్శి, మార్చి 18, ప్రభాతవార్త

దర్శి పట్టణం అద్దంకి రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ నందు బుధవారం దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించి అనంతరం దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేసిన దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి, సంక్షేమం కోసం మన కూటమి ప్రభుత్వం నిరంతరం పాటుపడు తుందని మీ అందరికి తెలుసు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు దివ్యాంగుల అభివృద్ధికి చేస్తున్న కృషిలో భాగమే నేడు ఈ దివ్యాంగ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణం అన్నారు. దివ్యాంగులు సమాజంలో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని స్వశక్తిగా బతకాలని అన్నిరంగాల్లో రాణించాలని సమాజంలో ఎక్కడా వెనుకబడకుండా పరిగెత్తాలని ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణాన్ని అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి పట్టణం టీడీపీ అధ్యక్షులు పుల్లలచెరువు సత్యనారాయణ, ఆర్టీసీ సిబ్బంది, నియోజకవర్గంలోని దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి అకాడమీకి మూడు నవోదయ సీట్లు

దర్శి,మార్చి 18, ప్రభాతవార్త

జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఎంట్రన్స్-2026 పరీక్షా ఫలితాల్లో ప్రగతి అకాడమీ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థినీ ఉండేలా భవ్య, కలుజువ్వలపాడుకు చెందిన ప్రకాశం జిల్లా జోన్లో జిల్లా స్థాయి 10వ ర్యాంకు సాధించినట్లు అకాడమి డైరక్టర్ యు.నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నవోదయ కోచింగ్ ప్రారంభించిన మొదటి ప్రయత్నంలోనే జిల్లా ర్యాంకులతో పాటు మొత్తం ముగ్గురు విద్యార్థులు నవోదయ సీట్లు సాధించారని తెలియజేశారు. నవోదయ సీట్లు సాధించిన వారిలో యు.భవ్య, కే.మోహిత్, టి.రోహిత్ ఉన్నారు. ఈ అఖండ విజయానికి కారకులైన విద్యార్థినీ, విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు, భోదించిన ఉపాధ్యాయ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

దారం మాలకొండయ్య మృతికి గొట్టిపాటి లక్ష్మీ నివాళి

దర్శి, మార్చి 18, ప్రభాతవార్త

దర్శి పట్టణం 19వ వార్డు పుచ్చలమిట్టలో టీడీపీ సీనియర్ నాయకులు దారం మాలకొండయ్య అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందగా విషయం తెలుసుకున్న దర్శి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ మాలకొండయ్య పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వారితో పాటు దర్శి ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షులు చిన్నా, కర్నా శ్రీను, దారం నరసింహారావు స్థానిక నాయకులు ఉన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

జీవనోపాధికి కొత్త దారి

మార్కాపురం, మార్చి 18, ప్రభాతవార్త

దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒక పెద్ద వరమని జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో దివ్యాంగ శక్తి పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40శాతం లేదా అంతకంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో సుమారు 18వేల మంది దివ్యాంగులకు లాభం చేకూరనుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 12.72 లక్షల మంది దివ్యాంగులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందనున్నారని వివరించారు. నకిలీ సర్టిఫికెట్లతో ప్రయోజనం పొందే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో దివ్యాంగులకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం జాయింట్ కలెక్టర్ దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు బస్సులో ప్రయాణించారు. అక్కడ వారితో కలిసి భోజనం చేసి వారికి సంతృప్తి కలిగించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం లావణ్య, ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, టిడిపి నాయకులు కె బాల వెంకట రమణ, టి సత్యనారాయణ, వి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు

సింగరాయకొండ, మార్చి 18, ప్రభాతవార్త

మండలంలోని దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధి గాంచిన పాత సింగరాయకొండ గ్రామంలోని శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు దేవస్థానం చైర్మన్ సన్నెబోయిన శ్రీనివాసులు, ఈఓ పి. కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు.దేవస్థాన ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు పంచాంగ శ్రవణం, అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులతో తీర్థ ప్రసాదాలు పొందాలని వారు కోరారు.

తర్లుపాడులో 10వ తరగతి పరీక్షలపై జేసీ ఆకస్మిక తనిఖీ

రైతులకు పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశం

మార్కాపురం, ఫిబ్రవరి 18, ప్రభాతవార్త :

తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలను బుధవారం జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరు, ఏర్పాట్లు వంటి అంశాలను పరిశీలించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులను ప్రశ్నపత్రం గురించి అడిగి వారి అభిప్రాయాలను తెలుసుకోగా, వారు సంతృప్తికరంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో తర్లుపాడు ఎస్సై బ్రహ్మనాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పథకాలపై అవగాహన కల్పించాలని ఆదేశం :

అనంతరం తుమ్మలచెరువు గ్రామంలో రైతులతో సమావేశమై ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. రైతులకు అన్ని ప్రభుత్వ పథకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించాలని, సబ్సిడీ పథకాలు, గిట్టుబాటు ధరలు, పంటల కొనుగోలు కేంద్రాల గురించి స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జార్జ్ ఫార్మసీ కళాశాలలో ప్లేస్‌మెంట్ హర్షం

17 మందికి ఆఫర్ లెటర్లు

మార్కాపురం, మార్చి 18,ప్రభాతవార్త

మార్కాపురంలోని జార్జ్ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ విజయవంతంగా ముగిసి, ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపల్ డా డి ప్రసన్న కుమార్ చేతుల మీదుగా ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో హైదరాబాద్‌కు చెందిన విర్ఫో బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పాల్గొని, విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించింది. మొత్తం 17మంది విద్యార్థులు ఎంపికై, వారికి అధికారికంగా ఆఫర్ లెటర్లు అందాయి. ఎంపికైన వారు ముఖ్యంగా క్యూ ఏ (క్వాలిటీ అస్సూరెన్సు), క్యూ సి(క్వాలిటీ కంట్రోల్) విభాగాలలో ఉద్యోగాలు పొందడం విశేషం. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డా డి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ కృషి, పట్టుదలతో ఈ స్థాయికి చేరుకోవడం గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రముఖ సంస్థలను ఆహ్వానించి, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కళాశాల కట్టుబడి ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ డా అడిములపు సతీష్ మాట్లాడుతూ ఈ విజయానికి విద్యార్థుల కృషితో పాటు అధ్యాపకుల మార్గదర్శకత్వం కూడా ముఖ్య కారణమని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధిలో కళాశాల ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అకాడమిక్స్ డా వై సునీత, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా కె అశోక్ బాబు, ఐ క్యూ ఏసి ఇన్‌చార్జ్ సయ్యద్ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విజయ శిఖరం

ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో యాన్యువల్ డే

మార్కాపురం, మార్చి 18,ప్రభాతవార్త

స్థానిక ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం యాన్యువల్ డే వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా విహెచ్ ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమాన్ రెడ్డి, మార్కాపురం డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ రాహుల్, విహెచ్‌ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ వెన్నా ఇందిరా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని సూచించారు. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ప్రతిభ కనబరచాలని, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేందుకు అవసరమైన మార్గదర్శకాలు అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో ముందుకు సాగాలని, ఏ విభాగంలో చేరినా కృషి, పట్టుదలతో లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని సూచించారు. అనంతరం మూడు రోజులుగా నిర్వహించిన ప్రజ్ఞ 2కే26 ఉత్సవాల్లో సాంకేతిక, సాంస్కృతిక, క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంకర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బన్న, అకాడమిక్ డీన్ డాక్టర్ చంద్రలేఖ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విజయ, ఫార్మసీ ఇన్‌చార్జ్ రజిని, డిప్లమా ఇన్‌చార్జ్ మాధవి, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షలో సత్తా

తాళ్లూరు, మార్చి18,ప్రభాతవార్త

నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తాళ్లూరు లోని ఏబీసీ పాఠశాల విద్యార్థిని అనుపర్తి అనన్య షారోను సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ తూము శ్రీనివాస్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కె. వెంకటేశ్వరరెడ్డి,డైరెక్టర్ కాలేషా బాబులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవోదయకు ఎంపిక కావడం అభినందించదగ్గ విషయమని విద్యార్థికి కోచింగ్ అందించిన ఉపాధ్యాయిని దైవకృపను ప్రత్యేకంగా అభినందించారు. నవోదయకు ఎంపికైన అనన్య షారోను మండలం లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు.

నేడు తాళ్లూరులో వెంకట్రామయ్య తిరునాళ్ల

తాళ్లూరు, మార్చి18,ప్రభాతవార్త

తాళ్లూరులో గురువారం అవధూత భగవాన్ వెంకట్రామయ్య స్వామి 89 తిరునాళ్ల నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా వెంకట్రామయ్య ఆలయం వద్ద ఈ వేడుకలు జరపడం ఆనవాయితీ. పలు మండల నుంచి భక్తులు ఉదయం పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకోనున్నారు. వారికి అన్నదాన వసతి కల్పిస్తున్నారు. నిర్వాహకులు ఐడమాకంటి.వెంకట్రామిరెడ్డి(ఐవీరెడ్డి),ఐడమాకంటి. చినకోటిరెడ్డి, కుటుంబీకులతో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు చేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం వేళ ట్రాక్టరు రివర్సు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి వేళ పాట కచేరీ,ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆయా కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బీకేవీ గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు త్వరగా పూర్తి చేయాలి : జేసీ కల్పన కుమారి

తాళ్లూరు, మార్చి 18,ప్రభాతవార్త

బెంగళూరు కడప విజయవాడ (బీకేవీ)గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ హైవే పనులు త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి సూచించారు.బుధవారం మండలంలోని తాళ్లూరు, మల్కాపురం గ్రామాల్లో జరుగుతున్న హైవేపనులను పరిశీలించారు. హైవే నిర్మాణానికి అదనంగా అవసరమైన భూమిని పరిశీలించారు. తాళ్లూరులో 2.28ఎకరాలు,మల్కాపురంలో 14సెంట్లు గుర్తించారు. అక్కడ ప్రభుత్వ వ్యాల్యువేషన్ పై ఆరా తీశారు. హైవే నిర్మాణ పనులు పురోగతి వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట అద్దంకి ఆర్డీవో జాన్సన్, తహసీల్దార్ బచ్చల వెంకట రమణారావు,డీటీలు ఫణీంద్ర,ప్రశాంత్, ఆర్ ఐసుధీర్, మండల సర్వేయర్ మహేష్, వీఆర్వో నాగలక్ష్మి ఉన్నారు.

రైతు అభివృద్ధే రాష్ట్ర ప్రగతి

రైతన్న మీకోసంలో ఏవో కె బుజ్జిబాయి

మార్కాపురం, మార్చి 18 ప్రభాతవార్త

రాయవరం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కె బుజ్జిబాయి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు సంక్షేమం, గౌరవం, ఆదాయ వృద్ధి ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని తెలిపారు. వ్యవసాయాన్ని లాభదాయక రంగంగా మార్చేందుకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు వంటి ఐదు ప్రధాన దిశల్లో కార్యాచరణ కొనసాగుతుందని వివరించారు. పక్రృతి వ్యవసాయం, సూక్ష్మ సేద్యం, డిజిటల్ సేవలు, రైతు యాప్‌ల ద్వారా రైతులకు ఆధునిక, సాంకేతికత అందిస్తున్నామని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధరలు, సబ్సిడీలు, ఇన్‌పుట్ సాయం వంటి పథకాల ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నామని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పవనేశ్వరి రైతులు తదితరులు పాల్గొన్నారు.

యడవల్లిలో చెరువులో పడి వృద్ధుడు మృతి

రాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త

మండలంలోని యడవల్లి గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన బండి దేవదానం (75) చెరువులో పడి మృతి చెందిన సంఘటన గత మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. రాచర్ల ఎస్ఐ పి కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం దేవదానం అనే వ్యక్తి చేపలు పట్టే అలవాటు ఉండడంతో గ్రామ సమీపంలో ఉన్న చెరువులో చేపలు పట్టేందుకు మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో బయలుదేరాడు. రాత్రి చీకటి పడినప్పటికీ అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతకడం ప్రారంభించారు. ఎంతకీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో బుధవారం ఉదయం మరోసారి చెరువువద్ద, పరిసరాల్లో వెదకగా దేవదానం చెరువు నీటి నాచులో కూరుకుపోయి మృతి చెంది ఉన్నాడు. దేవదానం భార్య సరోజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఆయన తెలిపారు.

నీటి సమస్య ఉత్పన్నమవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి

రాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త

వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలో త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం ప్రారంభమైందని, రాబోవు రెండు, మూడు నెలలు చాలా కీలకమని త్రాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆ సమస్యల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అవసరమని అన్నారు. కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చాలా చురుకుగా ఉండాలని ఎలాంటి సమస్య ఎదురైనా దానిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు ఐ వెంకటేష్, ఓవిఎస్ కుమార్, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

రాచర్ల, మార్చి 18 ప్రభాతవార్త

మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీపై రైతులకు జనుము, జీలుగా, పిల్లి పెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలను అందిస్తామని మండల వ్యవసాయ శాఖ ఏవో మహబూబ్ బాషా అన్నారు. జేపీ చెరువు చిన్నగానిపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాల ద్వారా భూమిని సారవంతం చేసుకుని తద్వారా రసాయనిక ఎరువులు తగ్గించుకోవచ్చు అన్నారు. చౌడు భూములను యధాస్థితికి తీసుకురావడానికి సబ్సిడీపై మార్క్ఫెడ్ ద్వారా జిప్సం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఇచ్చే సలహాలు సూచనలను రైతులు పాటించి ప్రభుత్వం అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రమణ, నూర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత కొలతల ప్రకారం పనులు చేయాలి

రాచర్ల, మార్చి 18, ప్రభాతవార్త

ఉపాధి పనులు నిర్ణీత కొలతల ప్రకారం చేయాలని ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి శ్రామికులకు సూచించారు. మండలంలోని గౌతవరం గ్రామంలో జరిగే ఉపాధి పనులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. శ్రామికులు సమయపాలన పాటించాలని ఉదయం 6 నుండి 10 గంటల వరకు కచ్చితంగా పని చేయాలన్నారు. ఎన్ఎంఎంఎస్ ద్వారా (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) హాజరు తీసుకోవడం జరుగుతుందని కూలీలు గమనించాలని అన్నారు. ఉపాధి సిబ్బంది జరిగే పనులు తప్పకుండా పర్యవేక్షి ంచాలన్నారు. ఎంపీడీవో వెంట ఉపాధి ఈసీ జె నాగేశ్వరరావు, టిఏ, ఎఫ్ఏలు తదితరులు ఉన్నారు.

బలిజ సేవాసంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

కంభం, మార్చి 18, ప్రభాతవార్త

శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో కంభం పట్టణ కందులాపురం సెంటర్‌లోని బలిజ సేవాసంఘం కార్యాలయం వద్ద కాటంరాజు వెళ్ళు భక్తులకు బుధవారం ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బలిజ సంఘం కార్యవర్గ సభ్యులు సహకరించారని అధ్యక్షులు సూరె ప్రసాద్ తెలిపారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు పులి శ్రీనివాస ప్రసాద్, కాసులపాడు, ఉపాధ్యక్షులు తోట కోటేశ్వరరావు కార్యదర్శి రఘువీర్, మామిళ్ల చంద్రశేఖర్, పి కృష్ణమోహన్, శ్రీరామ్ వెంకటేశ్వర్లు, గుత్తి సత్యం తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల

కంభం, మార్చి 18, ప్రభాతవార్త

కంభం పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పర్వదినం సందర్భంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. పట్టణంలోని అర్బన్ కాలనీ, రైల్వే స్టేషన్ సమీపంలో నివశిస్తున్న పలువురు పేద ముస్లిం కుటుంబాల ఆయన రంజాన్ తోఫాను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఉగాది,రంజాన్ పండుగలు సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తుముల ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట - ఎమ్మెల్యే

కందుకూరు మార్చి 18, ప్రభాతవార్త

ముస్లింల అభివృద్ధి సంక్షేమానికి ప్రభుత్వం అధికప్రాధాన్యత ఇస్తుందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందులోభాగంగా ఇమామ్, మోజంలకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.90 కోట్లు విడుదల చేశారన్నారు. తాజాగా మరో రూ.45 కోట్లు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. రంజాన్ సందర్భంగా బుధవారం పట్టణ మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ సలాం తన సొంతఖర్చులతో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పలువురు పేద ముస్లింలకు, ఎమ్మెల్యే రంజాన్ తోఫా అందించారు. రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కందుకూరు పట్టణంలో త్వరలో చేపట్టబోవు ఇళ్లస్థలాలు పంపిణీలో పేద ముస్లింలకు మొదటిప్రాధాన్యత ఉంటుందన్నారు. పట్టణంలో షాదీ ఖానా భవనాన్ని తప్పక నిర్మిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. సేవాగుణం గల సలాంకు ఎల్లప్పుడూ తన సహాయసహకారాలుంటాయన్నారు. అదేవిధంగా అల్లాహ్ ఆశీస్సులుండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో మతపెద్దలు రియాజ్ మోలానా, ఫైరోజ్ మోలానా, ముజీబ్ మోలానా, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, ఏపీఈడబ్ల్యూఐడి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరిరాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికారప్రతినిధి బెజవాడ ప్రసాద్, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నెల్లూరు పార్లమెంట్ కార్యదర్శి షేక్ రూబీ, పట్టణ ప్రధాన కార్యదర్శి సలాం, ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నాతోపాటు పలువురు పాల్గొన్నారు.

11లక్షల దివ్యాంగులకు ఉచిత బస్సుసౌకర్యం

దివ్యాంగులశక్తి పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కందుకూరు మార్చి 18, ప్రభాతవార్త

దివ్యాంగుల సౌకర్యం నిమిత్తం ప్రభుత్వం ఉగాది నుంచి ఉచిత బస్సు సౌకర్యం అమలు చేస్తున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. తద్వారా రాష్ట్రంలోని 11లక్షలమందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. బుధవారం కందుకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దివ్యాంగుల శక్తి ఉచిత బస్సు సౌకర్యం పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జెండా ఆవిష్కరణతో పథకాన్ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సీఎం చంద్రబాబు గత ఎన్నికల హామీలతో ప్రజల మనసు గెలుచుకుంటున్నారన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణమే సురక్షితమని, ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని ఎమ్మెల్యే కోరారు. నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులకు త్వరలో ఇళ్లపట్టాలు అందిస్తామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు, కంట్రోలర్ ఇన్స్పెక్టర్ ప్రసాదు, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామామల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌చిలకపాటి మధు, నాంచారమ్మకాలనీ డీలరు పసుపులేటి రమణయ్య, కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి బెజవాడ ప్రసాద్, ఎస్సీ నేతలు రెబ్బవరపు మాల్యాద్రి, చుండూరి శ్రీను, రాయపాటి శ్రీను, ఆర్టీసీ యూనియన్ నాయకులు మహేష్, శివ, సుబ్బారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత కామిరెడ్డి అరెస్టుకు ఖండన

కందుకూరు మార్చి 18, ప్రభాతవార్త

కందుకూరు నియోజకవర్గ పరిశీలకులు కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు కందుకూరు వైసీపీ ఇన్‌చార్జ్ మాజీ శాసనసభ్యులు బుర్రా మధుసూదన్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయనను అన్యాయంగా, అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. కూటమిపాలనలో ప్రశ్నించిన వారిని అక్రమ కేసులతో జైలుపాలు చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో జరుగుతున్న ఇసుక మట్టి దందాలను ప్రశ్నిస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తూ కేసులు పెట్టి జైలుకు పంపడం అప్రజాస్వామిక చర్య అని ఆయన అన్నారు. కూటమి నాయకుల అవినీతి, అక్రమాలను, ప్రశ్నిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల మీద అక్రమ కేసులు, తప్పుడు సెక్షన్‌లు ఎలా పెట్టాలో ఏ విధంగా ఫిర్యాదు చేయాలో పైనుండే డైరెక్షన్ ఇస్తున్నారని విమర్శించారు. టిడిపి నేతలు, కూటమి నాయకులు చేస్తున్న ఆకృత్యాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నా చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపీ మహేష్ యాదవ్ డ్రగ్స్ కేసులో పట్టుబడితే కేవలం షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్ అంటూ చేతులు దులుపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. సత్యనారాయణ రెడ్డి మీద జరిగిన దాడితోపాటు అక్రమ కేసులను బేషరత్తుగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నట్లు బుర్రా పేర్కొన్నారు.

అవినాష్ జన్మదిన వేడుకలు

కందుకూరు మార్చి 18, ప్రభాతవార్త

కందుకూరు అన్న క్యాంటీన్‌లో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కుమారుడు అవినాష్ జన్మదిన వేడుకలను ప్రీమియర్ లీగ్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీమ్ సభ్యులు, టిడిపి నేతలు కలిసి కేక్ కట్‌చేసి, అవినాష్‌కు ముందస్తు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉదయం పూట పేదలకు ఉచితంగా అల్పాహారం అందించారు. కార్యక్రమంలో కందుకూరు ప్రీమియర్ లీగ్ కమిటీసభ్యులు షేక్ జలీల్, కె.చిరంజీవి, షేక్ రియాజ్, షేక్ మస్తాన్ వలి, షేక్ నాయబ్ రసూల్, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మున్నా, నాయకులు కె.కళ్యాణ్, మాలి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కాకుటూరులో కరువు పనిలో అవకతవకలు

కందుకూరు మార్చి 18, ప్రభాతవార్త

వలేటివారిపాలెం మండలం కాకుటూరు పంచాయతీలో చెర్లోపాలెం, కొండాపురం, కంచరకుంట, బొంతవారిపాలెం గ్రామాలలో ఏడాది కాలంగా ఉపాధిహామీపథకం పనులు నిర్వహణ లోప భూయిష్టంగా ఉంది. సమయపాలన పాటించక పోవడం, సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, చేసిన పనికి కొలతలుతీయడలో అవకతవకలు కరవుపనిలో దొంగమష్టర్‌లు వేయడం తదితర లోపాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కొన్ని కొంతమందికి కొన్ని రోజులుకు మష్టర్‌లు వేయలేదు. మరికొంతమందికి జాబ్ కార్డులు ఇవ్వడంలేదు. నిర్దిష్టమైన రోజులు పూర్తిచేయలేదు. ఫీల్డ్ అసిస్టెంటు అవగాహనాలోపం, స్వార్ధం అక్రమాలుతో సదరు సిబ్బంది ప్రలోభాలకు లోనవడంతో సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. పలు విషయాలపై ఇటీవల ఏపీవో దయాసాగర్ క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పటికిని కూలీలుకు న్యాయం జరగలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కందుకూరులో నల్లబజారులో వంటగ్యాస్

కందుకూరు మార్చి 18, ప్రభాతవార్త

కందుకూరు పట్టణంలో పలువురు గ్యాస్ ఏజెన్సీ నిర్వహకులు వంటగ్యాస్ సిలెండర్లును అక్రమంగా విక్రయిస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని క్లబ్‌రోడ్డులో ఓ వాహనం అక్రమంగా విక్రయిస్తుందని పలువురు వార్త ప్రతినిధితో వివరించారు. ఈ సమాచారం తెలియడంతో డీటీ విజయబాస్కర్ అప్రమత్తమైనారు. తన సిబ్బందిని సంఘటనాస్థలంకు పంపారు. అప్పటికే అక్కడ అదేపనిలో ఉన్న వాహనం వెళ్లిపోవడంతో ఆయన వెనుతిరిగారు. దీంతో పూర్తి విచారణ చేపడతానని నిజానిజాలు విచారించి తగిన చర్యలు తీసుకుంటానని డీటీ వివరించారు.

లాభసాటి వ్యవసాయంపై దృష్టి సారించాలి

దర్శి, మార్చి 18, ప్రభాతవార్త

ప్రభుత్వం ఆదేశాల మేరకు దర్శి మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో రైతన్న మీ కోసం కార్యక్రమం వ్యవసాయశాఖ, అనుబంధ శాఖలకు సంబంధించిన గ్రామస్థాయి అధికారులచే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా లాభసాటి సాగు ఉండడానికి అవలంబించాల్సిన నూతన సాగు పద్దతులు గురించి రైతులకు అవగాహన కల్పించుట జరిగింది. తూర్పు వీరాయపాలెం గ్రామంలో జరిగిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ జడ్పీ సీఈఓ చిరంజీవిరెడ్డి, ఎంపీడీవో, దర్శి మండల వ్యవసాయ అధికారి దర్శి వీఏఏ త్యాగరాజు, ఎంపీఈఓ అబ్దుల్ రజాక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బ్రిడ్జి కోర్సులను పరిశీలించిన రాష్ట్ర అడిషనల్ డైరక్టర్ సుబ్బారెడ్డి

సంతనూతలపాడు, మార్చి 18, ప్రభాతవార్త

సంతనూతలపాడు హైస్కూల్లో బ్రిడ్జి కోర్సు అమలును రాష్ట్ర అడిషనల్ డైరక్టర్, 100 డేస్ ప్లాన్ జిల్లా నోడల్ ఆఫీసర్, టెన్త్ క్లాస్ ఎగ్జామ్స్ డిస్ట్రిక్ అబ్జర్వర్ ఏ.సుబ్బారెడ్డి బుధవారం పరిశీలించారు. స్థానిక హైస్కూల్లో తొమ్మిది నుండి పదవ తరగతి వచ్చిన విద్యార్థుల కోసం ప్రభుత్వం కొత్తగా బ్రిడ్జి కోర్సులను ప్రారంభించారు. వాటి పనితీరును పరిశీలించేందుకు స్థానిక హైస్కూల్‌కు రాష్ట్ర అడిషనల్ డైరక్టర్ సుబ్బారెడ్డి ఈ సందర్భంగా విచ్చేశారు. బ్రిడ్జి కోర్సులు జరుగు విధానంపై విద్యార్థులను ఆయన అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మొదటి నుండి చదివితే మెరుగైన ఫలితాలు వస్తాయని సుబ్బారెడ్డి సందర్భంగా పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ప్రతి ఒక్కరూ పాఠశాలకు హాజరు కావాలని రాష్ట్ర అడిషనల్ డైరక్టర్ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాలను మరింతగా పెంచుకోవాలన్నారు. బ్రిడ్జి కోర్సు అమలుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం పీవీ పద్మ, పీడీ బి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో 26వేల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పన

- ఎంజీఎన్ఆర్ఈజీఎస్ జిల్లా పీడీ జోసఫ్ కుమార్ వెల్లడి

సంతనూతలపాడు, మార్చి 18, ప్రభాతవార్త

జిల్లాలో నేడు రోజుకి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద వివిధ పనులు నిర్వహణలో భాగంగా 26వేల మంది కూలీలకు ఉపాధి కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు డైరక్టర్ జి.జోసెఫ్ కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం సాయంత్రం జరిగిన మండల స్థాయి ఎన్ఆర్ఈజీఎస్ ప్రజా వేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు ఎంపీడీవో డి.సురేష్‌బాబు అధ్యక్షత వహించారు. ఇందుకు గాను జిల్లాకు సంబంధించి 45 వేల మంది ఉపాధి కూలీల టార్గెట్ సాధనకు చర్యలు చేపడుతున్నట్లు పీడీ జోసెఫ్ కుమార్ వెల్లడించారు. ప్రభుత్వం కొత్తగా ఈకేవైసీ ద్వారా ఐరీస్ చేయడం వల్ల దొంగ మాస్టర్ నివారింపబడినట్టు ఆయన పేర్కొన్నారు. పనికి వచ్చిన వారు మాస్టర్ మాత్రమే కలదు అన్నారు. సంతనూతలపాడుమండలంలో రోజుకు 1000 మంది కూలీల టార్గెట్ గాను517 మంది కూలీలు పనులకు ఇస్తున్నట్లు ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో టార్గెట్ సాధనకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. సంతనూతలపాడు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 7 కోట్ల 7 లక్షల 56 వేల రూపాయల వ్యయంతో పనువలను నిర్వహించినట్లు జిల్లా పీడీ జోసఫ్ కుమార్ తెలిపారు. ఆర్పి బృందం నివేదిక ప్రకారం మండలంలోని గ్రామాల వారీగా ఉపాధి పనులు జరిగిన వాటికి సంబంధించి సమీక్ష నిర్వహించారు. మండలంలో చిన్న చిన్న స్వల్ప సంఘటనలు మినహా ఎటువంటి ఇబ్బందులు జరగలేదన్నారు. ఈ సోషల్ ఆడిట్లో 62 వేల 961 రూపాయలు రికవరీ నిమిత్తం, అదే విధంగా 44 వేల రూపాయలను పెనాల్టీ లను విధించారు. ఈ సమావేశంలో సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, డీవీఓఏ అశ్విని కుమార్, మండల డ్వామా ఏపీవో వాసంతి, ఈసీ ఈశ్వఇ, ఎస్ఆర్‌పీ ఎం.బుజ్జి, రిసోర్సు పర్సన్స్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఉగాది పురస్కారాన్ని అందుకున్న ఉప్పుగుండూరు వాసులు

నాగులుప్పలపాడు, మార్చి 18, ప్రభాతవార్త

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కారాన్ని శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఒంగోలు వారిచే ఉప్పుగుండూరుకు చెందిన కొంజేటి వెంకట సురేష్‌బాబుకు అలాగే కనమర్లపూడి సావిత్రికి ఉగాది పురస్కారాన్ని అందజేశారు. ఒంగోలులోని ఎన్టీఆర్ కళా క్షేత్రంలో జరిగిన శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పురస్కార మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు పుష్ప చిత్ర ప్రతినాయకులు అయిన శ్రీ అజయ్ ఘోష్, కుర్ర ప్రసాద్‌బాబు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి చేతుల మీదుగా ఉగాది పురస్కారాన్ని అందుకోవడం జరిగింది. శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఒంగోలు వారు అజయ్‌ఘోష్‌తో పాటు ప్రముఖులైన మరో తొమ్మిది మందికి ఈ పురస్కారాలను అందజేశారు. అందులో ఉప్పుగుండూరుకు చెందిన కనమర్లపూడి సావిత్రికి విశిష్ట విద్యారంగా ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. అదే విధంగా సామాజిక రంగంలో విశేష సేవలు అందించిన కొంజేటి వెంకట సురేష్‌బాబుకి విశిష్ట సామాజిక రంగ ప్రతిభా పురస్కారాన్ని అందజేయడం జరిగింది. సామాజిక రంగంలో విద్యా సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన కొంజేటి సురేష్‌బాబుని ఈ పురస్కారానికి ఎన్నిక చేయటం చాలా ఆనందంగా ఉందని శ్రీ కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్ర ప్రసాద్ బాబు అన్నారు. అలాగే విద్యా రంగంలో తనదైన ప్రతిభతో రాణిస్తూ కవిత స్ఫూర్తిని అందుకుంటూ అనేక వ్యాసాలు ప్రచురించిన కనమర్లపూడి సావిత్రికి ఈ పురష్కారాన్ని ఇవ్వడం చాలా సంతోషదాయకమని కుర్ర ప్రసాద్ బాబు అన్నారు. ప్రతి సంవత్సరం ఎందరో ప్రముఖులను ఈ పురష్కారానికి ఎన్నిక చేయటం జరుగుతుందని అందులో ఉప్పుగుండూరుకు చెందిన ఇద్దరిని ఈ పురస్కారాన్ని వరించడం సంతోషదాయకమని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాదంశెట్టి శ్రీనివాసులు తెలిపారు. సామాజిక కొణంతో కొంజేటి వెంకట సురేష్‌బాబుని అలాగే విద్యా రంగంలో కనుమర్లపూడి సావిత్రిని ఎన్నిక చేయడం సంతోషదాయకమని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ అమర వేణు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులకనం రాజా, ఉప్పుగుండూరు క్లబ్ అధ్యక్షులు అమరవాది వెంకట కిషోర్‌బాబు, కనమర్ల పూడి హరిప్రసాద్, సంగీత అభిమాని ప్రత్యూష, సూర్య ప్రకాష్ తదితరులు అభినందనలు తెలిపారు. ప్రముఖ సినీ నటులు వీరిద్దరిని ఉద్దేశించి ఏ రంగమైన చొరవ, నిజాయితీ మంచి సంకల్పం ఉంటే ఆ రంగంలో రాణించవచ్చని అందుకు వారి వారికి ఇష్టమైన రంగాలలో రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంకి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, నరసం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళా మిత్ర మండలి జాతీయ అధ్యక్షులు నూనె అంకమ్మరావు, ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా మధు, అలహరి చెంచల్‌రావు, తదితరులు పాల్గొని వీరిద్దరిని ప్రశంసించారు.

డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫోగ్రామ్



నాగులుప్పలపాడు, మార్చి 18, ప్రభాతవార్త

గౌతమి ఫౌండేషన్ వారి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు అందించిన డిపాజిటర్ విద్యా అవగాహన కార్యక్రమం నాగులుప్పలపాడు మహిళ సమాజ కేంద్రంలో 60 మంది వీఓలకు డిపాజిటర్ విద్య అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంనకు అతిథులు యూనియన్ బ్యాంకు మేనేజర్ ఏ.ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతా తెరిచే వ్యవస్థ గురించి, బ్యాంకులు అందించే రుణాలు గురించి, బ్యాంకులు ద్వారా పొందే భీమా సౌకర్యాలు గురించి, డిపాజిటర్ యొక్క నామిని విధానం గురించి తెలియజేశారు. డిపాజిటర్ మరణించిన తరువాత వారి బ్యాంక్ ఖాతాలో ఉన్న డబ్బు పొందే విధానం గురించి తెలియజేశారు. ఏపీఎం నరేంద్ర కుమార్, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు గురించి తెలియజేశారు. బ్యాంకులు ద్వారా ఏమి లోన్ ఉన్నాయి, అవి ఎలా పొందాలో తెలియజేశారు. యూనియన్ బ్యాంకు సత్యప్రియ, బ్యాంకులు ద్వారా పొందే ఇన్స్యూరెన్స్ తెలియజేశారు. గౌతమి ఫౌండేషన్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకు సేవలు గురించి, బ్యాంకు రుణాలు సబ్సిడీ రుణాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్సు పర్సన్స్ సీహెచ్ సాయి, ప్రవీణ బి, గౌతమి ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ ఎంట్రన్స్‌లో జిల్లా స్థాయిలో 28వ ర్యాంకు సాధించిన కత్తి మోహిత్ కుమార్

ముండ్లమూరు, మార్చి 18, ప్రభాతవార్త

మండల పరిధిలోని రాజగోపాల్‌రెడ్డి నగర్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న కత్తి మోహిత్ కుమార్ తండ్రి లక్ష్మీ నరసయ్య అను విద్యార్థి ఇటీవల జరిగిన నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్షల్లో 100 మార్కులకు 92.50 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో 28వ ర్యాంకు సాధించినట్లు ఎంఈఓలు షేక్ కాలేషా వలి, నూనె వెంకట సుబ్బయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఇద్దరు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు గుంపుల తాన్య ఆ పాఠశాలను సందర్శించి ఆ విద్యార్థినీ అతని తండ్రి సమక్షంలో బహుమతులతో సత్కరించి, ఆ విద్యార్థి ర్యాంకుకు కారణమైన వారి టీచర్ చాగంటి వెంకటరమణను అభినందించారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన దారపనేని

కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త

కనిగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దారపనేని మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సరం తెలుగు క్యాలెండర్‌లోని 60 సంవత్సరాల చక్రంలో 40వ సంవత్సరం. పరాభవం అంటే సాధారణంగా ఓటమి లేదా అవమానం అని అర్థం వచ్చినప్పటికీ ఆధ్యాత్మికంగా అహంకారాన్ని జయించడం లోపాలను సరిదిద్దుకోవడం మరియు ఆత్మ పరిశీలన ద్వారా ఉన్నత స్థితికి సూచిస్తుందని, మనలోని అహంకారం, స్వార్థం వంటి వాటి వదిలి మంచి మార్గంలో నడవాలని ప్రకృతి ఇచ్చే ఒక అవకాశం అని, సవాళ్లను ఎదుర్కొని లోపాలను గుర్తించి అధిగమించే కాలం అని, సమయంలో అహంకారాన్ని వదిలి ఆత్మోన్నతికి ప్రయత్నించాలని, ఈ సంవత్సరానికి రాజుగా గురువు, సైన్యాధిపతిగా కేతువు ఉంటారని, పరాభవ అంటే భయపడాల్సిన అవసరం లేదని ఇది మనల్ని మనం సరిదిద్దుకొనే కాలమని పండితులు స్పష్టం చేస్తున్నారని దారపనేని పేర్కొన్నారు.

పాఠశాలలో పౌష్టికాహారంపై ఆకస్మిక తనిఖీ

- ఎమ్మెల్యే సూచనల మేరకు లింగారెడ్డిపల్లిలో పరిశీలన

కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలు, కనిగిరి నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సూచనల మేరకు బుధవారం కనిగిరి మండలం లింగారెడ్డి పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను లింగారెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ కమతం వెంకటేశ్వరరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించి, రోజు వారీ మెనూ ప్రకారం విద్యార్థులకు తప్పనిసరిగా పోషకాహారం అందించాలని సిబ్బంది, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్యం దృష్ట్యా ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న భోజనం, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పాఠశాలలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జయరాంరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు నాగేంద్ర, నీటి సంఘం అధ్యక్షులు అమ్మిరెడ్డి వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జి కమతం రంగారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బలం... 'దివ్యాంగశక్తి' పథకం

- జెండా ఊపి బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్ర

కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త

దివ్యాంగుల సంక్షేమం, ప్రయాణ సౌకర్యాల మెరుగుదలకు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగ శక్తి పథకాన్ని కనిగిరిలో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఆర్టీసీ డిపో నుండి అమరావతి గ్రౌండ్స్ వరకు దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో ప్రయాణించి పథకానికి శ్రీకారం చుట్టారు. అమరావతి గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దివ్యాంగశక్తి పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని అమలు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర నాయకులు మాధవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. అనంతరం దివ్యాంగశక్తి పథకం కింద నడిచే ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించగా, కనిగిరి టౌన్ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు పెరబోయిన పుల్లారావుతో బస్సుకు రిబ్బన్ కట్ చేయించారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ పాసులను అందజేశారు. ఈ పథకం ద్వారా ఏపీఎస్ఆర్టీసీ సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. 21 కేటగిరిలో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులకు ఈ పథకం వర్తించనుంది. సహాయకులతో కలిపి సుమారు 12.76 లక్షల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనుండగా, ఈ పథకం అమలుకు ప్రభుత్వం ఏటా సుమారు రూ.207 కోట్లు వ్యయం చేయనుంది. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శివరామిరెడ్డి, ఎమ్మార్వో జయలక్ష్మీ, డీఎం సయానా బేగం, ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి శ్రీనివాసులు, ఎంపీపీ దంపతులు ప్రకాశం, ఎంపీడీవో అబ్దుల్ ఖాదర్, కమీషనర్ పర్వతనేని శ్రీధర్, టీడీపీ నాయకులు షేక్ ఫిరోజ్, కనిగిరి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహానికి ఆహ్వానం.. వైసీపీ నేతలను కలిసిన బ్రహ్మారెడ్డి

కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త

వైసీపీ కనిగిరి మండల నాయకులు, యేరువారిపల్లి మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తె మౌనిక వివాహం ఈనెల 20న కనిగిరిలో జరగనున్న సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులను మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు ఒంగోలులో ఉమ్మడి ప్రకాశం జిల్లా పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమణారెడ్డిని కలిసి దుశ్శాలువా కప్పి వివాహ ఆహ్వాన పత్రిక అందజేవారు. కుటుంబ సమేతంగా వివాహానికి హాజరై ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి మనోజ్, వీరంరెడ్డి చైతు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, పార్టీ శ్రేణులకు దద్దాల ఉగాది శుభాకాంక్షలు

కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా అందరికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త ఆరంభాలు, కొత్త విజయాలకు నాంది పలికే పవిత్రమైన పండుగ అని అన్నారు. తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలియజేసే ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని కోరారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సిరిసంపదలు, ఆయురారోగ్యాలు, శాంతి సంతోషాలు నెలకొనాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కోరుకున్న ప్రతి లక్ష్యం నెరవేరాలని, ప్రతి ఇంట ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి పండుగను సంతోషంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

కనిగిరి, మార్చి 18, ప్రభాతవార్త

కనిగిరి నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే, విశాఖపట్నం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు కదిరి బాబురావు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త ఆరంభాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ పండుగను ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సిరి సంపదలు, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. ప్రజలందరి జీవితాల్లో శాంతి, అభివృద్ధి, విజయాలు చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కనిగిరి ప్రజలందరికి అందుబాటులో ఉండి నియోజకవర్గం అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

నూతన నోటరి న్యాయవాదిగా మొగల్ అన్వర్ బేగ్ నియామకం

మార్కాపురం టౌన్, మార్చి 18, ప్రభాతవార్త

మార్కాపురం పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది మొగల్ అన్వర్ బేగ్‌ను నోటరీగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రెవిన్యూ (రిజిస్ట్రేషన్–II) శాఖ జీవో జారీ చేసినట్లు అన్వర్ బేగ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం ప్రాంత ప్రజలకు ఇకపై నోటరీ సేవలు అందించేందుకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు. అఫిడవిట్లు, అగ్రిమెంట్లు, డాక్యుమెంట్ అటెస్టేషన్ వంటి సేవలకు అధికారికంగా ధ్రువీకరించనున్నట్లు తెలిపారు. కావున నోటరీ అవసరమైన ప్రజలు కోర్టు సెంటర్ వద్ద మొగల్ గెస్ట్ హౌస్ పక్కన గల తన కార్యాలయంలో సంప్రదించాలని అన్వర్ బేగ్ కోరారు.

పేద యువకుడికి ప్రాణదాతగా ముఖ్యమంత్రి సహాయనిధి

- లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు రూ.8 లక్షలు మంజూరు

మార్టూరు, మార్చి 18, ప్రభాతవార్త

ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేద యువకుడికి ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్) అండగా నిలిచింది. ఆ యువకుడికి కొత్త జీవితం అందించే దిశగా కీలక సహాయం అందించింది. లివర్ వ్యాధితో బాధపడుతున్న 18 ఏళ్ల ఉమర్‌కు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స కోసం రూ.8లక్షల ఆర్థిక సహాయం మంజూరు కావడంతో కుటుంబంలో ఆశలు చిగురించాయి. మార్టూరు పట్టణానికి చెందిన షేక్ పోలీస్ బాజీ టైలరింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన కుమారుడు ఉమర్ కొద్ది రోజులుగా తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రి పాలయ్యాడు. వైద్యులు అత్యవసరంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని సూచించగా, లక్షల రూపాయల వ్యయంతో భరించే స్థోమత లేక కుటుంబం తీవ్ర ఆందోళన పడింది. ఈ పరిస్థితిని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, వైద్యులతో నేరుగా మాట్లాడి ఉమర్‌కు తక్షణ చికిత్స అందేలా చర్యలు ప్రారంభించారు. అదే సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం పొందేలా తన క్యాంపు కార్యాలయ ప్రతినిధులుకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం అత్యంత వేగంగా స్పందించి, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స కోసం రూ.8లక్షల సీఎంఆర్ఎఫ్ నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు విడుదలైన చెక్కును స్థానిక నాయకులు లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. రోజువారీ ఆదాయంపై ఆధారపడే ఈ పేద కుటుంబానికి ఈ సహాయం ప్రాణదాతగా మారింది. అవసర సమయంలో స్పందించి, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సేవాభావాన్ని ప్రజలు అభినందిస్తున్నారు. తమ కుమారుడి ప్రాణాలను కాపాడేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యేకు ఉమర్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

ఉగాది పురస్కారం గ్రహీత జేవీ మోహన్‌రావుకు ఎమ్మెల్యే ఏలూరి అభినందనలు

మార్టూరు, మార్చి 18, ప్రభాతవార్త

శ్రీ పరాభవ నామ సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా, సామాజి సేవ స్థిర వ్యవసాయ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ఎఫర్ట్ సంస్థ వ్యవస్థాపకుడు జేవీ మోహన్‌రావు ఉగాది పురస్కారానికి ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా ఎఫర్ట్ సంస్థ ద్వారా మోహన్‌రావు గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ సుస్థిరత, సహజ వనరుల పరిరక్షణ, బాలల అభివృద్ధి, ఆరోగ్య రంగాలలో అపారమైన సేవలు అందించాలని కొనియాడారు. లక్షలాది రైతులకు శిక్షణ ఇచ్చి, ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచే విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా రైతు జీవనోపాధిని బలోపేతం చేశారని తెలిపారు. అలాగే, వేలాది ఎకరాల్లో పంటల వైవిధ్యీకరణ, నీటి సంరక్షణ చర్యలు, సహజ వనరుల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో స్థిరమైన అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, గ్రామీణ ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు, మహిళా సంఘాల ప్రోత్సాహం వంటి అనేక సామాజిక కార్యక్రమాల్లో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు. ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో వేలాదిమహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, రైతు ఉత్పత్తి దారుల సంస్థను ఏర్పాటు చేయడం, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా జేవీ మోహన్‌రావుకి ఉగాది పురస్కారం లభించడం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో కూడా మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.

రయ్.. అంటూ మహిళలతో పాటు వికలాంగులకు కూడా ఉచిత ప్రయాణం

యర్రగొండపాలెం, మార్చి 18, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దివ్యాంగుల సంక్షేమం కోసం ఇంకొక మంచి నిర్ణయం తీసుకున్నారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ బాధ్యులు ఎరిక్షన్‌బాబు అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో దివ్యాంగ శక్తి పథకాన్ని అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ పథకం మార్చి 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతుందని ఒకరకంగా ఉగాది పండుగ కానుకగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించిన ముఖ్యమంత్రి, ఇక వికలాంగులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించారని అన్నారు. ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ధనలక్ష్మి మాట్లాడుతూ పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులలో దివ్యాంగులు ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చని, వారికి జీరో టికెట్ జారీ చేస్తామన్నారు. వికలాంగులతో పాటు వారికి సహాయంగా వచ్చే వారికి టికెట్ ధరలో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకరరావు, తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో బండారు శ్రీనివాసరావు, ఏడీఏ సంజీవరావు, యూనియన్ నాయకులు అధికార పార్టీ నాయకులతో పాటు వికలాంగులు పాల్గొన్నారు.

రైతన్న మీ కోసంలో రైతులతో ముఖాముఖి

యర్రగొండపాలెం, మార్చి 18, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమం యర్రగొండపాలెం పట్టణంలోని బస్టాండ్ సెంటర్ నందుగల సచివాలయం పరిధిలోని పంచాయతీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో జరిగింది. యర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎరిక్షన్‌బాబు వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పాల్గొన్నారు. అన్నదాతలకు ముఖ్యమంత్రి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ రైతులకు, 5 సూత్రాల ద్వారా ఆధునిక సాగు పద్ధతులలో వ్యవసాయం కొనసాగిస్తే రైతుకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ఏవో నీరజ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పంట నష్టపరిహారం, వ్యవసాయ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బందితో పాటు, రైతులు, అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సేవే శ్వాసగా... మాస్టర్ ఫౌండేషన్ ముందడుగు

పేదలకు నిత్యవసర వస్తువులు..దుస్తులు పంపిణీ చేసిన వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్

మార్కాపురం టౌన్, మార్చి 18, ప్రభాతవార్త

సేవే శ్వాసగా మాస్టర్ ఫౌండేషన్ ముందడుగు వేస్తోందని ఆ సంస్థ ప్రతినిధి, వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ స్పష్టం చేశారు. మాస్టర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ఫౌండేషన్ ప్రతినిధి, వైసిపి మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది రంజాన్ పర్వదినం సందర్భంగా నిరుపేదలకు కుల మతాలకతీతంగా నిత్యావసర వస్తువులు, దుస్తుల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది కూడా అదే రీతిలో నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు. గతంలో మార్కాపురం పట్టణంలో కొంతమంది పేద మహిళలకు గుర్తించి వారికి కుట్టు మిషన్‌లో శిక్షణ ఇప్పించి వారు ఆర్థికంగా నిలబడేందుకు కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేసి వారి జీవనోపాధికి ఆసరాగా నిలిచినట్లు తెలిపారు. ఈ సేవా కార్యక్రమాలను తమ మాస్టర్ ఫౌండేషన్ ద్వారా నిరంతరం కొనసాగిస్తుంటామన్నారు. రంజాన్ మాసం సందర్భంగా వైసీపీ మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రార్థించినట్లు తెలిపారు. కూటమి పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, వైయస్ జగన్ మరోసారి సీఎం అయితేనే రాష్ట్రంలోని పేదల భవిష్యత్తు బాగుపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మళ్లీ రావాలి జగన్ కావాలి వైసిపి పాలన అని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన వెల్లడించారు. ప్రతి వైసీపీ కార్యకర్త మరింత కష్టపడి వైసిపి అధికారంలోకి వచ్చేలా వైయస్ జగన్ మరోమారు సీఎం అయ్యేలా ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు.

శ్రీప్రసన్నాంజనేయస్వామికి అరటికాయల పూజ

అద్దంకి , మార్చి 18, ప్రభాతవార్త

సింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానం బుధవారం అమావాస్య సందర్భంగా స్వామి అరటికాయలు పూజా కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. అద్దంకి వాస్తవ్యులు శ్రీనగర్ నివాస వాస్తవ్యులు గరిమెడి శ్రీనివాసరావు ధర్మపత్ని వెంకటరమణ, కుటుంబ సభ్యులందరూ వారి చేతుల మీదుగా ఈ పూజ కార్యక్రమం జరిగింది. ఉదయం గోపూజ, స్వామివారి అభిషేకం ,తదుపరి దేవస్థానం ప్రాంగణం చుట్టూ ప్రదక్షణ చేస్తూ వినాయక స్వామికి పూజా కార్యక్రమం తదుపరి ధ్వజ స్తంభానికి పూజా కార్యక్రమం తదుపరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పూజా కార్యక్రమం జరిగింది. 11 ఆవృతాలుగా ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచ హారతులు స్వామివారి నివేదిక జరిగింది. అనంతరం దాతలకు శేష వస్త్రము, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదములు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు అర్చకులు సిబ్బంది అందరూ స్వామివారిని దర్శించుకున్నారు . భక్తులందరికీ స్వామి వారి అలంకారం తర్వాత ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదములు తీసుకున్నారు. ఈ పూజా కార్యక్రమం దేవస్థానం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు, పాలక మండల అధ్యక్షుడు చుండూరు మురళీ సుధాకర్ రావు సభ్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమం నిర్వహించారు.

నేడు ఉగాది పంచాగ శ్రవణం, అక్షరాభ్యాస కార్యక్రమం :

సింగరకొండలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో గురువారం ఉదయం 9 గంటలకు దేవాదాయ, ధర్మాదాయశాఖ వారు ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు పంచాగ శ్రవణ కార్యక్రమం సిద్ధాంతి గుంటూరు శేష సుబ్బయ్య శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించినున్నట్లు వెల్లడించారు.

నేడు లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఉగాది పూజలు :

కొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ఉగాది పర్వదిన సందర్భంగా గురువారం ఉదయం గంటలకు పంచాంగ శ్రవణ కార్యక్రమం వుంటుందని ఆలయ అధికారి తెలియజేశారు.

రోటరీ ఆధ్వర్యంలో ముస్లింలకు పండ్లు, పలహారాలు పంపిణీ

అద్దంకి , మార్చి 18, ప్రభాతవార్త

రోటరీ ఆధ్వర్యంలో అద్దంకిలో మంగళవారం 6 గంటలకు పాత శివాలయం పక్కన గల పెద్ద మసీదు నందు రంజాన్ ఉపవాసాల సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుగా పండ్లు, పలహారములు రోటరీ తరఫున అందజేశారు. కన్నెబోయిన వెంకటేశ్వర్లు సౌజన్యంతో అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు పసుపులేటి ఆంజనేయులు, గూడామహాలక్ష్మి రెడ్డి, అన్నంగి సుబ్బారావు, డాక్టర్ ఖాజావలి, షేక్ అంజాద్ భాష, కన్నెబోయిన వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత అయిన కన్నెబోయిన వెంకటేశ్వర్లు ను సన్మానించారు.

అద్దంకిలో ఘనంగా దివ్యాంగ శక్తి ప్రారంభం

ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం

అద్దంకి, మార్చి 18, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దివ్యాంగ శక్తి పథకం అద్దంకిలో బుధవారం అట్టహాసంగా ప్రారంభారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ లో కూటమి నేతలు జెండా ఊపి దివ్యాంగుల ఉచితప్రయాణ సదుపాయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, సమాజంలో దివ్యాంగులకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఫిబ్రవరి 24న మంత్రివర్గ ఆమోదం పొంది, ఫిబ్రవరి 28నే ఉత్తర్వులు జారీ చేయడం ప్రభుత్వ సంకల్ప బలానికి నిదర్శనమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి డిఎం మోహనరావు, స్వచ్ఛభారత్ డైరెక్టర్ చిన్ని లక్ష్మి శ్రీనివాసరావు, వ్యవసాయ మిషన్ డైరెక్టర్ నాగినేని రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు మానం దాసు, పట్టణ పార్టీ అధ్యక్షులు అరిగిల నాగరాజు, గార్లపాటి శ్రీనివాసరావు, పలువురు దివ్యాంగులు, టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

వర్షాభావ పరిస్థితులను రైతులు తట్టుకోవాలి - ఎఒ సూచన

అద్దంకి , మార్చి 18, ప్రభాతవార్త

వర్షాభావ పరిస్థితులు లను తట్టుకోవడానికి రైతులు సిద్ధంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. రైతన్నా మీకోసం కార్యక్రమం లో భాగం గా వ్యవసాయాధికారి కోటికలపూడి, కుంకుపాడు గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు ఆధారం గా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. భూములు ఖాళీగా ఉండకుండా వర్షాలు పడ్డప్పుడు పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలని సూచించారు. ప్రతి రైతు ఫార్మర్ యాప్ డౌన్లోడ్ చేసుకొని దాని ద్వారా వ్యవసాయ సూచనలు, వాతావరణ సూచనలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో కోటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రమ్, సందిరెడ్డి శ్రీనివాసరావు, నర్రా వీరయ్య , గాలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ఆరోగ్య రథం లోగో అవిష్కరణ

అద్దంకి నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్యమే లక్ష్యం

మాజీ సిఎంచే లోగో అవిష్కరింపచేసిన చింతలపూడి

అద్దంకి, మార్చి 18, ప్రభాతవార్త

అద్దంకి నియోజకవర్గంలోని గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలనే బృహత్తర లక్ష్యంతో అద్దంకి ఆరోగ్య రథం లోగోను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా లోగోను బుధవారం అవిష్కరింపచేశారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా వైద్యసేవలు, ప్రాథమిక పరీక్షలు, చికిత్సలు, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పేర్కొన్నారు. అద్దంకి ఆరోగ్యంగా వుంటే అభివృద్ధి చెందుతుందని ఆయన ఆకాంక్షించారు. లోగో అవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ దంపతులు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ అశోక్ కుమార్

అద్దంకి, మార్చి 18, ప్రభాతవార్త

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని అద్దంకి నియోజకవర్గ ప్రజలకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ అశోక్ కుమార్ చింతలపూడి హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆకాంక్షించారు. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిలాగే,ప్రజలందరి జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని ప్రతిఇల్లు పాడిపంటలతో, సిరిసంపదలతో తులతూగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు.

74 మంది ఎమ్మెల్యేలకు షాక్

- టిక్కెట్లు నిరాకరించిన తృణమూల్ కాంగ్రెస్
- సువేందుతో మమత ఢీ!

కోల్‌కతా, మార్చి 18: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ 74 మంది ఎమ్మెల్యేలకు షాకిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో వారికి టికెట్లు నిరాకరించారు. 291 మందితో ప్రకటించిన జంబో జాబితాలో వారికిచోటు లభించలేదు. భవానీపుర్‌లో అసెంబ్లీ ప్రతిపక్షనేత సువేందు అధికారితో మమతా బెనర్జీ తలపడనున్నారు. కాళీఘాట్‌లోని తన నివాసంలో ఆమె అభ్యర్థుల జాబితాను

విడుదల చేశారు. ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి, పాత కొత్తల కలయికకు, సంస్థాపరమైన సమతుల్యతకు, బిజెపి దూకుడుకు అడ్డుకట్ట వేయడానికి మమత ప్రాధాన్యమిచ్చారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. మొత్తం 294 స్థానాల్లో 291 చోట్ల తాము పోటీచేస్తున్నామని, మిగిలిన 3 సీట్లను డార్జిలింగ్ హిల్స్ లోని భారతీయ గూర్ఖా ప్రజాతాంత్రిక్ మోర్చాకు కేటాయించామని తెలిపారు. పార్టీ కున్న 224 మంది ఎమ్మెల్యేల్లో 135 మందికి మళ్లీ టికెట్లు దక్కాయి. 15 మంది సీట్లు మారాయి. 2021 ఎన్నికల్లో నందిగ్రామ్‌లో తనను ఓడించిన సువేందు అధి కారిపైనే మమత మళ్లీ పోటీకి దిగారు. అయితే ఈసారి వారిద్దరూ భవానీపుర్‌లో తల పడనున్నారు. నందిగ్రామ్‌లో పవిత్రకర్‌కు టికెట్టు ఇచ్చారు. అక్కడ సువేందు అధికారే పోటీ చేస్తున్నారు. టికెట్లు దక్కిన వారిలో యువ నేతలు, వృత్తి నిపుణులు, ప్రము ఖులు ఉన్నారు. ఈసారి సెలబ్రిటీలకంటే బలమైన అభ్యర్థులకే పార్టీ ప్రాధాన్య మిచ్చింది. రాజ్‌గంజ్ నుంచి ఒలింపియన్, ఆసియా క్రీడల బంగారు పతక విజేత స్వప్న బర్మన్, తుఫాన్‌గంజ్ నుంచి మాజీ క్రికెటర్ శివ్‌శంకర్ పాల్ బరిలో నిలిచారు. 291 మంది అభ్యర్థుల్లో 239 మంది పురుషులు, 52 మంది మహిళలు ఉన్నారు. 149 మంది జనరల్, ఒబిసి వర్గాలకు చెందినవారు. 78 మంది ఎస్సీలు, 17 మంది ఎస్టీలున్నారు. 11 అన్‌రిజర్వుడ్ సీట్లలో ఎస్సీలను మమత బరిలో దించారు.

వలసదారుల కోసం ట్రంప్ సర్కార్ బంపర్ ఆఫర్!

గౌరవంగా వెళ్లిపోండి.. లేదంటే అరెస్టుచేసి మేమే పంపిస్తాం..

వాషింగ్టన్, మార్చి 18: అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులను దేశం నుంచి పంపించేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం సరికొత్త వ్యూహాన్ని ప్రకటించింది. బలవంతంగా కాకుండా, వారంతట వారే స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లేవారికి భారీ ప్రోత్సాహకాన్ని అందిస్తోంది. ఇలా వెళ్లేవారికి 2,600 డాలర్లు (సుమారు రూ. 2.40 లక్షలు) ఎగ్జిట్ బోనస్‌గా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. ఈ నగదు ప్రోత్సాహకంతో పాటు, వారి స్వదేశాలకు వెళ్లేందుకు అయ్యే విమాన ప్రయాణ ఖర్చులను కూడా ప్రభుత్వమే భరించనుంది. ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే వారు సీబీపీ హోమ్ అనే ప్రత్యేక యాప్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా నమోదు చేసుకున్న వారిని బలవంతపు బహిష్కరణ జాబితా నుంచి తొలగిస్తారు. ఈ కొత్త విధానం వల్ల ప్రభుత్వానికి ఆర్థికంగా భారీ ఆదా అవుతుందని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. ఒక వలసదారుడిని బలవంతంగా అరెస్ట్ చేసి, దేశం నుంచి పంపడానికి సుమారు 18,245 డాలర్లు ఖర్చవుతుండగా, ఈ స్వచ్ఛంద పథకానికి కేవలం 5,100 డాలర్లతోనే పని పూర్తవుతుందని తెలిపింది. ఇది అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును ఆదా చేస్తుందని వివరించింది. అయితే, ఈ అవకాశాన్ని వినియోగించుకోని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు హెచ్చరించారు. గౌరవంగా వెళ్లిపోండి, లేదంటే మేమే పట్టుకుని అరెస్ట్ చేస్తాం. అప్పుడు మళ్లీ అమెరికాలో అడుగుపెట్టలేరు అని సెక్యూరిటీ సెక్రటరీ క్రిస్టీ నోమ్ స్పష్టం చేశారు. గతంలో 1,000 డాలర్లుగా ఉన్న ఈ బోనస్‌ను, ట్రంప్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 2,600 డాలర్లకు పెంచింది. ఇప్పటివరకు ఈ విధానంలో సుమారు 22 లక్షల మంది అమెరికాను వీడినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

కీలక రంగాలకు రూ.54,926కోట్లు

- 100 ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కులకు రూ.33,660 కోట్లు
- పత్తి రైతులకు కనీస మద్దతు ధర కోసం రూ.11,712 కోట్లు
- కేబినెట్ వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

న్యూఢిల్లీ, మార్చి 18: ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన మంత్రివర్గం సమావేశంలో పలు కీలక రంగాలకు రూ. 54,926 కోట్ల కేటాయింపులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన ప్రతిపాదనల వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశవ్యాప్తంగా 100 ప్లగ్అండ్‌ప్లే పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసేందుకు రూ.33,660 కోట్ల కేటాయింపులతో భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన (భవ్య) పథకానికి మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. ప్రపంచ స్థాయి పారిశ్రామిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, దేశ ఉత్పాదక సామర్థ్యాన్ని వెలికితీయడం లక్ష్యమని వివరించారు. జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం (ఎన్ఐసిడిపి) కింద అభివృద్ధి చేసిన పారిశ్రామిక స్మార్ట్ సిటీల విజయం ఆధారంగా రాష్ట్రాలు, ప్రైవేటు సంస్థల భాగస్వామనయంతో 'భవ్య' పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. భవ్య పథకం భారీ ఎత్తున ఉద్యోగాల కల్పనకు దోహదపడుతుందని, తయారీ, లాజిస్టిక్స్, సేవల రంగాలలో గణనీయమైన ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి కల్పిస్తుందని, అలాగే భారీ పెట్టుబడులను ప్రోత్సహిస్తుందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేస్తుందన్నారు. కేంద్ర కేబినెట్ పత్తి రైతులకు గణనీయమైన నిధులను ఆమోదించింది. పడిపోతున్న మార్కెట్ ధరల నుండి పత్తి సాగుదారులకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుంటూ, 2023-24 సీజన్‌కు గాను పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కింద రూ.11,712 కోట్లను బుధవారం నాడు మంత్రివర్గం ఆమోదించింది. దీనివల్ల సుమారు 7.25 లక్షల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. లక్షలాది మంది రైతులకు, అనుబంధ కార్మికులకు మద్దతు ఇస్తుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో కీలకమైన జాతీయ రహదారి (ఎన్‌హెచ్-927)లో బారాబంకి నుంచి బహ్రెయిచ్ వరకు దాదాపు 101.515 కి.మీ. మేర రూ.6,969 కోట్లతో రోడ్డు విస్తరణ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ జాతీయ రహదారి పనులను హైబ్రిడ్ మోడల్‌లో అభివృద్ధి చేయనున్నారు. దేశవ్యాప్తంగా చిన్న జల విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి రూ.2,585 కోట్లు ప్రోత్సాహకం కింద అందించడానికి చేసిన ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేయబోయే విద్యుత్ ప్రాజెక్టుల (1-25 మెగావాట్ల సామర్థ్యం)కు ప్రాజెక్టు వ్యయంలో 20 నుంచి 30శాతం కేంద్ర ఆర్థిక సహాయం అందించనుంది.

ముంచుకొస్తున్న ఎరువుల సంక్షోభం

- ఎరువుల కర్మాగారాలలో ఎల్ఎన్‌జి కొరత నివారణకు కేంద్రం చర్యలు
- గ్యాస్ కొనుగోలుకు రూ.600 కోట్లు కేటాయింపు
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

న్యూఢిల్లీ, మార్చి 18: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్ఎన్‌జి కొరత ఏర్పడింది. పరోక్షంగా ఎరువుల ఉత్పత్తిపైనా ప్రభావం చూపుతోంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితులు మరింత ముదిరితే, పరిస్థితి చేయిదాటిపోతుందని కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒక వైపు వంటగ్యాస్ కొరత తీర్చడంతోపాటు, ఎరువుల ఉత్పత్తి కర్మాగారాలకు గ్యాస్ కొరత ఎదుర్కోకుండా, ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగేలా చర్యలకు కేంద్రం శ్రీకారం చుట్టింది. అవసరమైతే తక్షణమే గ్యాస్‌ను కొనుగోలు చేసేందుకు వీలుగా, ప్రభుత్వం ఎల్ఎన్‌జి కోసం సుమారు రూ.600 కోట్ల నిధులు కేటాయించింది. ఎరువుల ఉత్పత్తికి గ్యాస్ చాలా కీలకం. గ్యాస్ సరఫరాలో కొరత ఏర్పడితే, అది వ్యవసాయంపై, రైతులపై నేరుగా ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, ఆకస్మిక కొరతలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రభుత్వం ఈ నిధిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కీలకమైన సముద్ర మార్గమైన హోర్ముజ్ జలసంధి చుట్టూ అనిశ్చితిని పెంచాయి. ప్రపంచ ఇంధన సరఫరాకు ఈ మార్గం చాలా కీలకమైనది. అక్కడ ఏ చిన్న అంతరాయం కలిగినా గ్యాస్ సరఫరాపై గణనీయమైన ప్రభావం పడవచ్చు. ఈ ఉద్రిక్తత ఎక్కువ కాలం కొనసాగితే, గ్యాస్ లభ్యత 70శాతం నుండి 50-60శాతానికి పడిపోవచ్చు. తత్ఫలితంగా, ధరలు విపరీతంగా పెరిగి, భారతదేశం వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలపై ప్రత్యక్ష ప్రభావం పడవచ్చు. ఇంధన రంగ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆసియాలో ఎల్ఎన్‌జి ధరలు 40శాతం వరకు పెరగవచ్చు. దీనివల్ల గ్యాస్ కొనుగోలు మరింత భారంగా మారడంతో పాటు, ఉత్పత్తి వ్యయాలు కూడా పెరుగుతాయి. అయితే, ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం నిధులను సిద్ధం చేస్తోంది. దీంతో సరఫరాలను స్థిరీకరించడానికి స్పాట్ మార్కెట్ నుండి తక్షణమే గ్యాస్ కొనుగోలు చేయడానికి వీలవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ప్రస్తుతం, భారతదేశంలోని యూరియా ప్లాంట్లు తమ గ్యాస్ అవసరాలలో అధిక భాగాన్ని దీర్ఘకాలిక ఒప్పందాల ద్వారా తీర్చుకుంటుంది. ఒక చిన్న భాగాన్ని స్పాట్ మార్కెట్ నుండి కొనుగోలు చేస్తున్నాయి. సరఫరా కొరత ఏర్పడితే, ఉత్పత్తి ప్రభావితం కావచ్చు. ప్లాంట్ల మూసివేతను నివారించడానికి, నిరంతరాయ ఉత్పత్తిని నిర్ధారించడానికి ప్రభు త్వం ఇప్పుడు స్పాట్ మార్కెట్ నుండి మరింత గ్యాస్‌ను కొనుగోలు చేయడానికి సిద్ధమవుతోంది. దీని వల్ల రైతులకు ఎరువులు సకాలంలో అందించడానికి వీలు కలుగు తుంది. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. ఈ సమయంలో, దేశానికి ప్రతి సంవత్సరం లక్షల టన్నుల యూరియా అవసరం అవుతుంది. గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే, ఉత్పత్తి తగ్గి, దిగుమతులపై ఆధారపడటం పెరగ వచ్చు. ప్రభుత్వం ఈ పరిస్థితిని నివా రించాలనుకుంటోంది.

ఎల్‌పిజి ఎటిఎం వచ్చేసింది!

- పైలట్ ప్రాజెక్టుగా గురుగ్రామ్‌లో బిపిసిఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు
- తొలుత నగరాల్లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా అందుబాటులోకి

న్యూఢిల్లీ, మార్చి 18 : అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధం కారణంగా దేశవ్యాప్తంగా ఎల్‌పిజి కొరత ఏర్పడింది. కేంద్రం రంగంలోకి దిగి ఇరాన్‌తో చర్చలు జరిపి, హోర్ముజ్ జలసంధిలో చిక్కుకున్న ఎల్‌పిజి, చమురు నౌకలను సురక్షితంగా భారత్‌కు తీసుకొస్తోంది. ఇప్పటికే రెండు నౌకలు రాగా, మరో 22 నౌకలు హోర్ముజ్ జలసంధి నుంచి బయలుదేరాయని కేంద్రం వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఎల్‌పిజి గ్యాస్ ఎటిఎం సౌకర్యం అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇందులో భాగంగా భారత్ పెట్రోలియం కార్పోరేషన్ (బిపిసిఎల్) ఆధ్వర్యంలో గురుగ్రామ్ నివాసితుల కోసం ఎల్‌పిజి గ్యాస్ ఎటిఎంను ప్రారంభించింది. ఇది దేశంలోనే మొట్టమొదటి ఎల్‌పిజి గ్యాస్ ఏటిఎమ్. ఈ ఎటిఎం అందుబాటులోకి రావడంతో గ్యాస్ అయిపోయినప్పుడు గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం తప్పింది. ఇప్పుడు కేవలం 2 నుండి 3 నిమిషాల్లోనే నింపిన సిలిండర్‌ను పొందవచ్చు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా, సోహ్నాలోని సెక్టార్ 22, సెంట్రల్ పార్క్ ఫ్లవర్ వ్యాలీలో ఈ స్మార్ట్ వెండింగ్ మెషీన్‌ను ఏర్పాటు చేసింది. ఈ యంత్రం పూర్తిగా ఆటోమేటెడ్, కాంటాక్ట్‌లెస్ (స్పర్శరహితం). వినియోగదారులు తమ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ చేసి, ఓటిపి ద్వారా ధ్రువీకరించుకోవాలి. ఆ తర్వాత వారు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, ఏదైనా యుపిఐని ఉపయోగించి డిజిటల్ చెల్లింపు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, నింపిన సిలిండర్ యంత్రం నుండి బయటకు వస్తుంది. ఖాళీ సిలిండర్ లోపల నిల్వ చేయబడుతుంది. ఇది 24 గంటలూ అందుబాటులో ఉండటం. అంటే మీరు ఇకపై గ్యాస్ ఏజెన్సీ డెలివరీ కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదు. మీరు ఎప్పుడైనా వెళ్లి కేవలం కొన్ని నిమిషాల్లో కొత్త సిలిండర్‌ను పొందవచ్చు. ఈ యంత్రం ఒకేసారి 10 సిలిండర్లను నిల్వ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, తొలి దశలో నగరాల్లో, ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఎల్‌పిజి ఎటిఎంలు అందుబాటులోకి రావచ్చు.

ఎమిరేట్స్‌నుంచి గుజరాత్‌కు చేరిన జగ్‌లాడ్కి చమురునౌక 80,886 మెట్రిక్ టన్నుల ముడిచమురు నిల్వలతో రాక

అహ్మదాబాద్, మార్చి 18: భారత జెండా కలిగిన జగ్ లాడ్కి అనే ముడి చమురు నౌక బుధవారం గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి వచ్చిన ఈ నౌకలో 80,886 మెట్రిక్ టన్నుల ముడి చమురు ఉంది. ఈ నౌకను ఫుజైరా పోర్టులో లోడ్ చేశారు. జగ్ లాడ్కి మొత్తం పొడవు 274.19 మీటర్లు, వెడల్పు 50.04 మీటర్లుగా ఉంది. ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ప్రపంచవ్యాప్తంగా ఇంధన ఆందోళనలు కొనసాగుతున్నాయి. అయితే మనవద్ద ఇంధన నిల్వలు ఉన్నాయని, ఆందోళన అవసరం లేదని ప్రభుత్వం చెబుతోంది. మార్చి 14న ఫుజైరాలోని ఆయిల్ టెర్మినల్‌పై ఇరాన్ దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. జగ్ లాడ్కి అదే సమయంలో అక్కడ ఇంధనం నింపుకుంటోంది. ఇంధనం నింపుకున్న అనంతరం ఈ నౌక అక్కడి నుంచి బయలుదేరి సురక్షితంగా భారత్ చేరుకుంది. ముర్బన్ క్రూడ్‌తో నిండిన ఈ నౌక మూడు రోజుల ప్రయాణం అనంతరం గుజరాత్ తీరానికి చేరుకుంది.

నాలుగంతస్తుల భవనంలో అగ్నిప్రమాదం
తొమ్మిది మందిమృతి, మరో ముగ్గురికి గాయాలు

న్యూఢిల్లీ, మార్చి 18: ఢిల్లీలోని రామ్ చౌక్ మార్కెట్‌లో ఉన్న 4 అంతస్తుల భవనంలో ఉదయం 7 గంటలకు జరిగిన అగ్నిప్రమాదంలో 9 మంది మృతిచెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఆ సమయంలో చాలా మంది నిద్రలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆ భవనం బేస్మెంట్, గ్రౌండ్‌ఫ్లోర్‌లో బట్టల దుకాణంతో పాటు కాస్మెటిక్స్ షోరూం కూడా ఉన్నది. అయితే బిల్డింగ్‌లోని టాప్ రెండు ఫ్లోర్లలో ఆ ఇంటి యజమానులు ఉంటున్నారు. అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిని ప్రవేశ్, కమాల్, ఆశు, లాడో, హిమాన్షి, దీపికతో పాటు ముగ్గురు మైనర్ బాలికలు ఉన్నారు. అనిల్, సచిన్‌తో పాటు మరో రెండు ఏళ్ల అమ్మాయి గాయపడ్డారు. ప్రస్తుతం వారికి చికిత్స కొనసాగుతోంది. పాలంకు చెందిన పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీ అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. బిల్డింగ్ ఓనర్‌ను రాజేంద్ర కశ్యప్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులు బిల్డింగ్‌లోని రెండో, మూడో ఫ్లోర్లలో నివసిస్తున్నారు. 20 ఫైర్ టెండర్లు, 11 సీఏటీఎస్ అంబులెన్సులు, బీఎస్ఈఎస్ , ఎయిర్ ఫోర్స్ పోలీసు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి. ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఫోరెన్సిక్ బృందం చేరుకున్నది. స్థానిక పోలీసులు ఘటనపై విచారణ చేస్తున్నారు.

సిఎం పదవి ఆఫర్ చేసినా మా అధినేత తిరస్కరించారు
టివికె విజయ్ పార్టీనేత అధవ్ అర్జున

చెన్నై, మార్చి 18: టీవీకే అధినేత, నటుడు విజయ్‌కు తమిళనాడులో ఒక జాతీయ పార్టీ సీఎం పదవి ఆఫర్ చేసిందని చెప్పిన టీవీకే నేత అధవ్ అర్జున ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించినట్లు చెప్పిన అర్జున అది ఏ పార్టీయో వెల్లడించలేదు. ఆయన వ్యాఖ్యల్ని బట్టి, అది జాతీయ పార్టీ అని స్పష్టమవుతోంది. తమిళనాడు ఎన్నికల్లో టీవీకే పార్టీ ప్రభావాన్ని కాదనలేం. ఆ పార్టీ అధినేత, నటుడు విజయ్‌కు ఉన్న ఫాలోయింగ్ తప్పకుండా ఎన్నికల్లో ప్రభావం చూపిస్తుంది. ఆయన పార్టీ అధికారంలోకి వస్తుందా రాదా అంటే ఇప్పుడే చెప్పలేం. కానీ, ఓటర్లను ప్రభావితం చేయగలదు. అందుకే విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయన్నది ఒక ప్రచారం. ఇటీవల పలు సందర్భా కాంగ్రెస్ నేతలు విజయ్ పట్ల సానుకూలంగా మాట్లాడారు. ఇదే సమయంలో బీజేపీ నేతలు కూడా విజయ్‌ను తమవైపు తిప్పుకొనేందుకు ప్రయత్నించారని ప్రచారం మొదలైంది. మొదట ఆయనకు డిప్యూటీ సీఎం పదవిని బీజేపీ ఆఫర్ చేసిందని ప్రచారం జరిగింది. ఇదే అంశంపై టీవీకే నేత ఆదవ్ అర్జున మాట్లాడారు. ఒక జాతీయ పార్టీ విజయ్‌కు సీఎం పదవి ఆఫర్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు.. మొదట 50 సీట్ల నుంచి మొదలై 90 సీట్లు, ఆపై సగం సీట్ల వరకు ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిపారు. అయితే, సీఎం పదవి కోసం విజయ్ ఢిల్లీ ముందు తలవంచబోరని చెప్పారు. ఈ ఆఫర్‌ను విజయ్ తిరస్కరించారని అర్జున అన్నారు. అది ఏ పార్టీయో చెప్పకపోయినప్పటికీ బిజెపి అని కొందరు టీవీకే నేతలు అంటున్నారు. విజయ్ కూడా ఈ ఎన్నికల వరకు తమ పార్టీ ఎవరితోనూ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేశారు. వచ్చే నెలలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన్నారు. విజయ్ పార్టీతో తమ పార్టీ చర్చలు జరపడం లేదని ఏఐఏడీఎంకే ఇటీవల స్పష్టం చేసింది. బీజేపీ మాత్రం అధికార డీఎంకేను ఓడించాలంటే పొత్తు అవసరం అని భావిస్తోంది.

ఉత్తరకొరియా ఎన్నికల్లో మళ్లీ కిమ్‌దే రాజ్యం.. 99.93% ఓట్లతో అనూహ్య విజయం

ప్యాంగ్యాంగ్, మార్చి 18: ఉత్తర కొరియాలో ఇటీవల జరిగిన పార్లమెంటరీ ఎన్నికలు ప్రపంచదేశాలను నివ్వెరపోయేలాచేసాయి. దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ నేతృత్వంలోని వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా ఏకంగా 99.93 ఓట్లతో మెగా విజయం నమోదు చేసింది. ఈ విజయంతో కిమ్ వరుసగా మూడోసారి అధికార పగ్గాలు చేపట్టారు. ఉత్తర కొరియాలో ఎన్నికల ప్రక్రియ ఎంత సులువో, ఎంత పారదర్శకమో ఈ ఫలితాలే చెబుతున్నాయి. బ్యాలెట్ పేపర్‌పై కేవలం అధికార పార్టీ అభ్యర్థి పేరు మాత్రమే ఉంటుంది. ఓటర్లు వచ్చి, ఆ పేరుకు మద్దతుగా ఓటు వేసి తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకోవడమే. ఒకవేళ ఎవరికైనా అభ్యర్థి నచ్చకపోతే, పేరును కొట్టివేసే విశాల హృదయం కూడా ఎన్నికల సంఘం కల్పించింది. అయితే, అలా చేసిన వారిని దేశద్రోహులుగా పరిగణిస్తారు. వారి భవిష్యత్తు ఏమవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో, ప్రజలు నాయకుడిపై ఉన్న విశ్వాసంతో పోలింగ్‌లో పాల్గొన్నారు.

మంటల్లో పశ్చిమాసియా

మొజ్తాబా ఎక్కడున్నా అంతం చేస్తాం: ఇజ్రాయెల్

జెరూసలెం, మార్చి 18: ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ఆయతుల్లా మొజ్తాబా ఖమేనీ ఎక్కడ ఉన్నా వెంబడించి అంతం చేస్తామని ఇజ్రాయెల్ హెచ్చరించింది. తమ దేశానికి ముప్పుగా ఉన్న వారు ఎప్పుడూ తమ టార్గెట్‌లోనే ఉంటారని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించింది. అయితే ప్రస్తుతం ఖమేనీ ఎక్కడున్నారనే దానిపై తమ వద్ద సమాచారం లేదని మీడియాకు ఐడిఎఫ్ ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ సమాధానం ఇచ్చారు. ఆయన ఎక్కడున్నారన్న దానిపై మా వద్ద ప్రస్తుతం సమాచారం లేదు. కానీ మా దేశానికి ముప్పుగా పరిణమించిన వారిని వెంబడించడం మాత్రం ఆపం. మాకు వ్యతిరేకంగా వ్యవహరించేవారు మా నుంచి తప్పించుకోలేరు. వారిని తరిమి, తరిమి అంతం చేస్తాం. ఎప్పుడు ఎక్కడ అనేది ఇప్పుడే ఖచ్చితంగా చెప్పలేం. మా టార్గెట్ మిస్ కాదు అని డెఫ్రిన్ అన్నారు. మరోవైపు, దాడుల్లో గాయపడిన ఖమేనీని చికిత్స కోసం రష్యాకు తరలించడాన్ని ఇరాన్ ఖండించింది. ఇదొక కొత్త తరహా మానసిక యుద్ధం. ఇరాన్ నేతలకు పారిపోవాల్సిన, షెల్టర్లలో దాక్కోవాల్సిన అవసరం లేదు. వారు ప్రజల మధ్యే ఉంటారు అని రష్యాలో ఇరాన్ రాయబారి కాజెమ్ జలాలీ ఎక్స్ వేదికగా తెలిపారు. ఇరాన్ అత్యున్నత సైనికాధికారి అలీ లారిజానీ, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ అనుబంధ బసీజ్ మిలీషియా అధిపతి జనరల్ గులాం రెజా సొల్మనీ ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందారు. తమ దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న లారిజానీ మృతిని ఇరాన్ కూడా ధృవీకరించింది. ఈ దాడి జరిగినప్పుడు ఆయన కుమార్తె ఇంటివద్ద ఉన్నారు. ఈ ఘటనలో ఆయనతో పాటుకుమారుడు, సహాయకులు ప్రాణాలు కోల్పోయారని సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ వెల్లడించింది.

హర్ముజ్ సమీపంలో ఇరాన్ భూగర్భ క్షిపణి కేంద్రాలు ధ్వంసం
బంకర్‌బస్టర్ బాంబులతో అమెరికా భీభత్సం

వాషింగ్టన్, మార్చి 18: మధ్య ప్రాచ్యంలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా అలముకున్నాయి. ఇరాన్ లక్ష్యంగా అమెరికా బలగాలు బుధవారం భారీ వైమానిక దాడులకు దిగాయి. వ్యూహాత్మకంగా కీలకమైన హర్మ్యూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ తీరప్రాంతంలో ఉన్న భూగర్భ క్షిపణి స్థావరాలను ధ్వంసం చేశాయి. ఈ దాడుల్లో సుమారు 2,268 కిలోల బరువుండే అత్యంత శక్తిమంతమైన బంకర్ బస్టర్ బాంబులను ఉపయోగించినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ సెంట్‌కామ్ ధ్రువీకరించింది. ఈ బాంబులు భూగర్భంలోని కాంక్రీట్ కట్టడాలను ఛేదించుకుని వెళ్లి, అక్కడ దాచి ఉంచిన నౌకా విధ్వంసక క్షిపణులను పూర్తిగా నాశనం చేశాయని తెలిపింది. అంతర్జాతీయ నౌకాయానానికి ఈ క్షిపణుల నుంచి ముప్పు పొంచి ఉందన్న కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ విషయంలో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించకపోవడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. మాకు ఎవరి సహాయం అవసరం లేదు, ఒంటరిగానే ఇరాన్‌ను ఎదుర్కోగలం" అని ఆయన స్పష్టం చేశారు. ఫ్రాన్స్ వంటి దేశాలు ప్రత్యక్షంగా యుద్ధంలో పాల్గొనడానికి నిరాకరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ దాడుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాలో 20 శాతం వాటా ఉన్న జలసంధి మార్చి మొదటి వారం నుంచే దాదాపు మూతపడింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరలు భగ్గుమన్నాయి. అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌లోని రామత్ గన్ నగరంపై క్షిపణి దాడులు చేయగా, ఇద్దరు పౌరులు మరణించారు. మరోవైపు, ఇరాన్ నుంచి వస్తున్న డ్రోన్లు, క్షిపణులను యూఏఈ, కువైట్, బహ్రెయిన్ తమ రక్షణ వ్యవస్థలతో సమర్థవంతంగా కూల్చివేస్తున్నాయి. ఇరాన్ అణు కార్యకలాపాలను వేగవంతం చేయవచ్చన్న ఆందోళనల నడుమ అమెరికా తన దాడులను అణు ప్లాంట్ల సమీపంలోని క్షిపణి కేంద్రాలపైకి మళ్లించడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది.

ఇదిగో మళ్లీ చెపుతున్నా.. నేను బతికే ఉన్నా..
ఇజ్రాయెల్‌లో అమెరికా రాయబారితో ప్రధాని నెతన్యాహు

టెల్ అవీవ్, మార్చి 18: ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తన మరణంపై కొన్ని రోజులుగా సాగుతున్న ప్రచారానికి మరో వీడియోతో ఘాటు జవాబిచ్చారు. తాను బతికే ఉన్నానని, ఆరోగ్యంగా ఉన్నానని స్పష్టం చేస్తూ ఒక వీడియోను విడుదల చేశారు. ఇజ్రాయెల్‌లోని అమె రికా రాయబారి మైక్ హకబీతో కలిసి ఆయన ఈ వీడియోలో కనిపించారు. ఈ పరిణామంతో నెతన్యాహు ఆరోగ్యంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తీవ్ర ప్రచారానికి తెరపడినట్లయింది. ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో నెతన్యాహు వరుసగా ఏడు కేబినెట్ సమావేశాలకు హాజరుకాలేదని, ఆయన తీవ్రంగా గాయపడ్డారని లేదా మరణించారని ఆన్‌లైన్‌లో విస్తృతంగా వదంతులు వ్యాపించాయి. గతంలో ఆయన కార్యాలయం విడుదల చేసిన వీడియోలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో సృష్టించిన డీప్‌ఫేక్ అని, ఒక వీడియోలో ఆయనకు ఆరు వేళ్లు ఉన్నాయని కూడా ప్రచారం చేశారు. ఈ పుకాం ఈ వీడియో సంభాషణలో, హకబీ తన పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, "మీరు క్షేమంగా ఉన్నారో లేదో కనుక్కోవాలని డొనాల్డ్ ట్రంప్ నన్ను పంపారు" అని అన్నారు. దీనికి నెతన్యాహు వెంటనే స్పందిస్తూ, అవును మైక్, నేను బతికే ఉన్నానని బదులిచ్చి, ఆయనతో కరచాలనం చేశారు. ఇది మార్ఫింగ్ చేసిన వీడియో లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సృష్టించినది కాదని చెప్పే ప్రయత్నంలో, తన చేతికి ఐదు వేళ్లు ఉన్నాయని చూపిస్తూ చమత్కరించారు. నెతన్యాహు తన చేతిలో పంచ్ కార్డ్ చూపిస్తూ ఇరాన్‌పై తమ వైఖరిని స్పష్టం చేశారు. "ఇది ఒక పంచ్ కార్డ్. ఈ రోజు ఈ కార్డుపై ఉన్న ఇద్దరి పేర్లను చెరిపేశాను. ఈ బ్యాచ్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారో చూడండి. మేం వాళ్లను తుడిచిపెట్టేస్తున్నామని తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. దీనికి హకబీ హాస్యంగా, మంచి విషయం ఏంటంటే ఈ పంచ్ కార్డులో నా పేరు లేదు నెతన్యాహు నవ్వుతూ, మీరు మంచి వాళ్ల జాబితాలో ఉన్నారని బదులిచ్చారు. అణు ఆయుధాలను అభివృద్ధి చేసి, ఇజ్రాయెల్‌ను నాశనం చేశాక అమెరికాలోని ప్రతి నగరంపై దాడి చేయాలనుకుంటున్న ఉన్మాదులను ఏరివేయడంలో అమెరికా దళాలు చేస్తున్నది అద్భుతం. వారితో కలిసి నిలబడటం మాకు గర్వకారణమని నెతన్యాహు అన్నారు. హకబీ కూడా తన ఎక్స్ ఖాతాలో, ఈ రోజు నేను ఇజ్రాయెల్ ప్రధానితో సమావేశమయ్యాను.

19-3Pg6exHMNWJQE 10_19-3Pg6exHMNWJQE.qxd 18/Mar/26 10:37 PM Page 1

వైభవంగా నూకాంబికా అమ్మవారి కొత్త అమావాస్య పండగ మహోత్సవం పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి రవీంద్ర

అనకాపల్లి, మార్చి 18 ప్రభాతవార్త: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో కొత్త అమావాస్య పండగ మహోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. జాతర సందర్భంగా అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర ప్రభుత్వం తరుపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. చిన్న, మధ్యతర పరిశ్రమల మంత్రిత్వ శాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సమాజం మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, రైల్వే కమిటీ బోర్డ్ చైర్మన్ సిఎం రమేష్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ స్వాగతం పలికారు. ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ కార్యనిర్వాహణాధికారి యాళ్ల శ్రీధర్ పూర్ణకుంభంతో మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనం చేసి పట్టు వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు బుద్ద నాగజగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో భక్తుల లగేజీలకు స్టిక్కర్

- పారదర్శకత, నిజాయితీ సేవలతో భద్రతకు భరోసా

తిరుమల, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: దేశం నలుమూలల నుండి ఇష్టదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వర స్వామి దర్శనార్థం వివిధ రకాలుగా తిరుమలకు వస్తున్న భక్తుల లగేజీలను స్వీకరించి వాటికి క్యూఆర్ కోడ్‌తో స్టిక్కరింగ్ వేయడంతో భద్రతకు భరోసాకల్పిస్తున్నారు. ఈ విధానం వల్ల యాత్రికులు తమ వద్ద ఉన్న లగేజీ సంచులు, సెల్‌ఫోన్లను డిపాజిట్ కౌంటర్లలో భద్రపరచి, టోకెన్ ఆధారంగా తిరిగి పొందే సదుపాయం టిటిడి కల్పించింది. నూతన విధానంలో పారదర్శక సేవల ద్వారా భక్తులు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రశాంతంగా శ్రీవారి దర్శనం చేసుకునే అవకాశం కలిగింది. తిరుమల, తిరుపతిలో మొత్తం 80 కౌంటర్లు 394మంది సిబ్బంది నిరంతర సేవలందిస్తున్నారు. వేంకటేశ్వర స్వామి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టిటిడి విస్తృత స్థాయిలో లగేజీ డిపాజిట్, తిరిగి ఇచ్చు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తోంది. తిరుపతి అలిపిరి, శ్రీవారిమెట్టుమార్గంలో కాలినడకన వచ్చే భక్తులకు, తిరుమలలో వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు, కల్యాణకట్ట ప్రాంతాల్లో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్‌ఫోన్లను భద్రంగా డిపాజిట్ చేసుకుంటున్నారు. మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. అలిపిరి కాలినడక మార్గంలో 7 కౌంటర్లు లగేజీ డిపాజిట్ పనిచేస్తున్నాయి. ఇక్కడ 46 మంది సిబ్బందితో 10,194 లగేజీ డిపాజిట్ల సామర్థం ఉంది. శ్రీవారి మెట్టు లగేజీ కేంద్రంలో రెండు కౌంటర్లు, 10 మంది సిబ్బందితో 3,,025 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం ఉంది. ఇక్కడ లగేజీ డిపాజిట్ చేసిన భక్తులు తిరుమలకు చేరుకున్న తరువాత డెలివరీ కేంద్రాల్లో సులభంగా తిరిగి పొందే సౌకర్యం కలిగింది.

తిరుమలలో వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం లగేజీ, సెల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం అందుబాటులో ఉంది. ఉచిత హాళ్ళ వద్ద 10 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లో రెండు కౌంటర్లు, నారాయణగిరి షెడ్‌లలో 8 కౌంటర్లు, డిడి హాల్‌లో మూడు కౌంటర్లు, ఎస్ఇడి హాల్‌లో 5 కౌంటర్లు, వైకుంఠం క్యూకాంప్లెక్స్ స్కానింగ్ (కంపార్ట్‌మెంట్03) రెండు కౌంటర్లు, కల్యాణకట్ట సమీపంలో ప్రత్యేక డిపాజిట్/

డెలివరీ కేంద్రాలు టిటిడి ఏర్పాటు చేసింది.

యాత్రికుల వసతి సముదాయాలు పిఎసి 1, 2, 3 - మూడు కౌంటర్లు, సుపథం వద్ద ఒక కౌంటర్, సీనియర్ సిటిజన్ / దివ్యాంగులుఒక కౌంటర్, తిరుమలలో లగేజీ డెలివరీ కేంద్రాలు డిపాజిట్ చేసిన లగేజీని తిరిగి పొందేందుకు సులభంగా ఉన్నాయి. అలిపిరి నడకమార్గం భక్తులకు జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద ఐదు కౌంటర్లు, శ్రీవారి మెట్టు నడకమార్గం భక్తులకు టిబిసి వద్ద రెండు కౌంటర్లు, పలు చోట్ల సులభంగా నిర్వహిస్తున్నారు. లగేజీ డిపాజిట్ కేంద్రాల్లో భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసే సమయంలో సిబ్బంది ముఖ గుర్తింపు సాంకేతిక పరిజ్ఞానంద్వారా క్యూఆర్ కోడ్ సృష్టించి లగేజీ సంచిపై కోడ్ స్కిక్కర్ వేస్తారు. ఆ తర్వాత లగేజీకి సంబంధించిన సమాచారంతో ఒక రశీదును భక్తులకు అందిస్తారు. డిపాజిట్ డెలివరీ సమయంలో డెలివరీ కేంద్రంలో ఆ స్లిప్ సిబ్బందికి చూపితే ఆ నెంబర్ ఆధారంగా లగేజీని సులభంగా గుర్తించి ఒక నిమిషంలోపు లగేజీని భక్తులకు అందిస్తున్నారు. ఈ సేవలను తిరుమల, తిరుపతిలో భక్తులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. 2026 జనవరి నెలలో అత్యధికంగా 10,44,268 డిపాజిట్లు నమోదయ్యాయి. 2026 జనవరి 25రథసప్తమి రోజున అత్యధికంగా 1,34,749 డిపాజిట్లు నమోదయ్యాయి. వైకుంఠ ఏకాదశి, గరుడసేవ, రథసప్తమి వంటి ఉత్సవాల సమయంలో భారీగా వినియోగం నమోదవుతోంది.

పరిశ్రమల్లో వేసవి భద్రతా తనిఖీలు

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త: వేసవి కాలం ప్రారంభం కావటంతో ఎన్‌టిఆర్ జిల్లావ్యాప్తంగా పరిశ్రమల్లో ప్రమాదాల నివారణాచర్యల్లో బాగంగా ప్రత్యేక బృందాలు జిల్లావ్యాప్తంగా పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టారు. బుధవారం ప్రత్యేక పారిశ్రామిక బృందాలు కొండపల్లి ఐడిఏలోని నిఫ్టీల్యాబ్స్ తదితర సంస్థల్లో తనిఖీలు చేసి, మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా పరిశ్రమల అధికారి మధు మాట్లాడుతూ జిల్లాకలెక్టర్ లక్ష్మీశా ఆదేశాల మేరకు పరిశ్రమల్లో తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఈతనిఖీల నిమిత్తం అగ్నిమాపక, కాలుష్య, ఫ్యాక్టరీలు, పోలీస్, విద్యుత్, కార్మికశాఖ, బాయిలర్, రెవెన్యూ, ఏపిఐఐసి, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఫార్మా, కెమికల్, సిమెంటు, బాణాసంచా గోదాములు, ఎల్‌పిజీ బాట్లింగ్ యూనిట్లు, మధ్య, భారీ పరిశ్రమల్లో ఈతనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల సరిగా ఉన్నాయో లేదో చెక్‌లిస్టు ప్రకారం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్నిమాపక పరికరాల పనితీరు, ప్రమాదకర రసాయనాల నిల్వ విధానం, విద్యుత్ వ్యవస్థల స్థితిగతులు, భద్రతా పరికరాల ధృవపత్రాలు, కార్మికుల భద్రతపై తనిఖీలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు కొండపల్లిలోని ఇన్‌కెమ్ ల్యాబ్స్, రాణి లైఫ్‌సైన్సెస్, నిఫ్టీల్యాబ్స్, ఆర్చ్‌ల్యాబ్స్ సంస్థల్లో తనిఖీలు చేసినట్లు పరిశ్రమల అధికారి తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ దొంగలు అరెస్ట్

తిరుపతి, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి జిల్లా పోలీసులు పనితీరును మరోసారి రుజువుచేసుకుని రెండు జిల్లాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలకు పాల్పడిన ఐదుగురు అంతర్ జిల్లాదొంగలను అరెస్ట్ చేశారు. వారినుండి తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో 195 ట్రాన్స్‌ఫార్మర్లచోరీలో సుమారు రూ.4 లక్షల విలువ గల 400 కిలోల రాగి వైర్లతో పాటు నేరానికి ఉపయోగించిన రెండు ఆటో లు, రెండు మోటార్ సైకిళ్ళు, రెండు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు బుధవారం సాయంత్రం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియా ప్రతినిధులకు వెల్లడించారు. 15 నుండి 20 వేల రూపాయల విలువ చేసే రాగివైర్ల కోసం 2.5 లక్షల విలువైన ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రైతులకు నష్టం కలిగిస్తున్నారు. ఒక వైపు పంట నష్టం మరో వైపు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల అమర్చడంలో ఆలస్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల సమస్యలను ప్రత్యేక దృష్టితో తీసుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, క్రైమ్ అదనపుఎస్పీ శ్రీనివాసులు, నాయుడుపేట డిఎస్పీ చెంచు బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. పక్కా ప్రణాళిక తో పోలీసులు చేపట్టిన ఈ దర్యాప్తులో ఐదుగురు అంతర్ జిల్లా దొంగల హస్తం గుర్తించారు. వివిధ కోణాల్లో చేపట్టిన దర్యాప్తులో నెల్లూరు,

భారీగా సొత్తు స్వాధీనం

తిరుపతి జిల్లాల్లో నాయుడుపేట సబ్‌డివిజన్‌లో 23 కేసులు, పుత్తూరు సబ్‌డివిజన్‌లో 11 కేసులు, శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌లో 8 కేసులు, రేణిగుంట సబ్‌డివిజన్‌లో 2 కేసులు, చంద్రగిరి సబ్‌డివిజన్‌లో ఒక కేసులో (తిరుపతి జిల్లాలో మొత్తం 45 కేసులు), నెల్లూరు జిల్లాలో గూడూరు సబ్ డివిజన్‌లో 10 కేసులు మొత్తం 55 కేసులలో నేరాలు చేసినట్లు నిందితులను గుర్తించారు. నిందితులు బండి వాసు (22), బూదూరు మణి (27), కత్తి పోలయ్య (40), పురేటి చందు (25), ఏకోలు మధు (32).వీరంతా నెల్లూరు జిల్లా గూడూరు మండలం ప్రాంతవాసులు. ఈ చోరీ సొత్తును చల్లా రాఘవ (44) నెల్లూరు జిల్లా మనుబోలు మండలంగా గుర్తించారు. ఈ దర్యాప్తులో వెంకటగిరి సిఐ రమణ, బాలయ్యపల్లి, డక్కిలి ఎస్ఐలు గోపి, శివశంకర్ రావు సిబ్బంది కేసులను ఛేదించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, కానిస్టేబుల్ ఖాదర్ మస్తాన్, వి.తిరుపాలు, శ్రీనివాసులు, అజయ్‌బాబు, హోమ్ గార్డులు శ్రీహరి, శీనయ్యలను జిల్లా ఎస్పీ అభినందించారు. రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరచారి, శ్రీనివాసులు, వెంకటగిరి డిఎస్పి చెంచు బాబు పాల్గొన్నారు.

పారిశ్రామిక విద్యుత్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

- ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్

తిరుపతి, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సంబంధిత సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడించారు. తిరుపతిలోని సంస్థ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పారిశ్రామిక రంగం మరింత అభివృద్ధి పథంలో పయనించేందుకు వీలుగా పారిశ్రామిక విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఎస్పిడిసిఎల్ పరిధిలోని పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేస్తున్నామన్నారు. బిల్లింగ్, ట్రూఅప్, ఎఫ్ పిపిసిఎలకు సంబంధించి బుధవారం నలుగురు వినియోగదారులు వినతులను అందజేశారని తెలిపారు. పారిశ్రామిక వినియోగదారుల సమస్యల్ని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10:30 గంటల నుండి 11:30 వరకు ఆయా జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాల్లోనూ, మూడవ బుధవారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు తిరుపతిలోని ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పారిశ్రామిక వినియోగదారులు నేరుగా సంబంధిత జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ కు సమస్యను తెలియజేయాలని, అక్కడ ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోనట్లయితే మూడవ బుధవారం తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సిఎండిని కలిసి నేరుగా తమ విద్యుత్ సమస్యలను తెలియజేసి, పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ కె. గురవయ్య, డైరెక్టర్ కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, ఎం.మురళీ కుమార్, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష

తిరుపతి, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: శేషాచలంలో ఎర్రచందనం దొంగతనం చేసిన కేసులో ఇద్దరు స్మగ్లర్లకు ఐదేళ్ళ జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి జిల్లా ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. 2017లో ఎరరచందనం దుంగలు తరలిస్తూ టాస్క్‌ఫోర్స్‌కు పట్టుబడ్డారు. తమిళనాడు జిల్లా కృష్ణగిరికి చెందిన షాదిక్‌బాషు, గణేశన్‌లను అప్పట్లోనే అరెస్ట్ చేశారు. ఈ కేసులో విచారణ రావడంతో న్యాయమూర్తి ఆధారాలతో సహా స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు, ఆరులక్షల రూపాయలు జరిమానా విధించారు. నిందితులను పోలీసులు జైలుకు తరలించారు.

బార్ కౌన్సిల్ సభ్యుడిగా చలసాని అజయ్

విజయవాడ, మార్చి 19 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ బార్‌కౌన్సిల్ ఎన్నికల్లో 23 మంది సభ్యులకు గాను మొదటి సభ్యుడిగా చలసాని అజయ్ కుమార్ ఎన్నికైయ్యారు. తొలిసారిగా మహిళలకు 30 శాతం ప్రాతినిధ్యం కల్పించిన ఈ ఎన్నికల్లో ఐదుగురు మహిళా సభ్యులతోపాటు 23 మంది సభ్యులు ఎన్నికైయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 143 మంది న్యాయవాదులు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. రెండు, మూడు స్థానాలలో కె చిదంబరం, ఆలూరు రామిరెడ్డి నిలవగా, నాలుగు, ఐదు, ఆరు స్థానాలలో జి శరత్ కుమార్, వి బ్రహ్మారెడ్డి, వై బాలాజీ నిలిచారు. బివి కృష్ణారెడ్డి, వి శ్రీనివాసరాజు, సుంకర రాజేంద్రప్రసాద్ లు వరుసగా ఏడు, ఎనిమిది, తొమ్మిది స్థానాలలో నిలిచారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఎన్నికల ప్రక్రియను హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి పర్యవేక్షణలో బార్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మలత, తమ సిబ్బంది పర్యవేక్షించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోటీలో ఉన్న 143 మంది అభ్యర్థులు సాధించిన ఓట్ల ప్రాధాన్యత క్రమంలో ఎపి బార్ కౌన్సిల్‌కు 23 మందిని ఎన్నుకోవాల్సి ఉంది. ఎన్నికయ్యే వారిలో 18 మంది పురుషులు, ఐదుగురు మహిళలు ఉంటారు. మరో ఇద్దరు మహిళా న్యాయవాదులను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నామినేట్ చేస్తుంది. ఈ 25 మందిలో ఒకర్ని చైర్మన్‌గా, మరొకర్ని వైస్‌చైర్మన్‌గా ఎన్నుకుంటారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తొలిసారిగా మహిళలకు ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించారు.

నగరిలో కొండచుట్టూ మండపాన్ని పరిరక్షించండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మాజీ మంత్రి రోజా విజ్ఞప్తి

పుత్తూరు, మార్చి 18 ప్రభాతవార్త: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కూల్చివేతకు గురవుతున్న చిత్తూరు జిల్లా నగరి మునిసిపాలిటీలో 600 సంవత్సరాల చరిత్ర కలిగిన కొండచుట్టు మండపాన్ని తొలగించకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలో వైసిపికి చెందిన రాజంపేట, తిరుపతి, అరకు పార్లమెంట్ సభ్యులు పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, మద్దెల గురుమూర్తి, డాక్టర్ గుమ్మ తనూజారాణిలతో కలిసి ఆమె కేంద్ర మంత్రిని కలిశారు. ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ మరుసటి రోజున చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు ఈ మండపానికి వచ్చి దేవతామూర్తులను కొలువుంచుతారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ప్రజల మనోభావాలకు సంబంధించిన కొండచుట్టు మండపం అంశంలో సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. దీనికి సమాధానంగా కేంద్ర మంత్రి గడ్కరీ మాట్లాడుతూ మండపాన్ని రక్షించడానికి జాతీయ రహదారి ప్రస్తుత మార్గాన్ని మార్చి... ప్రత్నామ్నాయ మార్గంలో రహదారి పనులు చేయడానికి అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇవ్వాలని తెలిపారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్చేందుకు అవసరమైన భూమిని సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని దీని కోసం తాను పోరాడతానని తెలిపారు. అలాగే జాతీయ రహదారి నిర్మాణంలో నగరి నియోజకవర్గానికి సంబంధించిన మరికొన్ని సమస్యలను కూడా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. నగరి పట్టణంలో పెరుగుతున్న రాకపోకలను దృష్ట్యా ఒక ఫ్లై ఓవర్ అవసరమని, పుత్తూరు మండలంలో జాతీయ రహదారి పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, సరైన భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్ల రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు ప్రాణాలు కోల్పోతున్నాయని మంత్రికి వివరించానని, ఈ సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

జిల్లా స్థాయి నుంచి హెచ్‌ఐవి పై పోరు

- విజయవాడలో సురక్ష సంకల్ప కార్యశాల ఆరంభం
- రాష్ట్రంలో హెచ్‌ఐవి బాధితులు 3,10,451 మంది
- వయోజన హెచ్‌ఐవి ప్రాబల్యం 0.58 శాతం

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (నాకో), జిల్లా స్థాయిలో హెచ్‌ఐవి నివారణ చర్యలను బలోపేతం చేసేందుకు దేశవ్యాప్తంగా చేపట్టిన ముమ్మర ప్రయత్నంలో భాగంగా, బుధవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి సురక్ష సంకల్ప కార్యశాలను నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌కు భారత ప్రభుత్వ ఎన్ఎసిఓ అదనపు కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాకేష్ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, నేషనల్ హెల్త్ మిషన్ కమిషనర్, మిషన్ డైరెక్టర్ జి.వీరపాండియన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ కె.నీలకంఠ రెడ్డితో పాటు రాష్ట్రవ్యాప్త జిల్లా కలెక్టర్లు, అదనపు జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హెచ్‌ఐవి నియంత్రణ పురోగతిని సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణను వీరంతా కలిసి రూపొందిస్తున్నారు. మిషన్ ఎయిడ్స్ సురక్షలో భాగంగా ఈ కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఇది ఒక కేంద్రీకృత జాతీయ కార్యక్రమంగా తెలిపారు. దీని ద్వారా దేశంలోని ఎక్కువగా హెచ్‌ఐవి కేసులు నమోదయిన జిల్లాల్లో ఈ ప్రత్యేక కార్యక్రమాలను వేగవంతం చేయడానికి ఎన్ఎసిఓ ముందుకు వస్తుంద న్నారు. ప్రాధాన్యత కలిగిన రాష్ట్రాలతో వరుసగా చర్చలు జరుపుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం వయోజన హెచ్‌ఐవి ప్రాబల్యం 0.58 శాతంగా ఉంది. రాష్ట్రంలో సుమారు 3,10,451 మంది హెచ్‌ఐవితో జీవిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి, అనంతపురము, అన్నమయ్య, బాపట్ల, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, శ్రీకాకుళం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి జిల్లా, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, పశ్చిమ గోదావరి, వై.ఎస్.ఆర్ కడప వంటి 23 ప్రాధాన్యత జిల్లాల్లో కార్యక్రమ అమలు, పర్యవేక్షణను బలోపేతం చేసేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ జిల్లాల నుంచి కార్యక్రమ బృందాలు వర్క్‌షాప్‌లో పాల్గొని తమ పురోగతిని, సవాళ్లను వివరిస్తాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో హెచ్‌ఐవి నివారణ ప్రచారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు.

మహిళా సాధికారతతో సమాజ అభివృద్ధి సాధ్యం

జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్

శ్రీశైలం ప్రాజెక్టు మార్చి 18, ప్రభాతవార్త: మహిళా సాధికారతతో సమాజ అభివృద్ధి సాధ్యమని జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు విజయ రహత్కర్ అన్నారు. బుధవారం శ్రీశైలంలోని దేవస్థాన కార్యనిర్వహణాధికారి కార్యాలయం లోని మీటింగ్ హాల్ నందు జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా కమిషన్ అధ్యక్షురాలు మాట్లాడుతూ, డా. బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన సమాజ పురోగతిని మహిళల అభివృద్ధితోనే అంచనా వేయాల నీ అనే సూక్తిని ప్రస్తావిస్తూ, మహిళా సాధికారతే సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా 550 జిల్లాల్లో మహిళా జనసునావ్తి కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు జిల్లాల్లో విజయవంతంగా నిర్వహించామన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2022 ఏప్రిల్ 4న ఏర్పడిన నంద్యాల జిల్లా పరిపాలన, ఆర్థిక మరియు సామాజిక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. 2025 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు 20.27 కోట్లకు పైగా డిజిటల్ లావాదేవీలు నమోదై, వాటి విలువ రు.1.09 లక్షల కోట్లకు చేరినట్లు తెలిపారు. శ్రీశైలం దేవస్థానం వద్ద ఉగాది సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం వారి ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని తెలిపారు.

మహిళలపై నేరాల్లో 4.4 శాతం తగ్గుదల నమోదవడం సానుకూల పరిణామమని తెలిపారు.శక్తి టీమ్ స్త్రీ శక్తి పథకాలు ద్వారా మహిళలకు భద్రత, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా కోట్లాది ప్రయాణాలను సులభతరం చేసినట్లు పేర్కొన్నారు. ఆంగన్‌వాడీ, ఆరోగ్య, స్వయం సహాయక సంఘాల ప్రోత్సాహం, బాల్య వివాహాలు, మహిళా సాధికారత,

భద్రత, సంక్షేమం అంశాల్లో సమగ్ర చర్యల ద్వారా నంద్యాల జిల్లాను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దవచ్చని అధ్యక్షురాలు ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లా పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుండి విడిపోయి నంద్యాల జిల్లా ఏర్పడిందని కలెక్టర్ వివరించారు. ఈ జిల్లాలో ఒక పార్లమెంటరీ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నట్లు తెలిపారు.

ఖాకీ ముసుగులో గంజాయి గుట్టుగా రవాణా

- టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇద్దరు కానిస్టేబుళ్లు సహా ఐదుగురు అరెస్ట్
- 8 కిలోల గంజాయి, 5 మొబైళ్లు, కారు స్వాధీనం

విశాఖ(క్రైమ్), మార్చి 18 ప్రభాతవార్త: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతూ ఖాకీ ముసుగులో వ్యవహరించిన ఇద్దరు పోలీసు సిబ్బందితో పాటు మరో ముగ్గురిని నగర సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ నగర శివారులో జాతీయ రహదారి-26 వద్ద ఫార్చ్యూనర్ కారులో తరలిస్తున్న 8 కిలోల గంజాయి, ఐదు మొబైల్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున ప్రత్యేక సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. అనుమానాస్పదంగా వెళ్తున్న టయోటా ఫార్చ్యూన్ కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. కారులో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి రవాణా నెట్‌వర్క్‌పై కీలక సమాచారం లభించింది. ఇద్దరు కానిస్టేబుళ్ల పాత్ర బయటపడింది అరెస్టైన వారిలో వేపాడ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్, ఎపిఎస్‌పి కానిస్టేబుల్, మరో కొత్తవలస పోలీస్‌స్టేషన్ సిబ్బంది కుటుంబ సభ్యుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి, ప్రైవేట్ ఉద్యోగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విధుల్లో ఉండాల్సిన వారు గంజాయి రవాణాకు అండగా నిలవడం పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పాత నేరాల లింకులు వెలుగులోకి ప్రధాన నిందితుల్లో కొందరిపై గతంలోనే దోపిడీ, ఎన్‌డిపిఎస్, చీటింగ్, ఎక్స్‌టార్షన్ కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. ముఖ్యంగా ఒక నిందితుడిపై పలు పోలీస్ స్టేషన్లలో పాత కేసులు ఉండటం గమనార్హం.

పథకం ప్రకారం రవాణా.. మధ్యలో దొరికిన ముఠా ఒడిశా వైపు నుంచి గంజాయిని తెచ్చి నగర పరిసరాల్లో పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ఈ ముఠా కదిలినట్లు టాస్క్‌ఫోర్స్ గుర్తించింది. పోలీస్ తనిఖీలను తప్పించుకోవడానికి అధికార పరిచయాలు, ఖాకీ సంబంధాలు వినియోగించినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. విచారణ విస్తరణ కేసును ఎన్‌డిపిఎస్ చట్టం కింద నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు. వీరికి సరఫరా చేసిన మూలాలు, డబ్బు లావాదేవీలు, ఇతర సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

19-3Pg7exHMNWJQE 11_19-3Pg7exHMNWJQE.qxd 18/Mar/26 11:50 PM Page 1

టిడ్కో ఇల్లు రానోళ్లకు దరఖాస్తు సొమ్ము వెనక్కి

- 83,865 మందికి రూ.174 కోట్లు వెనక్కి ఇవ్వాలని సిఎం చంద్రబాబు నిర్ణయం
- త్వరలో లబ్దిదారులతో 1,00,875 టిడ్కో ఇళ్లకు గృహప్రవేశం
- రాష్ట్రంలోని అన్ని పట్టణాల్లో ఇళ్లకు క్యూఆర్ కోడ్ డోర్ నెంబర్లు
- తాగునీరు కలుషితం కాకుండా స్మార్ట్ వాటర్ పైప్ లైన్ గ్రిడ్
- 123 యూఎల్బీల్లో మోలిక వసతులకు 100 రోజుల ప్రణాళిక అమలు
- త్వరలోనే మరో 70 అన్న క్యాంటిన్లు
- మున్సిపల్ శాఖపై సిఎం సమీక్ష

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: గత ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు డబ్బులు చెల్లించి, ఫ్లాట్ కేటాయింపులు జరగని వారికి వాళ్ల దరఖాస్తు సొమ్ము తిరిగి చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 83,865 మంది దరఖాస్తుదారులకు రూ.174 కోట్లు వెనక్కి ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్రంలో నిర్మాణం పూర్తైన 1,00,875 టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్దిదారులకు అందించి, గృహప్రవేశాలు చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో పట్టణాభివృద్ధి శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలోని 123 యూఎల్బీల్లో ప్రతీ ఇంటికి క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ డోర్ నెంబర్లు త్వరితగతిన కేటాయించాలని సీఎం చెప్పారు. ఆస్తి పన్ను నుంచి మొదలుకుని అన్ని వివరాలు క్యూఆర్ కోడ్‌తో లింక్ చేయాలన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో మోలిక వసతులు, ఇతర మరమ్మతులకు 100 రోజుల ప్రణాళిక అమలు చేయాలన్నారు. పండ్లు, పాలు, కూరగాయలు అమ్మేవాళ్ల వివరాలు రిజిస్టర్ చేయాలని సూచించారు.

17 లక్షలు దాటిన పురమిత్ర రిజిస్ట్రేషన్లు

మరోవైపు పురమిత్ర యాప్‌ను రాష్ట్రంలో 17 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, దీని ద్వారా అన్ని మున్సిపల్ సేవలు పొందగలుగుతున్నారని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ఈ యాప్ ద్వారా 92 వేల గ్రీవెన్స్‌లు రాగా, వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. పురమిత్ర యాప్ ద్వారా అందుతున్న ఫిర్యాదులను బట్టి, ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాన్ని హాట్ స్పాట్‌గా గుర్తించి స్థానిక అధికారులు అక్కడ పర్యటించి సమస్యలు పరిష్కరించేలా చూడాలని సీఎం ఈ సందర్భంగా సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో మున్సిపల్ బాండ్స్ జారీతో పాటు, అర్బన్ అథారిటీ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సూచించారు. గోదావరి పుష్కరాల దృష్ట్యా... రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలును కలుపుతూ అఖండ గోదావరి ప్రాజెక్టు చేపట్టాలన్నారు. విజయవాడఅమరావతి కెనాల్ సిటీలుగా, విశాఖ బీచ్ సిటీగా తీర్చిదిద్దాలని చెప్పారు.

112 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు

మున్సిపల్ షాపు అద్దెలు... ప్రస్తుతం 3 ఏళ్లకు ఒకేసారి 33 శాతం పెంచడానికి బదులుగా ప్రతీ ఏటా తక్కువ శాతం మాత్రమే పెరిగేలా కొత్త విధానం తీసుకురావాలని సీఎం అన్నారు. 2024 నుంచి ఇప్పటివరకు పట్టణాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తకు గాను... 112 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించామని జూన్ కల్లా పూర్తి స్థాయిలో తొలగింపు జరుగుతుందన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో విలీనమైన గ్రామాలకు రోడ్లు, డ్రైనేజీలు వంటి సదుపాయాలు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని ఆదేశించారు.

అన్నక్యాంటిన్లకు ఏడాదికి రూ.167 కోట్ల వ్యయం

రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మరో 70 అన్న క్యాంటిన్లను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. అన్న క్యాంటిన్లను సూపర్ సక్సెస్ చేసేందుకు... రాజస్థాన్‌లోని అన్నపూర్ణ రసోయి, తమిళనాడులోని అమ్మ క్యాంటీన్లు అధ్యయనం చేయాలని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 204 అన్న క్యాంటీన్లకు ఏడాదికి రూ.167 కోట్లు వ్యయం అవుతోందని అధికారులు తెలిపారు. అయితే అన్న క్యాంటిన్లను కార్పొరేట్ సంస్థలు, దాతల సాయంతో నడిపించేలా పటిష్టం చేయాలని సీఎం సూచించారు.

వాయుకాలుష్యం నియంత్రణకు చర్యలు

మరోవైపు అమరావతి పవర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ పైనా ముఖ్యమంత్రి అధికారులతో చర్చించారు. 72 కి.మీ మేర పవర్ డక్ట్ ద్వారా అమరావతికి విద్యుత్ సరఫరా చేసే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే అమరావతిలో గాలి నాణ్యత పెరిగేలా చూడాలన్నారు. నిర్మాణం పనులు జరుగుతున్నందున స్ప్రింక్లర్ల వినియోగం ద్వారా దుమ్ము, ధూళిని కట్టడి చేయాలన్నారు. అమరావతిలో నిర్మించతలపెట్టిన కన్వెన్షన్ సెంటర్ గురించి సీఎం చర్చించారు. విద్యా సంస్థలు, షాపింగ్ మాల్స్, రైతు బజార్లు, హోటళ్లు వంటివి రాజధానికి ఏకకాలంలో రావాలన్నారు. చివరిగా టౌన్, కంట్రీ ప్లానింగ్ డైరెక్టరేట్ రూపొందించిన ప్రజాహిత ప్రణాళిక పుస్తకాన్ని ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఈ సమీక్షలో మంత్రి నారాయణ, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, సీడీఎంఏ డైరెక్టర్ సంపత్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముగిసిన షర్మిల నరేగా పోరాట యాత్ర

విశాఖపట్నం, మార్చి 18 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వైయస్ షర్మిల చేపట్టిన పోరాట యాత్ర బుధవారం విశాఖలో పద్మనాభం మండలంలో ముగిసింది. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామి పథకం పేరు ఎంజి నరేగా నుండి విబి జి రామ్ జిగా పేరు మారుస్తూ పథకం స్వరూపం మార్చేసింది యుపియే హయాంలో పేద రైతులకు ఆదుకోవాలనే లక్ష్యంతో తీసుకువచ్చిన పథకం ద్వారా రాష్ట్రాలకు 90శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇవ్వగ ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం ఏప్రిల్ నుండి అమలులోకి తీసుకువస్తున్న విధానంలో భారీగా కోతలు విధించి 60శాతనికి పరిమితం చేస్తోంది అని చెప్పారు. మిగతా 40శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. ఈ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 13 కోట్ల మంది రైతులు లబ్ది పొందుతున్నారు అని అన్నారు. ఇది అత్యంత శక్తి వంతమైన పథకం అని కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది, పొలం పనులు, పూడిక తీతలు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు పనులు చేపడుతున్నారు, ఎన్‌డిఏ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వాల మీద భారం పడి ఎందరికో ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టిన రాష్ట్ర వ్యాప్త ఉపాధి హామి పోరాటంలో పిసిసి స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్ కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో రైతులను సంఘటితం చేస్తూ ఎన్‌డిఏ ప్రభుత్వం చేస్తున్న మోసాలను వారికి వివరించడంలో, రైతుల మద్దతు కూడగట్టడంలో కమలాకర్ ప్రధాన పాత్ర పోషించారని ఆమె తెలిపారు. తాను చేపట్టిన చేపట్టిన ఉపాధి హామి పోరాట యాత్ర విజయవంతం చేయడంలో పూర్తి శ్రద్ధ, శక్తులు పెట్టడంతో విశాఖలో జరిగిన చివరి పోరాట యాత్ర సభలో ఆమె కమలాకర్ చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు.

విజయవాడ సిపికి కేంద్ర ప్రభుత్వ సేవా పతకం

అభినందనల వెల్లువ

విజయవాడ, మార్చి 18, ప్రభాతవార్త: ప్రతిష్టాత్మకమైన కేంద్రప్రభుత్వ అతి ఉత్కృష్ట సేవాపతకానికి ఎంపికయిన విజయవాడ పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజశేఖరబాబును పలువురు పోలీస్ అధికారులు సత్కరించి అభినందనలు తెలిపారు. బుధవారం విజయవాడ సిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డిసిపిలు తిరుమలేశ్వరరెడ్డి, షరీన్‌బేగం, కె.జి.వి. సరిత, కె.కృష్ణప్రసన్న, బి.లక్ష్మీనారాయణ, ఎస్.వి.డి.ప్రసాద్, ఏడిసిపిలు నాదెండ్ల మురళీ, ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్‌లు సిపికి శాలువాలు కప్పి సత్కరించారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాజశేఖరబాబు నేతృత్వంలో విజయవాడ పోలీసులు ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. అవకాయ్ ఉత్సవాలు, దసరా ఉత్సవాలు విజయవంతం చేయటంతోపాటు, విజయవాడ నగరంలో ఏకార్యక్రమం చేపట్టినా పోలీస్‌శాఖ ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి కార్యక్రమాలను విజయవంతం చేసిన సంగతి గుర్తుచేసారు. క్రమశిక్షణతో పాటు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సమర్ధవంతమైన సేవలు అందిస్తూ విశేష ప్రతిభ కనపరచినందుకు ఈ సేవాపతకం దక్కిందని అధికారులు కొనియాడారు. నగరంలో శాంతిభ్రదతలు కాపాడటంలో రాజశేఖరబాబు నాయకత్వం ఎంతో కీలకమైందని అభినందనలు తెలిపారు.

మరో ఐదు జబ్బులకు వైకల్యాల గుర్తింపు

విజయవాడ,మార్చి18,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రం ప్రభుత్వం మరో ఐదు జబ్బులకు వైకల్యాల గుర్తింపు ఇవ్వనుంది. ఇప్పుడు అందిస్తున్న 16 జబ్బులతో పాటు ఆమ్ల దాడి బాధితులు, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ డిసేబిలిటీ, స్పెసిఫిక్ లెర్నింగ్ డిసేబిలిటీ, ఆటిజం స్పెక్ట్రమ్ మల్టిపుల్ డిసేబిలిటీస్‌లను కొత్తగా ఈ జాబితాలో చేర్చింది.ఈ మేరకు వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసేబిలిటీస్(ఆర్‌పిడబ్ల్యూడి) యాక్ట్ ప్రకారం ఈ జబ్బులను చేర్చినట్లు వివరించారు. సదరం కింద ఇకపై వైకల్యాల గుర్తింపు సర్టిఫికెట్లను పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ విధానంలో మాత్రమే ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు తగట్టుగా సాంకేతిక పరిజ్ఞానానికి తగ్గట్లు కొత్త సాఫ్ట్‌వేరును రూపొందించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం 13 రకాల డబ్బులకు డిజిలైజేషన్, మూడు రకాల డబ్బులకు మాన్యువల్ విధానంలో సర్టిఫికేట్లు ఇస్తున్నట్లు వివరించారు. హేమోఫిలియా, తలసేమియా, సికిల్ సెల్ డబ్బులకు మ్యానువల్ సర్టిఫికేట్లు ఇస్తున్నారని, తాజా నిర్ణయం ప్రకారం వీటితో పాటు కొత్తగా చేర్చే 5 రకాల డబ్బులకు కూడా ఆన్‌లైన్ ద్వారానే అందిస్తామన్నారు. ఈ నెల 25 నుంచి స్లాట్ బుకింగ్ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా మొదలవుతుందని, 30వ తేది నుంచి ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు ప్రారంభమవుతాయని వివరించారు. ఇప్పటివరకు 40శాతం ప్రామాణికంగా జారీ చేసే వైకల్యాల సర్టిఫికెట్లను, ఇకపై వైకల్య శాతం ఎంత ఉన్నా ఇస్తామని వెల్లడించారు. పెన్షన్ వంటి ప్రయోజనాలు 40శాతం అంతకంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్నవారికి మాత్రమే అందుతాయని తెలిపారు.

ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి హతం

టెహ్రాన్, మార్చి 18: మధ్యప్రాచ్యం మంటలు ఎక్కడా తగ్గుతున్న సూచనలు లేవు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్‌లు చేస్తున్న సంయుక్త దాడులు మరింత ఉగ్రరూపం దాల్చాయి. హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి కేంద్రాలపై అతిపెద్ద బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించారు. ఒక్కొక్కటి 2200 కిలోల బరువుండే ఈ బాంబులతో ఆప్రాంతం మొత్తం హోరెత్తించారు. హర్మూజ్ జలసంధి రక్షణకు పునరుద్ధరణకు కలిసి రావాలన్న ట్రంప్ పిలుపునకు మిత్రదేశాలు కలిసిరాకపోవడం, నాటో కూటమి సైతం స్పందించకపోవడంతో ట్రంప్ తానే నేరుగా రంగంలోకి దిగి బంకర్‌బస్టర్ బాంబులతో క్షిపణిస్థావరాల విధ్వంసం షురూచేసారు. ఇదిలా ఉంటే ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖాతిబ్‌ను వైమానిక దాడుల్లో అంతం చేసామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ వెల్లడించారు. ఇరాన్ సుప్రీం కమాండర్‌ను కూడా వెంటాడి హతమారుస్తామంటూ హెచ్చరికలు చేయడం ఇరాన్‌ను రెచ్చగొట్టినట్ల యింది. ఇప్పటికే సెక్యూరిటీ చీఫ్ ఆలి లారిజాని తన కుమారుడితోసహా ఇజ్రాయెల్ దళాలు మట్టుబెట్టాయి. ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఖాతిబ్‌పై అమెరికా 2022 నుంచి కూడా ఆంక్షలు విదించింది. ఇప్పటికే ఇరాన్‌లోని బుషెహర్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్‌ను ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసం చేసింది.

అమరావతిలో ప్లాట్ల విభజన

4 వేల గజాల పైబడి 920 ప్లాట్లు

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతి పరిధిలో మాస్టర్ ప్లాను ప్రకారం రైతులకిచ్చిన ప్లాట్లను విభజించే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర స్దాయిలో ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో దీనిపై త్వరలోనే తుదినిర్ణయం తీసుకోనున్నారు. అమరావతి ఏర్పాటు సమయంలో రాజధానిలో నవనగరాల ప్రణాళిక అమలు చేశారు. అనంతరం ఒక్కో ప్రాంతానికి ఒక్కో ప్రాధాన్యత కల్పిస్తూ మాస్టర్‌ను రూపొందించారు. దీనిలో రెసిడెన్షియల్, కమర్షియల్‌గా విభజించి ఒక్కో దానికి ఒక్కో తరహా ప్రాంతాన్ని నిర్దేశించారు. ఒక ప్రాంతంలో ఒకే నిర్దేశిత కట్టడాలు ఉండాలని, దానికి అనుగుణంగానే ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ కూడా ఉండాలని సూచించారు. ఇలా తయారుచేసిన ప్లాట్లను విస్తీర్ణం ఆధారంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. దీనివల్ల మొత్తం రాజధానిలో నిర్మాణాలు ఒకేలా ఉండేలా చూడాలని అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. పలు సందర్భాల్లోనూ ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ప్రస్తుతం రాజధాని పరిధిలో 4 వేలు చదరపు గజాల ప్లాట్లు పైబడి 25 వేల గజాల వరకూ 920 ప్లాట్లు ఉన్నాయి. వీటిల్లో 4 వేల నుండి 5 వేల గజాల వరకూ 512 ప్లాట్లు ఉన్నాయి. 5 వేల నుంచి 6 వేల గజాల వరకూ 186, 6 వేల నుంచి 8 వేల గజాల మధ్యలో 89 ప్లాట్లు ఉన్నాయి. 8 వేల నుంచి 12 వేల గజాల మధ్యలో 88 ప్లాట్లు ఏర్పాటు చేశారు. 12 వేల గజాల నుంచి 13 వేల గజాల మధ్యలో ప్లాట్లు 13, 13 వేల నుంచి 14 వేల గజాల మధ్యలో 6, 15 వేల గజాల నుంచి 16 వేల గజాల మధ్యలో 3, 17 వేల గజాల నుంచి 19 వేల గజాల మధ్యలో ప్లాట్లు 9, 20 వేల గజాల నుంచి 24 వేల గజాల ప్లాట్లు 6, 25 వేల గజాల పాట్లు 10 ఉన్నాయి. ఈ 10లో రెండు దేవాదాయశాఖకు చెందినవి కాగా, మూడు ప్లాట్లు ఒకరివే ఉన్నాయి. ఇటీవల 4 వేల గజాల ప్లాట్లు ఒకటీ ఆరా కలిశాయి. ప్రస్తుతం రైతులు కొద్ది మంది తమ ప్లాట్లు అమ్మకానికి వీలు కావడం లేదని, విడగొట్టాలని కోరినట్లు తెలిసింది. ఈ విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. అయితే అధికారులు మాత్రం ఇలా విడగొట్టుకుంటూ పోతే మాస్టర్ ప్లాను ఇబ్బందులొస్తాయని, ఒకవేళ ఇంటి నిర్మాణంలో అత్యవసరం అనుకుంటే ఒకటీ రెండు ప్లాట్లు కలిపినా ఇబ్బంది ఉండదని తెలిపినట్లు తెలిసింది. పెద్దప్లాట్లు ఉండే ప్రాంతంలో రోడ్ల విస్తీర్ణం, జోనింగ్ రెగ్యులేషన్లు వేరుగా ఉన్నాయని, అక్కడ చిన్నప్లాట్లు వేస్తే మొత్తం వ్యవస్థలో మార్పులు చేయాల్సి వస్తుందని, మాస్టర్ ప్లాను ఆమలు వీలుకాదని తెలిపినట్లు సమాచారం. అదే సమయంలో రాజధాని కోసం భూములిచ్చిన రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంటే పెద్ద ప్లాట్లను 4800, 2400 గజాల వరకు విభజనకు అవకాశం ఇవ్వాలనే కోణంలో పరిశీలన చేస్తున్నట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికలో అన్ని తప్పులే

చివరికి సరిదిద్దుకున్న రాష్ట్ర సంస్కృతి, సృజనాత్మక సమితి

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంస్కృతి, సృజనాత్మక సమితి తెలుగు వారి ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికలో అక్షరదోషాలు చోటు చేసుకోవడం వివాదస్పదంగా మారింది.ఏపీ ప్రభుత్వం పరిధిలోని రాష్ట్ర సంస్కృతి, సృజనాత్మక సమితి ఉగాది వేడుకలను విజయవాడలో నిర్వహిస్తుంది. మొదట ఈ వేడుకలను అంబేద్కర్ స్వరాజ్ మైదానంలోని విజ్ఞాన కేంద్రంలో నిర్వహించాలనుకున్నారు. ఆ దిశలో ప్రకటన వెలువడింది. చివరి దశలో తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలోకి ఉత్సవాలను నిర్వహించేందుకు నిర్ణయించారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే తెలుగు నూతన సంవత్సరాది ఉగాది వేడుకల ఆహ్వాన పత్రికను రాష్ట్ర సంస్కృతి, సృజనాత్మక సమితి సంస్థ అక్షర దోషాలతో నింపేసింది. ఆహ్వానపత్రికలో అనేక అక్షర దోషాలున్నాయి. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధుల పేర్లు, వారు నిర్వహిస్తున్న శాఖల పేర్లు తప్పుగా రాశారు.

ఆహ్వానపత్రిక రూపొందించిన వారికి ప్రస్తుతం పదవుల్లో ఉన్న వారెవరు? మాజీలు ఎవరన్న కనీస పరిజ్ఞానం కూడా కొరవడింది. పరాభవ నామ సంవత్సర అని రాయాల్సిన చోట సంవత్సరు అని ముద్రించారు. పి.అశోక్‌బాబు, కె.ఎస్.లక్ష్మణరావు పదవీకాలం ముగిసి చాన్నాళ్లయినా ఆహ్వానపత్రికలో వారిని ప్రస్తుతం ఎమ్మెల్సీలుగా పేర్కొన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఇంటి పేరు మండిపల్లి అయితే ఆహ్వానపత్రికలో మందపల్లి అని రాశారు. శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ జకియా ఖానమ్ పేరును జకియా ఖానవ్ అని, ఉపసభాపతి, రఘురామకృష్ణరాజు పేరును రఘురామ కృష్ణంరాజు అని తప్పుగా రాశారు.

మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి నిర్వహిస్తున్న శాఖల్లో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ ఒకటి కాగా దాని పేరును ఆహ్వానపత్రికలో సచివాలయం, గ్రామ వాలంటీర్ శాఖగా పేర్కొన్నారు. కొమ్మారెడ్డి పట్టాభిరామ్ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కాగా స్వచ్ఛాంధ్ర కమీషన్ ఛైర్మన్ అని ముద్రించారు. ఆహ్వానపత్రికను తప్పుల తడకగా రూపొందించడంపై విమర్శలు రావడంతో వాటిని సరిచేసి కొత్త ఆహ్వానపత్రికలను ముద్రించేందుకు సృజనాత్మకత, సంస్కృతి శాఖ చర్యలు చేపట్టింది. చివరికి అధికారులు తప్పులు సరిచేసారు.

ద్రోణి ప్రభావంతో ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

గాలి వాన బీభత్సం

- తుళ్లూరులో పిడుగుపాటుకు ఒకరి మృతి
- గాలివానకు నేలకొరిగిన మొక్కజొన్న, పెసర
- నేలరాలిన మామిడి పండ్లు, అరటి గెలలు
- రైతన్నలు ఆందోళన... ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీలో ద్రోణి ప్రభావంతో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మండుతున్న ఎండల నుంచి ప్రజలంతా కాస్త ఉపశమనం పొందారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు దంచికొడుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పిడుగులు, వడగళ్లతో కూడిన వర్షం పడుతోంది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఎన్టీఆర్ జిల్లాలోని నందిగామ మండలం మాగల్లు గ్రామం వద్ద గాలివానకు మొక్కజొన్న, పెసర పంట నేలమట్టమైంది. మొక్కజొన్న చేతి కందే దశలో నేలకొరిగి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గుంటూరు జిల్లాలోని తుళ్లూరులో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక మేరీమాత స్కూల్ మైదానంలో పిడుగుపడింది. అదే సమయంలో అక్కడే ఉన్న శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలిస్తుండగా ఆయన మృతి చెందారు. మృతుడు బీఎస్‌ఆర్ కంపెనీలో సర్వేయర్ విభాగ మేనేజర్‌గా పని చేస్తున్నారు. అదే విధంగా నంద్యాల జిల్లాలోని పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామంలో వర్షానికి గోడ కూలి ఏడాది బాలుడు మృతి చెందాడు. కాగా మృతుడి కుటుంబాన్ని ఎమ్మెల్యే జయసూర్య పరామర్శించారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలో మొవ్వ, తోట్లవల్లూరు, పెదపారుపూడి, పామర్రు మండలాల్లో మినప తీతలు నూర్పిడి దశలో ఉన్నాయి. కాగా ఈ అకాల వర్షాల వల్ల ఏం చేయాలో తెలియక రైతుల ఆందోళన చెందుతున్నారు. పమిడిముక్కల మండలంలో అనూహ్యంగా ఒక్కసారిగా మారిన వాతావరణం చల్లటి గాలులతో మేఘాలు ఏర్పడి చిరుజల్లులతో మొదలయ్యాయి. పంటలు చేతికందే సమయంలో వడగళ్ల వాన పడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట పట్టణంలో భారీ వర్షం కురిసింది. ఇప్పటి వరకు ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఒక్కసారిగా వర్షం పడటంతో కొంత ఊరట లభించింది. ఉదయం నుంచి మేఘామృతమై ఉన్నప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం పడటంతో పట్టణంలోని పలు బజార్లు నీటితో నిండిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా ఈ అకాల వర్షాల తమ మిర్చి పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందారు.

పదోతరగతి మూల్యాంకనంలో నిర్లక్ష్యం చేస్తే జరిమానా

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్)లో మార్కుల నమోదు, రీవెరిఫికేషన్, రీకౌంటింగ్‌లో సిబ్బంది నిర్లక్ష్యంలో వ్యవహరిస్తే చర్యలు తీసుకునేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఇప్పటికే ఇంటర్మీడియట్‌లో ఉన్న నిబంధనలను ఈ ఏడాది పదో తరగతి మూల్యాంకనానికి అమలు చేయనుంది. పదోతరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4 నుంచి 10 వరకు నిర్వహించనున్నారు. గతేడాది మార్కుల కౌంటింగ్‌లో కొన్ని తప్పిదాలు చోటుచేసుకున్నందున ఈసారి విద్యార్థులకు అన్యాయం జరగకుండా ఉండేందుకు తప్పు చేసిన సిబ్బందికి జరిమానా విధించేలా నిబంధనలు తీసుకొచ్చింది. ట్యాబ్‌లలో మార్కులు నమోదుచేయడం వల్ల కౌంటింగ్‌లో తప్పులు తగ్గుతాయి. ఒకవేళ మూల్యాంకనంలో నిర్లక్ష్యం, లోపాలను గుర్తిస్తే నివేదికను కమిషనర్, డైరెక్టర్‌కు సమర్పిస్తారు. ముందుగా సిబ్బంది వివరణ కోరుతూ నోటీసులు ఇస్తారు. వివరణ ఇచ్చిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటారు.

ఉన్నత విద్యా మండలి నిర్వీర్యం తగదు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఉన్నత విద్యా మండలి నిర్వీర్యం చేయాలనుకోవడం దుర్మార్గం సిపిఐ రాష్ట్రసమితి కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. "దేశంలో మొట్టమొదటిసారిగా 1988లో నాటి ముఖ్యమంత్రి ఉన్నత విద్యా మండలి నందమూరి తారక రామారావు ఏర్పాటు చేశారు. ఉన్నత విద్యలో సలహాలు పర్యవేక్షణ ప్రమాణాలు పెంచాలన్నది ఉన్నత విద్యామండలి లక్ష్యం. ప్రభుత్వం కార్పొరేట్ కళాశాలల యాజమాన్యం కుమ్మక్కై కళాశాల విద్యను కమిషనరేట్‌కు బదలాయించడం సరైనది కాదు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల అనుమతులు, లక్షలాది రూపాయల ఫీజుల దోపిడీ కోసమే విద్యా మండలి నిర్వీర్యం. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉన్నత విద్యా మండలిని స్వయం ప్రతిగత్తి గల సంస్థగా పాత పద్దతిలో కొనసాగించాలి" అని ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

విజయవాడలో వైసిపి ఇఫ్తార్ విందు

మాజీ సిఎం వైయస్ జగన్ హాజరు

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ముస్లిం మైనార్టీలకు ఎప్పుడు అండగా ఉంటానని మాజీ సీఎం జగన్ అన్నారు.ముస్లిం సోదరులందరికి రంజాన్ పర్వదినం సందర్భంగా ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని విజయవాడలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలు, ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరైన ఈ కార్యక్రమంలో వైయస్ జగన్ ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అందరికీ ఈద్ ముబారక్ అంటూ ఉర్దూలో ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసి, శాంతి, సోదరభావం, పరస్పర గౌరవం సమాజానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. రంజాన్ మాసం సేవా భావం, సామరస్యం, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా, సామరస్యంతో జీవించాలని ఆకాంక్షించారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదికగా జరిగిన ఈ ఇఫ్తార్ విందులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

విజయవాడ, మార్చి 18 ప్రభాతవార్త ప్రతినిధి: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10.57 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి పి రంజిత్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 3,86,886 మంది హాజరయ్యారని వెల్లడించారు. మైనర్ సబ్జెక్టులు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 21 నుంచి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలను విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. మూల్యాంకనం పారదర్శకంగా, తప్పులు లేకుండా చేసేందుకు సూచనలు, పెనాల్టీలు జారీ చేశామన్నారు.

19-3pg10exH 12 ONG_19-3pg10exH.qxd 18/Mar/26 10:43 PM Page 1

ఐపిఎల్‌లో అన్ లక్కీ హీరోలు

రన్ అవుట్ జాబితాలో దిగ్గజాలు.. అగ్రస్థానంలో హెడ్‌కోచ్ గంభీర్

న్యూఢిల్లీ: మరో పది రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2026 సందడి మొదలవ్వనుంది. ఈ నెల 28న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ ప్రారంభం కానుంది. అయితే ఇదే సమయంలో ఈ మెగా టోర్నీ చరిత్రలో రన్ అవుట్‌కు సంబంధించి ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా బ్యాటర్లకు అత్యంత భారంగా అనిపించే రన్ అవుట్ గణాంకాలను గమనిస్తే పలువురు దిగ్గజ ఆటగాళ్ల పేర్లు ఆ జాబితాలో ఉండటం విశేషం. క్రీజులో ఒక్క పరుగు కోసం ఆశపడి లేదా తోటి బ్యాటర్‌తో సమన్వయ లోపం కారణంగా విలువైన వికెట్లను సమర్పించుకున్న వారిలో టీమిండియా ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అగ్రస్థానంలో నిలిచాడు. గంభీర్ తన ఐపీఎల్ ప్రస్థానంలో ఆడిన 154 మ్యాచ్‌ల్లో ఏకంగా 16 సార్లు రన్ అవుట్ అయ్యి ఈ అన్‌లక్కీ రికార్డును మూటగట్టుకున్నాడు. గంభీర్‌తో పాటు టీమిండియా మాజీ స్టార్ ఓపెనర్

శిఖర్ ధావన్ కూడా ఇదే తరహాలో 16 సార్లు రన్ అవుట్ అయ్యి మొదటి స్థానాన్ని పంచుకున్నాడు. 2008 నుంచి 2024 వరకు సాగిన తన సుదీర్ఘ ఐపీఎల్ కెరీర్‌లో ధావన్ 222 మ్యాచ్‌లు ఆడి అనేకసార్లు పరుగుల కోసం ప్రయత్నిస్తూ వికెట్ పారేసుకున్నాడు. వీరిద్దరూ క్రీజులో పరుగుల వేటలో ఎంత వేగంగా దూసుకెళ్తారో, కొన్నిసార్లు అంతే వేగంగా దురదృష్టవశాత్తూ అవుట్ అవ్వడం విశేషం. మైదానంలో అత్యంత చురుగ్గా ఉండే ఈ ఆటగాళ్లే రన్ అవుట్లలో టాప్ ప్లేస్‌లో ఉండటం గమనార్హం. ఈ జాబితాలో తర్వాతి స్థానంలో సీనియర్ వికెట్ కీపర్ బ్యాటర్ దినేష్ కార్తీక్ నిలిచాడు. మొత్తం 257 మ్యాచ్‌లు ఆడిన కార్తీక్, తన కెరీర్‌లో 15 సార్లు రన్ అవుట్ అయ్యాడు. సాధారణంగా కార్తీక్ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లలో బ్యాటింగ్‌కు వస్తుంటాడు. ఆ సమయంలో స్కోరు బోర్డును పరుగుల ఒత్తిడిలో వేగంగా సింగిల్స్, డబుల్స్ తీయబోయి రన్ అవుట్‌గా వెనుదిరిగేవాడు. ఫినిషర్‌గా జట్టుకు భారీ స్కోరు అందించే క్రమంలో ఆయన ఈ చేదు అనుభవాన్ని పదిహేను సార్లు చవిచూశాడు. కేవలం కార్తీక్ మాత్రమే కాకుండా టీమిండియా ఆటగాళ్లు సురేష్ రైనా, అంబటి రాయుడు కూడా ఈ రన్ అవుట్ల గండం నుంచి తప్పించుకోలేకపోయారు. రైనా 205 మ్యాచ్‌ల్లో, రాయుడు 204 మ్యాచ్‌ల్లో చెరో 15 సార్లు రన్ అవుట్ అయ్యి కార్తీక్‌తో సమానంగా రెండో స్థానంలో నిలిచారు. ఐపీఎల్ 2026లో మరికొన్ని కొత్త నిబంధనలు వస్తున్న తరుణంలో, ఈ రన్ అవుట్ల సంఖ్య తగ్గుతుందో లేదో చూడాలి.

వరల్డ్ చాంప్ అంతిమ్ ఓటమి

న్యూఢిల్లీ: రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత అయిన అంతిమ్ పంఘల్ ఓటమితో 2026 ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో అర్హత నుంచి అనూహ్యంగా నిష్క్రమించింది. దీంతో భారత జట్టులో చోటు కోల్పోవాల్సి వచ్చింది. మహిళల 53 కేజీల ఫైనల్లో, స్కోరు బోర్డుపై 2-6తో వెనుకబడిన ఆమె, చివరి క్షణాల్లో 25 ఏళ్ల మీనాక్షి చేతిలో పిన్‌ఫాల్‌తో ఓడిపోయింది. ఆంతిమ్ ప్రయత్నించిన అన్ని మూవ్స్‌ను మీనాక్షి సమర్థవంతంగా తిప్పికొట్టి, తొలిసారిగా సీనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌కు తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. ఆమె ఈ సంవత్సరం కూడా తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తూ, ప్రో రెజ్లింగ్ లీగ్‌లో పర్ఫెక్ట్ రికార్డు సాధించి, ఆ తర్వాత ముహమెట్ మాలో ర్యాంకింగ్ సిరీస్‌లో రజత పతకాన్ని గెలుచుకుంది. ఇక హెవీవెయిట్ విభాగం మహిళల 76 కేజీల ఫైనల్‌లో ఫేవరెట్‌గా ఉన్న ప్రియా మాలిక్‌ను కాజల్ ధోచక్ వెనుక నుండి వచ్చి 4-2 తేడాతో ఓడించింది. మరోవైపు, నీలం సిరోహి (50 కేజీలు), మనీషా భాన్వాలా (57 కేజీలు) వంటి ఇతర అగ్రశ్రేణి రెజ్లర్లు ఆధిక్యతతో గెలుపొందారు. డిఫెండింగ్ ఛాంపియన్ మనీషా ఈసారి 62 కేజీల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. మరోవైపు, మాజీ ప్రపంచ పతక విజేత మాన్సీ అహ్లావత్, సవిత, భాగ్యశ్రీ ఫాండ్‌లపై విజయాలు సాధించి 62 కేజీల వెయిట్ క్లాస్‌లో స్థానం సంపాదించారు.

మరోవైపు, గాయం కారణంగా నిషా దహియా ఎంపిక ట్రయల్స్ నుండి వైదొలగడంతో, 68 కేజీల వెయిట్ క్లాస్‌లో మాన్సీ లాథర్ స్థానం సంపాదించింది.

న్యూఢిల్లీ: ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ప్లేయర్లు టాప్ 5లో ఏకంగా మూడు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మహిళల విభాగంలో స్టార్ ఓపెనర్, మహిళా టీం వైస్ కెప్టెన్ స్మృతి మంధాన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్‌కు చెందిన నాట్ స్కివర్‌బ్రంట్ రెండో స్థానంలో, భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐదో స్థానంలో నిలిచి టాప్5లో చోటు సంపాదించుకుంది. ఆస్ట్రేలియాకు చెందిన బెత్ మూనీ, దక్షిణాఫ్రికాకు చెందిన లారా వోల్వార్డ్ కూడా మెరుగైన ర్యాంకులు సాధించారు. ఇక పురుషుల విషయంలో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచి తన ఫామ్‌ను చాటుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో, భారత కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచారు. బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నారు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తర్వాతి స్థానాల్లో నమీబియాకు చెందిన బెర్నార్డ్ స్కోల్జ్ నాలుగో స్థానంలో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో కూడా ఆఫ్ఘనిస్తాన్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానంలో ఉండగా, సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్) టాప్3లో నిలిచారు.

సింగపూర్ నేషనల్స్‌లో.. ఆస్థాకు రజతం

న్యూఢిల్లీ: సింగపూర్ నేషనల్స్ ఏజ్ గ్రూప్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన ఆస్థా చౌదరి 200 మీటర్ల బటర్‌ఫ్లైలో అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసింది. నాలుగేళ్ల క్రితం అపేక్ష ఫెర్నాండెజ్ నెలకొల్పిన 2:18.18 సెకన్ల రికార్డును 22 ఏళ్ల ఈమె ఒక సెకనుకు పైగా మెరుగుపరిచి, సూపర్ ఫైనల్‌లో 2:17.09 సెకన్లతో రెండవ స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. జపాన్‌కు చెందిన మత్సురాయు (2:15.91 సెకన్లు) వెనుక నిలిచి, ఓవరాల్ విభాగంలో ఆమె స్వర్ణ పతకాన్ని కోల్పోయినప్పటికీ, ఆస్థా ఆశాజనకమైన ఆరంభాన్ని పొందింది. అయితే మత్సురాయు ప్రధానంగా అండర్ 17 విభాగంలో పోటీ పడటంతో, ఆస్థా కూడా 18 ఏళ్లు పైబడిన వారి విభాగంలో అగ్రస్థానంలో నిలిచి, సీనియర్ విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఈ రోజు అంతకుముందు జరిగిన ప్రిలిమినరీ రౌండ్‌లో ఆస్థా 2:18.37 సెకన్ల సమయాన్ని నమోదు చేసి, తన హీట్‌లో మొదటి స్థానంలో నిలిచి సూపర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. అంతకు ముందు భారత్ మరో 3 పతకాలను కైవసం చేసుకుంది. షిరిన్ (1500మీ ఫ్రీస్టైల్), శ్రీహరి నటరాజ్ (100మీ బ్యాక్‌స్ట్రోక్) రజత పతకాలను గెలుచుకోగా, సాజన్ ప్రకాష్ 200మీ ఇండివిడ్యువల్ మెడ్లేలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

వరల్డ్ బాక్సింగ్ కప్.. చంద్రికకు టైటిల్

న్యూఢిల్లీ: వరల్డ్ బాక్సింగ్ ఫ్యూచర్స్ కప్-2026 మహిళల 51 కేజీల టైటిల్‌ను చంద్రిక పూజారి కైవసం చేసుకుంది. దీంతో బ్యాంకాక్‌లో జరిగిన ఈ పోటీల్లో భారత్ ఒక స్వర్ణం, మూడు రజతాలు, ఒక కాంస్యంతో సహా ఐదు పతకాలను సాధించి తన ప్రచారాన్ని ముగించింది. మహిళల 51 కేజీల ఫైనల్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచిన చంద్రిక ఉజ్బెకిస్తాన్‌కు చెందిన మర్దోనోవా నజోకాట్‌ను ఓడించింది. యూత్ ఒలింపిక్ వెయిట్ కేటగిరీలలో తమతమ విభాగాలలో ఫైనల్స్‌కు చేరిన ముగ్గురు భారత బాక్సర్లు రజత పతకాలతో సరిపెట్టుకున్నారు. గుంజన్ (48 కేజీలు) ఇంగ్లాండ్‌కు చెందిన తన ప్రత్యర్థి చేతిలో 5-0 తేడాతో ఓడిపోగా, జయశ్రీ దేవి (54 కేజీలు) గట్టిగా పోరాడినా అమెరికాకు చెందిన బాక్సర్ చేతిలో 4-1 తేడాతో పరాజయం పాలయింది. పురుషుల 50 కేజీల విభాగంలో, ఎల్. అంబేకర్ మీతేయ్ కూడా ఉక్రెయిన్‌తో జరిగిన తన చివరి బౌట్‌లో ఓడిపోయి రజతంతో సరిపెట్టుకున్నాడు. అంతకు ముందు ఉక్రెయిన్‌కు చెందిన యెవాన్‌హెలినా పెట్రుక్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో సెమీఫైనల్స్‌లో నిష్క్రమించిన తర్వాత రాధామణి లాంగ్‌జామ్ (57 కేజీలు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది.

లాభాల్లో హ్యాట్రిక్ కొట్టిన సెన్సెక్స్, నిఫ్టీ షేర్లు

రూ.6 లక్షలకోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబయి, మార్చి 18: దేశీ ఈక్విటీమార్కెట్లు బుధవారం భారీ లాభాల దిశగా దూసుకుపోయాయి. వరుసగా మూడోరోజు కూడా లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీలు హ్యాట్రిక్ కొట్టాయి. ఇన్వెస్టర్ల సంపద ఏకంగా ఆరు లక్షలకోట్లు పెరిగింది. బిఎస్ఇలో లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువలు ఒక్కసారిగాపెరిగి 439 లక్షలకోట్లకు పెరిగింది. ఇన్వెస్టర్లు ఎక్కువగా ఫెడ్‌రి జర్వు పాలసీ నిర్ణయాలపైనే ఫోకస్ పెంచారు.బిఎస్ఇ సెన్సెక్స్ 633.29 పాయింట్లుపెరిగి 76,704.13 పాయింట్లవద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 196.65 పాయింట్లుపెరిగి 23,777.80 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.87శాతం, నిఫ్టీ 2.71శాతం చొప్పున లాభపడ్డాయి. ఇన్ఫోసిస్ 2.74శాతం,మహీంద్ర అండ్ మహీంద్ర 2.66శాతం, భారతి ఎయిర్‌టెల్ 1.53శాతం చొప్పున పెరిగాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 1.80శాతంపెరిగితే బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 2.05శాతం పెరిగింది. మార్కెట్లపరంగా బిఎస్ఇలో 3202 కంపెనీలషేర్లుపెరిగితే 1088 షేర్లుక్షీణించాయి. 147 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి రికార్డుకనిష్టానికి క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 92.65కి చేరింది. గత ముగింపు 94.20తో పోలిస్తే మరింతగా క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌నెల నాటి సెటిల్‌మెంట్లు 0.39శాతం క్షీణించి రూ. 1,55,370కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్ మెంట్లు 15 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 103.57 డాలర్లుగా కొనసాగింది. ఎల్ అండ్‌టి 1.75శాతంపెరిగితే అర్బన్‌కంపెనీ కూడా 10.33వాతం పెరిగింది. బొడాడా ఇంజనీరింగ్ 3.07శాతం, స్ట్రైడ్స్ ఫార్మా సైన్స్ 3.29శాతం పెరిగింది. మాన్‌కైండ్ ఫార్మాకూడా 1.72శాతంపెరిగింది. ప్రెసి షన్ వైర్స్ ఇండియా 6.51శాతం పెరిగితే ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ 0.16శాతం క్షీణించింది. ప్రాక్టల్ ఎనలిటిక్స్ మాత్రం 1.19శాతంపెరిగింది. ఇక ఐపిఒలపరంగా జిఎస్‌పి క్రాప్‌సైన్స్ ఐపిఒ బిడ్డింగ్‌లో 1.60రెట్లు కొనుగోళ్లుజరిగినట్లు తేలింది. ఐపిఒ ధరలు రూ.304నుంచి 320గా కంపెనీ నిర్ణయించిన సంగతి తెలిసిందే.

వాడుకలోలేని ఖాతాలపై పిఎన్బీ హెచ్చరిక

కెవైసి అప్‌డేట్ లేకుంటే మూసివేస్తాం

ముంబయి, మార్చి 18: ప్రభుత్వ రంగ బ్యాంకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఇనాపరేటివ్‌ఖాతాల కస్టమర్లను హెచ్చరించింది. చాలా కాలంగా వాడుకలో లేని (ఇన్‌ఆపరేటివ్) ఖాతాలను పునరుద్ధరించుకోవాలని ఇందుకోసం నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపింది. వచ్చేనెల 15వ తేదీలోగా కేవైసీ అప్‌డేట్ చేయని ఖాతాలను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా మూసివేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు బ్యాంకు తన సోషల్ మీడియాలో ప్రకటిం చింది. గడువు ముగిసిన తర్వాత అకౌంట్ క్లోజ్ అయితే, ఎలాంటి బ్యాం కింగ్ లావాదేవీలు జరపడం సాధ్యం కాదని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం ఒక సేవింగ్స్ లేదా కరెంట్ ఖాతాలో కస్టమర్ వరుసగా రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం పాటు ఎలాంటి లావాదేవీలు నిర్వహించకపోతే, ఆ ఖాతాను ఇన్ ఆపరేటివ్ అకౌంట్‌గా వర్గీ కరిస్తారు. ఇలాంటి ఖాతాలపైనే పీఎన్‌బీ తాజా ప్రకటన చేసింది. ఖాతా దారులు తమ ఖాతాను తిరిగి యాక్టివేట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తు న్నట్లు తెలిపింది. కవైసీ ప్రక్రియ అంటే కస్టమర్ తన గుర్తింపు, చిరునామా వివరాలను బ్యాంకు వద్ద అప్‌డేట్ చేసుకోవడమే. ఆధార్ కార్డు, పాన్ కార్డు వంటి అధికారిక పత్రాలను బ్యాంకు శాఖలో సమర్పించి కేవైసీని పూర్తి చేయవచ్చు. కొన్ని సందర్భాల్లో బ్యాంకులు ఆన్‌లైన్ ద్వారా కూడా కేవైసీ అప్‌డేట్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పిస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండటం సర్వసాధారణమైపోయింది. ఉద్యోగం మారినప్పుడు కొత్తగా శాలరీ అకౌంట్ తెరవడం, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడానికి ప్రత్యేక ఖాతా, ఇతర వ్యక్తిగత అవసరాల కోసం అకౌంట్లు తెరవడం వంటి కారణాలతో ఖాతాల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో అన్నిఖాతాలను చురుగ్గా నిర్వహించడం చాలా మందికి కష్టమవు తుంది. కొన్ని ఖాతాలలో కనీస బ్యాలెన్స్ కూడా మెయింటెయిన్ చేయలేకపోవడంతో వాటిని పూర్తిగా పక్కన పెట్టేస్తుంటారు. దీర్ఘకాలంగా లావాదేవీలు జరగని ఖాతాలపైనే బ్యాంకులు దృష్టి సారిస్తున్నాయి.

రికార్డు కనిష్టానికి క్షీణించిన రూపాయి: డాలర్ వర్సెస్ రూపీ 92.63

ముంబయి, మార్చి 18:అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరోసారి రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. బుధవారం ట్రేడింగ్‌లో రూపాయి విలువ 92.63 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు విత్‌డ్రా కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో బుధవారం ఉదయం 92.42 వద్ద ప్రారంభమైన రూపాయి, ఆ తర్వాత మరింత బలహీనపడింది. మంగళవారం రూపాయి 92.37 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఒకదశలో 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు. మరోవైపు పెరుగుతున్న దిగుమతుల బిల్లుల కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ వీపీ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది అన్నారు. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల అధిక ముడి చమురు ధరలు, హర్ముజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయాలు కలగడం వంటి అంశాలు భారత్‌కు దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థూల ఆర్థిక పరిస్థితులు రూపాయికి ప్రతికూలంగా ఉన్నాయని రానున్న రోజుల్లో డాలర్‌తో రూపాయి విలువ 92.25 నుంచి 92.95 శ్రేణిలో కదలాడవచ్చని త్రివేది అంచనా వేశారు.

చమురు మార్కెట్లు అతలాకుతలం

బ్యారెల్ ముడిచమురు 103 డాలర్లు

టెహ్రాన్, మార్చి 18: ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ఇరాన్ భద్రతా వ్యవహారాల వ్యూహకర్త అలీ లారిజానీ మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ప్రపంచ చమురు మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. కొన్ని గంటల వ్యవధిలోనే బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 103 డాలర్లను దాటి, ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక ఆందోళనలకు కారణమైంది. లారిజానీ మరణానికి ప్రతీకారంగా హర్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు 20 శాతం ఈ మార్గం గుండానే జరుగుతుంది. ఇప్పటికే అమెరికా ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరుతో ఈ ప్రాంతంలో భారీ బాంబు దాడులు నిర్వహిస్తుండటంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. సప్లై చైన్ దెబ్బతినే ప్రమాదం ఉండటంతో చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

యాపిల్ కంపెనీని నడిపించేందుకే కట్టుబడిఉన్నా: టిమ్ కుక్

వాషింగ్టన్, మార్చి 18: టెక్ దిగ్గజం యాపిల్ సీఈవో టిమ్ కుక్ తన పదవీ విరమణపై వస్తున్న ఊహాగానాలకు బ్రేక్ వేసారు. యాపిల్ కంపెనీని నడిపించేందుకే తాను కట్టుబడి ఉన్నానని, ప్రస్తుతానికి తప్పుకునే ఆలోచన లేదని కుక్ స్పష్టం చేశారు. టిమ్ కుక్ తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఎన్నడూ చెప్పలేదని, అదొకపుకారు మాత్రమేనని అన్నారు. దాదాపు మూడు దశాబ్దా లుగా యాపిల్‌తో తనకున్న అనుబం ధాన్నిగుర్తు చేసుకుంటూ నేను చేస్తున్న పనిని ఎంతగానో ప్రేమిస్తున్నాను. యాపిల్ లేని జీవితాన్ని నేను ఊహించలేనని భావోద్వేగంగా తెలిపారు.

ఆధార్‌తో పాన్ దరఖాస్తు మార్చి 31 వరకే..

న్యూఢిల్లీ, మార్చి 18: ఆధార్‌తో పాన్ దరఖాస్తు మార్చి 31 వరకే విధించారు. ఆ గడువు దాటితే. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత కొత్త పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ఆధార్ కార్డుతో పాటు అదనపు డాక్యుమెంట్లను కూడా జత చేయాల్సి ఉంటుంది. కేవలం ఆధార్‌తోనే పాన్ పొందాలనుకుంటే మాత్రం మార్చి31వ తేదీయే తుది గడువు అని కేంద్రానికి చెందిన కామన్ సర్వీస్ సెంటర్ తెలిపింది. బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలకు సంబంధించి పాన్ కార్డు అత్యంత కీలకమన్నసంగతి తెలిసిందే. ఇప్పటివరకు నూతన పాన్ కార్డు కోసం ఆధార్ కార్డు కాపీ ఇస్తే సరిపోయేది.అయితే ఏప్రిల్ 1 నుంచి ఆధార్‌తో పాటు బర్త్ సర్టిఫికెట్, ఓటర్ఐడీ కార్డు, మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ వంటి వాటిల్లో ఏదో ఒకటి జత చేయాల్సి ఉంటుంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps